సాహిత్య
# ప్రస్థానం
జూలై 2014

వెల రూ. 10



సాహితీ స్రవంతి



సాహిత్య
ప్రస్థానం
జూలై 2014

సంపుటి : 13 సంచిక : 7

## ఈ సంచికలో...

కవిత... 4
అమ్మచీర (కథ) 5
కవిత 10
జాషువా కవిత్వం తాత్విక సౌందర్యం 11
కథా ప్రస్థానంలో నా ఆలోచనలు అనుభవాలు 15
తెలుగు భాషకు వావిళ్లవారు చేసిన సేవ 20
తీరం దాటిన తుఫాను (కథ) 25
కవిత 29
వి.ఆర్. రాసాని కథల్లో జీవవైవిధ్యం 30
కవిత 33
మహారచయితల వింత అలవాట్లు 34
స్ఫూర్తిదాయక రచన 36
అంతరాలు (కథ) 38
కవిత 43
స్వీకారం 44
డైరీ 47

# బాషా వికాసానికి బాట

నరేంద్రమోడి ప్రభుత్వం ట్విట్టర్‌లో హిందీ భాషనే వాడాలని ఆదేశాలివ్వడంపై అనేక విధాల నిరసనలు వ్యక్తమైనాయి. భిన్న మతాలు జాతులు భాషలతో కూడిన ఈ దేశంలో ఇలాటి పరిస్థితి వూహించలేనిది కాదు. గతంలోనూ ఇలాటి ప్రయత్నాలకు ప్రతిఘటన ఎదురైంది. హిందీ వ్యతిరేకతగా గాక స్వభాషాభిమానంగా దీన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. త్రిభాషా సూత్రం ప్రకారం హిందీ ఇంగ్లీషు మాతృభాష అన్న సూత్రం ఆచరణలో రెండు భాషలుగా మారిపోయింది. తెలుగు పిల్లలు కూడా కనీసం తెలుగు జోలికి పోకుండా ఇంగ్లీషుతో పాటు హిందీ లేదా సంస్కృతం తీసుకునే దురవస్థ చాలా కాలం కొనసాగింది. జాతీయంగానూ హిందీ ఒక్కటే జాతీయ భాష అయినట్టు మిగిలినవి స్థానికమైనవే అన్నట్టు చెప్పడం కూడా వివిధ భాషా రాష్ట్రాల ప్రజలు ఆమోదించలేదు. మరీ ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఇదో పెద్ద సవాలుగా మారింది. తమిళనాడు రాజకీయాల దిశనే మార్చేసింది. ఇప్పుడు వివిధ రకాల సంకుచితత్వాలు కోరలు చాస్తున్న వేళ కొత్తగా హిందీ వివాదాన్ని నెత్తికెత్తుకోవడం తెలివి తక్కువ తనమే. అంతా అయ్యాక తాము హిందీ రాష్ట్రాలకోసమే ఈ పద్ధతి చేపట్టామని ఇతర భాషల వారికి అవసరం లేదని ప్రభుత్వం వెనక్కు తగ్గింది. అయితే మోడీ సర్కారు ఆలోచనా ధోరణి భిన్నంగానే వుందనేది స్పష్టం. హిందీ హిందూ హిందూత్వ అనేది వారి నినాదం. గద్దెక్కిన తర్వాత కనీస సమయం కూడా ఆగకుండానే హిందీ విధిస్తున్నారన్న భావనకు అందుకే ఆస్కారమేర్పడింది. హిందీలోనే అన్ని భాషలూ వున్నాయని ఆ పార్టీ నేత ఒకరు అన్న మాటలు మరింత వేడి పుట్టించాయి. ప్రజాగ్రహానికి జడిసి ఇప్పటికి వెనక్కు తగ్గినా నెమ్మదిగా హిందీ విస్ఫోటనం తీసుకురావాలనే మోడీ ప్రభుత్వం భావిస్తున్నదనేది స్పష్టం. ఈ కారణం చేతనే అంతటి నిరసనా వ్యక్తమైంది. రాజ్యాంగం ప్రకారం అన్ని భాషలకూ సమాన అవకాశాలు ఇవ్వవలసి వుంటుంది. హిందీని ప్రజలందరూ ఆమోదించవలసి వుంటుంది. ఈ ప్రాథమికాంశాలు తెలిసి కూడా ప్రభుత్వం హిందీ కోసం హడావుడి పడటం నిప్పుతో చెలగాటమాడటమే. ఇందుకు బదులుగా తెలుగు, తమిళం, కన్నడం, మళయాళం, గుజరాతీ, బెంగాలీ వంటి దేశీయ భాషలను ప్రోత్సహిస్తే అప్పుడు ఈ సమస్యలే వుండవు. హిందీ కూడా అవసరమైన వారు నేర్చుకుంటారు. అలాగాక బలవంతంగా రుద్దుతున్నారనే అభిప్రాయం వస్తే విముఖత పెరుగుతుంది. విచ్ఛిన్నం కోరేవారికే మేలు జరుగుతుంది.

బొమ్మలు : టి. శివాజి, జె. వెంకటేష్, భాస్కర్

సంపాదకవర్గం

**తెలకపల్లి రవి** (సంపాదకుడు)
**కె.ఆనందాచారి**
**వీరప్రసాద్**
**వల్లభాపురం జనార్దన**

**కె. లక్ష్మయ్య**, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్,
ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర,
హైదరాబాద్-500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ.మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

## కవిత

### పథ దర్శకంగా ఉన్నప్పుడే



డా॥ సి. నారాయణ రెడ్డి

పండగలు చేసుకోగానే సరిపోదు
అవి అందించిన సందేశాలను
ఆచరణ రూపంలో ఆవిష్కరించాలి
గాంధీ జయంతి జరుపుకునేటప్పుడు
ఆ మహాత్ముణ్ణి స్మరించుకోవడమే కాదు
గాడ్సేలు ఈ దేశంలో మళ్లీ మళ్లీ
పుట్టరాదనే సంకల్పానికి
పదును పెట్టుకోవాలి
ఉగాది పచ్చళ్ళను రుచి చూసేటప్పుడు
ఆరు రుచులలోని వైవిధ్యం ఏకత్వంగా మారిన విధానాన్ని
విభిన్న రంగాలకు వర్తింపజేసుకోవాలి
ఉద్యమాల్లో జైజై నినాదాలను
ఉద్ఘోషించడమే కాదు
ఆ ఉద్ఘోషలు కలిగించిన ఉద్దీప్తిని
కొస ఊపిరిదాకా కొనసాగించాలి
సంఘర్షణలు ఉధృతిని అణిచేసే
సమన్వయాలు
వ్యక్తిత్వాల లొంగుబాటుకు
దారితీయొద్దు
తనను కారుమబ్బులు మింగేస్తున్నాయని
సూర్యబింబం తన ప్రస్థానానికి
స్వస్తి చెప్పదు
ఉజ్వలించిన శ్వాసలతో మబ్బులను ఊదేసుకుంటూ
విక్రమిస్తుంది
పండగలైనా ఉద్యమాలైనా
ప్రకృతిలోని ఏ గణనీయ ఘట్టాలైనా
నిత్యజీవిత గతులకు
పథ దర్శకంగా ఉండాలనే సత్యం
చిరస్మరణీయం.

---



## జూన్ నెల పురస్కారాలు



**వికృత క్రీనీడ**
**కథకు : రూ.700/-**
రచయిత : **పాలకొల్లు రామలింగస్వామి**

**మాటల మడుగు**
**కవితకు : రూ.500/-**
రచయిత : **మెర్సీ మార్గరెట్**

*సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*



**వ్యాసం:**
**నల్లూరి రుక్మిణి కథలు: వ్యవసాయ సంక్షోభాలు జీవన గమనాలు**
రచయిత : **నూతంకి గౌరి**

***ఈ రచయితకు 'కర్లపాలెం రుక్మిణమ్మ స్మారక పురస్కారం' రూ. 500/- అందజేయబడుతుంది.***

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.

**- ఎడిటర్**

కథ

# అమ్మచీర

- వేంపల్లి సికిందర్
9666426875



***ఇల్లంతా చిత్తడిగా ఉంది. చలికి చిగురుటాకులా వణికిపోతూ కడుపులో కాళ్ళు పెట్టుకొని గుడిసింట్లో దిగాలుగా కూచోనున్నాడు రాములయ్య.***

***శిథిలావస్థలో ఉన్న గుడిసింట్లో ఒకప్రక్కన రెండు పొయ్యిలు వాటి కవతల రెండు సత్తు బోకులు... ఓ దేక్షా... ఉత్తర దిక్కున కప్పులనుంచి వేలాడుతున్న దండెం కొయ్యకు రంగు వెలసిన, మాసిన చొక్కా నిక్కర్లు .... దానికింద ఉన్న జాజి చెక్కల పెట్టి మీద ప్లాస్టిక్ కవర్లు చుట్టిన పుస్తకాలు.***

ఇల్లంతా నీళ్ళమయం కావడంతో రాత్రంతా నిద్రపోలేదతను. తిండి తిని రెండు రోజులయ్యింది కడుపులో ఒకటే ఆకలిమంటలు – నిస్సత్తువ పదిహేనేళ్ళయినా నిండని రాములయ్యను ఆలోచనలు చుట్టుముట్టాయి.

"నాయనా రాములయ్యా నువ్వన్నా చదువుకోరా... తిండికే వేము నానా యాతనలు పడిపోతాండాము. మనకేమయినా భూములా పాడా... భూములుండే మారాజులే వానల్లేక ఊర్లొదలి పోయినారు. నువ్వయినా సదువుకోని ఉద్యోగస్తుడివయితే యాడైనా మారాజువే రేపటికెట్టా అన్న దిగులే లేదు". తాత బుద్ధి మాటలు గుర్తుకొచ్చాయి.

''అట్టనే తాతా... బాగా సదవతా'' ఎంతో ఆత్మవిశ్వాసంతో అన్నాడు రాములయ్య.

"మా బంగారు కొండ నీకు తెలివి బాగా ఉందబ్బయ్యా... పైకొస్తావ్". అని మెచ్చుకోలుగా అంటూ గాడా బనీను జేబులోంచి రూపాయి బిళ్ళ తన చేతిలో పెట్టాడు తాత. దానివంక గర్వంగా చూసుకొంటున్న తనను చేతుల్లోకి తీసుకొని చంకనెత్తుకొని బుగ్గలు ముద్దాడిన ఆరోజులు తనకింకా గుర్తున్నాయి.

"నాయనోళ్ళు ఎప్పుడొస్తారో ఏమో?! ఈసారి పొయ్యి పదైదుదినాలు పైనే అయ్యింది. ఇప్పటికే వచ్చేసి ఉండాల. రాలేదెందుకో." ప్రశ్నలు చిన్నోడి మదిలో రొదపెడుతున్నాయి.

"అమ్మా నాన్నలకు అడుక్కుతినే ఖర్మ ఎందుకొచ్చింది. పంటలు పండక పరాయి దేశం వచ్చిరి. పనులు దొరక్క తిండికి మొహం వాచిపోయి.... ఏది బడితే అది ఎక్కడ బడితే అక్కడ తినక తప్పలా... ఆరోగ్యం చెడిపోయె అడుక్కుతిని బతకాల్సి వచ్చె... వేళకు తిండి లేదు. తిండిలేక శక్తి లేక అడుక్కు తినడం తప్పలా" ఆలోచిస్తూనే వున్నాడు రాములయ్య.

"కేరళలో అడుక్కునేటోళ్ళకు అక్కడి వాళ్ళు ఎముకలేని చేతులతో ధారాళంగా దానాలు ఇస్తారట. ఎవురో చెపితే యిని అమ్మానాన్నలు కేరళకు భిక్షాటనకై వెళ్ళి పదైదు దినాలాయె" ఇంకా తీవ్రమైన ఆలోచనల్లో పడిపోయాడు.

రాములయ్య తండ్రి సిద్ధయ్య తల్లి రాజమ్మ బాగా బతికిన రైతులు. వ్యవసాయంలో చితికి బతికి బట్టకడదామని తిరుపతి వచ్చేశారు.

బాధలు తప్పలేదు. తిరపతిలో ఎవ్వరూ తెలీదు. దాంతో బాధలు మరింత ఎక్కువయ్యాయి. పనులేక పస్తులు అగచాట్లు,

అవమానాలు, బాధలు తప్పలేదు. సరికదా తాగుడుకు బానిసైనాడు. మందుకోసం అభిమానాన్ని వదులుకొన్నాడు. భార్యను, కూతురిని పనుల్లోకి పంపించడం... పైసలకోసం వాళ్ళను హింసించడం అలవాటు చేసుకొన్నాడు. గౌరవంకొద్దీ తల్లీ కూతుళ్ళు అన్నీ సహిస్తున్నారు. ఓర్పు వహిస్తున్నారు. ఈ క్రమంలో తనకు తోడు దొరకడంతో కూతురు వేరుకాపురం వెళ్ళింది. వ్యసనాలకు బానిసై రెక్కలు దిగిన సిద్ధయ్యకు భార్య రెక్కల కష్టం తప్ప మరేమీ అందుబాటులో లేదు. పనుల్లేనపుడు ఆ కుటుంబానికి పస్తులు తప్ప గత్యంతరం లేకపోయింది.

ఏటికి ఎదురీదైనా సరే... ఎట్లన్నగానీ... కొడుకును సదివించాలని రాజమ్మ... పట్టుదల... వయసు తక్కువయినా మంచి దేహదారుఢ్యం, బలమైన శరీరం ఉండటం మూలాన శెలవు దినాల్లో రాములయ్య అమ్మతో పాటు కూలికి వెళ్ళేవాడు. ఫీజులు కట్టి బట్టలు కుట్టించుకోగలిగేవాడు. భర్త హింసను మౌనంగా ఓర్చుకొని భర్త కానకుండా కొడుకును అక్కున జేర్చుకొని మూగగా రోదించడం తప్ప రాజమ్మ ఇంకేమి చేయగలదు.



అవాళెందుకో రాములయ్యకు కుటుంబ సభ్యులందరూ ఒక్కొక్కరు గుర్తుకొస్తున్నారు. గుర్తొచ్చి రాములయ్య మనసు మరింత దిగులు పడింది. ఆకలి పేగుల్ని నమిలేస్తున్నా బాధ ఓర్చుకొంటూ ప్లాస్టిక్ కాగితంలో చుట్టిన పుస్తకాలను ఆప్యాయంగా చేతుల్లోకి తీసుకొంటూ తన్మయత్వంతో కళ్ళకద్దుకొన్నాడు.

"ఎట్లన్నగానీ బాగా చదుకోవాల.... తాత కోర్కె నెరవెర్చాల'' అనుకొన్నాడు. దేక్షాలో ఉన్న నీళ్ళను సత్తుగ్లాసులో నింపుకొని గటగటా తాగేశాడు. గోడవారగా వచ్చి జాజి చెక్కల పెట్టిమీద కూచుని, పుస్తకాలు పక్కన బెట్టి కళ్ళు మూసుకొన్నాడు. "చదువుకోవాల. తాత ఆశ నెరవేర్చాల" పదే పదే అతని మనసు పలవరిస్తూ ఉంది...

వీధిలో వాహనాల ధ్వనులు... వస్తూ పోతూ ఉండే మనుషుల అలికిడి మాటలు అస్పష్టంగా వినవస్తుంటే క్రమంగా నిద్రలోకి జారుకొన్నాడు.

చెవులు చిల్లులు పడేలా హారన్ మోగించుకొంటూ రోడ్డును దడ దడలాడిస్తూ ఓ లారీ అటువేపు రోడ్డుపైన దూసుకుపోసాగింది. ఆ శబ్దానికి ఉలిక్కిపడి లేచాడు రాములయ్య. పెట్టిమీద నుంచి లేచి వెళ్ళి తలుపు తీసి, వీధిలోకి చూశాడు. రాత్రంతా కురిసి అలసిన మేఘాలు... ఎవరో మంత్రించినట్లు ఆకాశంలో మచ్చుకైనా కానరావడం లేదు. సూరీడు వెలుతురు స్నానం చేసి అప్పటికే నిగనిగమెరిసి పోతున్నాడు.

రాములయ్య ఏడవతరగతి చదువుతున్నాడు. ఆ మరుసటిరోజే ఆగష్టు 15 స్వాతంత్ర్య దినం. శ్రావ్యమైన కంఠంగల రాములయ్య చేత తెలుగు మాస్టారు పాటలు ప్రాక్టీసు చేయిస్తున్నాడు. ప్రాక్టీసు కోసం స్కూలు మొదలవక ముందే వెళ్ళాలి. కానీ ఆలస్యమైంది... స్కూలుకు వడి వడిగా బయలుదేరాడు.

"ఒరే రాములయ్యా?!" తలెత్తి పిలుపు వచ్చిన వైపు చూశాడు రాములయ్య. ఉరిమి కళ్ళెర్రజేసి జూస్తున్నాడు టీకొట్టు రమణయ్య. క్లాసు పుస్తకాల కోసం పాతిక రూపాయలు ఆయన దగ్గర అప్పు తీసుకొని రోజూ సాయంత్రాలు కప్పులు గడిగే పనికి ఒప్పుకున్నాడు. రెండు రోజులబట్టి పనికి పోలా. అదే ఆయన కోపం. తప్పక వస్తానని తప్పు ఒప్పేసుకొని ముందుకు కదిలాడు రాములయ్య.

స్కూలు చేరువలోకి వచ్చేశాడు. కిరాణాకొట్టు దాటంగానే స్కూలు... ఇంతలో కిరాణా కొట్టు శంకరయ్య కళ్ళల్లో పడ్డాడు. ముందే అతను అంత మంచివాడు కాదు. ఇలా అనుకొంటుండగనే గల్లాపెట్టి ముందు కూచొని వున్న శంకరయ్య దిగ్గున లేచి తన దగ్గరకు వచ్చి ఎడమ చెవి బట్టుకొని గట్టిగా మెలిపెడుతూ "ఏరా పిల్లనాయాలా? మాయమాటలు నంగనాచి ఊసులు జెప్పి మీ యమ్మ సరుకులు దీసకపాయ... అప్పు దీర్చకుండా కష్టాలు ఏకరువు పెట్టి మీ నాయన కాలం వెళ్ళబుచ్చె. వాళ్ల బాకీ నువ్వే దీర్చాల నా కొడకా... టింగు రంగా అంటూ బడికి పోతే కాదు." అంటూ గట్టిగా చెవిని మెలిదిప్ప సాగాడు. బాధను మునిపంటనొక్కిపట్టి పస్తులుండి అయినా పనిజేసి బాకీ దీరుస్తానని... బతిమలాడుకొని బయటపడి బడిగేటు దగ్గరికి చేరాడు రాములయ్య.

రెండు రోజులుగా సరిగ్గా తిండి లేదు. నిద్రలేదు. ఆకలికి తోడు చెవి మెలిపెట్టిన బాధ... కాళ్ళలో వణుకు మొదలై క్రమంగా శరీరం మొత్తం కంపించసాగింది. శక్తినంతా కూడదీసుకొని గేటుదాటి తడబడే అడుగులతో తరగతి గుమ్మం దగ్గరకు చేరుకొన్నాడు. భయం భయంగా లోనకు చూడసాగాడు. అతన్ని చూసిన అయ్యవారు వాడి స్థితిని పెద్దగా పట్టించుకోకుండా "ఏం వాయ్ ముందుగా రమ్మంటే రాకుండా క్లాసుకు కూడా లేటుగా వచ్చినావే?! యొదవ నాయాల అయ్యవార్లంటే బొత్తిగా భయం భక్తి లేకుండా పోతాందాదిరా... ఆన్నే... నా పీరియడ్ ఐపోయేటంతదాక నిలబడి చావు. అప్పుడుగాని బుద్ధిరాదు" అన్నాడు కటువుగా. రాములయ్య జవాబు చెప్పాలని ప్రయత్నించాడుగానీ, భయంతో నోరు

పెగల్లేదు. కడుపులోని బాధ కన్నీరుగా మారి చెంపలపైన జారిపడసాగింది. ఇది చూసిన అయ్యవారు మెత్తబడి...

''మాటకు ముందు ఏడుపొకటి... వచ్చి చావు'' రాములయ్య వేపు విసుగ్గా చూస్తూ అన్నాడు. కాస్సేపటికి సీట్లో కూచున్న రాములయ్యకేసి చూస్తూ... "నువ్వు పాటలు బాగా పాడాలి. రేపు డి.ఇ.ఓ.గారు పాఠశాలకు వస్తారు కాబట్టి బాగా ప్రాక్టీసు చేయి" అన్నాడు. లేచి నిలబడి కూచొని చారలు గట్టిన కన్నీటిని చొక్కాతో తుడుచుకున్నాడు రాములయ్య. నాలుగు పీరియడ్లు గడిచాయి. తలా తోక లేని ఆలోచనలు వెంటాడుతున్న రాములయ్యకు పాఠాలు చెవికెక్కలేదు. లంచ్ గంట పెద్దగా చెవిని సోకడంతో ఈ లోకంలో కొచ్చిన రామయ్యకు కారియర్లు పట్టుకొని లంచ్‌కి సిద్ధమై వెళుతున్న తోటి పిల్లలు కనిపించారు.

లంచ్ బ్రేకు నలభై నిమిషాలు. ఆకలికి అందాక ఓర్చుకోగలిగితే తిరిగి మధ్యాహ్నం క్లాసులు మొదలవుతాయి. బడి వదిలేటంతదాక ఆకలి మీద నుంచి తప్పించి పాఠాల మీద కేంద్రీకరించుకోవచ్చు మనసులో అనుకొంటూ... ఆకలి బాధను మునిపంట నొక్కి పట్టాడు. మార్గాంతరం లేక కడుపు మీద చేతిని వత్తిపట్టి మొండిగా బాధను భరిస్తూ కూచుండి పోయాడు. శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా వుంది. కళ్ళుమూసుకొని బెంచీమీద తల ఆన్చి అలాగే పరుండి పోయాడు రాములయ్య.



"రేయ్ రాములయ్యా! అన్నానికి యింటికి పోలేదా" కదిలి కళ్ళు తెరచిన రాములయ్య ఎదురుగా జార్జి కనిపించాడు. కళ్ళలోని ఆకలికి... రాములయ్య వాలకం చూసి బహుశా పసికట్టగలిగాడేమో!

"అరేయ్ ఈవాళ నేను నిన్ను సరిగ్గా ప్రొద్దుట్నుండీ గమనించలేదురా... నా క్యారియర్‌లో అన్నం చెరిసగం పంచుకొనే వాళ్ళం. నీ అదృష్టం ఈవాళ. మూడ్ బాగాలేక ఒక గిన్నెలో అన్నం అలాగే వదిలేశాను. ఇంద వెళ్ళు" అంటూ జాలిగా రాములయ్య వంక చూస్తూ క్యారియర్ అందించాడు.

క్యారియర్ చేతిలో పుచ్చుకొని ఒక్క ఉదుటున నీళ్ళ కుళాయివైపు పరుగు లంఘించుకొన్నాడు రాములయ్య. ఆబగా ఆదరా బాదరా అన్నం తినేశాడు. తినడానికయితే తిన్నాడుగానీ... ఆతని ఆకలికి అది చాల్లా. కొలాయి తిప్పి కడుపునిండా నీళ్ళు పట్టించేశాడు. క్యారేజీగిన్నె శుభ్రంగా కడిగి కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ జార్జి కందించాడు.

క్లాసులో కూర్చున్నాక ముంచుకొచ్చే నిద్రను నియంత్రించుకొంటూ పాఠాలు వినే ప్రయత్నం చేశాడు. ఆ మధ్యాహ్నం నుంచి సాయంత్రందాకా.

లాంగ్ బెల్ మోగింది. బడి ముగిసింది. బడిపిల్లలు బిలబిలమంటూ... పుట్టలో చీమల్లా.. బయటకు వచ్చి వడి వడిగా ఇళ్ళకేసి వెళ్ళసాగారు.

చేష్టలుడిగి చలనం లేనట్టు వాళ్ళవేపు అలాగే చూస్తుండిపోయాడు రాములయ్య. తేరుకొని అసంకల్ప ప్రతీకార చర్య అన్నట్టు పుస్తకాలు క్లాసు డెస్కులో పెట్టేశాడు. అయిష్టంగానే లేచి బడి బయట పడ్డాడు.

గమ్యం అంటూ లేదు. ఎటుబడితే అటు తలొంచుకొనే నడుస్తున్నాడు. అలా పిచ్చిగా... మొండిగా ఎటు బడితే అటు.. కాళ్ళు దారి తీసిన వేపు తలొంచుకునే వెళుతున్నాడు. చాలా సేపటి తర్వాత అలికిడి ఎక్కువయి వినవచ్చిన చోట తలెత్తి చూశాడు...

తను అక్క కాపురముండే ఇంటి దగ్గర్లోని సెంటరులో ఉన్నట్టు గమనించాడు... తను ఈవాళ ఎలాగైనా సరే! వెళ్ళి అక్క రాజమ్మను డబ్బులు అడగాల... వాళ్ళింట్లో కడుపార భోంచేయాలని అనుకొన్నాడు కానీ, ''అడిగితే ఇస్తుందా?.... ఇస్తే బావ కోప్పడకుండా ఉంటాడా'' అనుమానం కొద్దీ అడుగులు ముందుకు పడటం లేదు. తటపటాయిస్తున్నాయి.

ఏమయితే అదికానీ... వెళ్ళి తీరాలి. స్థిరంగా నిశ్చయించుకొని, శక్తి కూడదీసి వడి వడిగా అడుగులు తీస్తూ అక్క యిల్లు చేరుకొన్నాడు.

దూరంనుంచే తన్ను గమనించి, గుమ్మందాక వచ్చి ఆప్యాయంగా లోనకు తీసుకెళ్ళింది అక్క.. అంత బాధలోనూ అక్క సాంగత్యం ఎంతో సంతోషాన్ని కల్గించిందతనికి.

తన ఈడు పిల్లలు ఇద్దరున్నారు ఆ యింట్లో. వాళ్ళు బావ మొదటి భార్య పిల్లలు. అక్క బావకు రెండో భార్య. మొదటావిడ రోగిష్టిది కావటం మూలాన ఇంట్లో వంటకు పిల్లల ఆలనా పాలనా చూడ్డానికి పెద్దావిడకు సేవలు చేయడానికి అన్నిటా మించి కూలిపనులకు వెళ్ళి డబ్బులు సంపాయించడానికి అన్నీ ఆలోచించే పెద్దావిడ బావ అక్కను పెళ్ళాడడానికి ఒప్పుకొందట. అమ్మా నాన్న అనుకొంటుండగా విన్నాడు తను.

"ఎందుకురా అలా నీరసంగా ఉన్నావ్? గుడ్డలు కూడా మాశాయే ? ఏం జరిగింది" ఆప్యాయంగా వాడి తల నిమురుతూ అడిగింది అక్క తమ్ముడ్ని.

ఇంతలో ఏదో గుర్తొచ్చిన దానిలా వంటింట్లోకెళ్ళి

గ్లాసునిండా నీళ్ళుదెచ్చి వాడి చేతికందించింది. అది తీసుకొని గట గట తాగేశాడు వాడు.... అది చూసి వాడి స్థితి చూచాయగా అర్ధమైన ఆవిడ గుండె లోతుల్లో ఎక్కడో కలుక్కుమంది. కన్నీటి పొర కళ్ళలో నిలిచింది....

ఇది చూసిన రాములయ్య... బోరున ఏడుస్తూ.. తలిదండ్రులు తన్ని విడిసిపెట్టి కేరళకు వెళ్ళడం, తనకెదురయిన చేదు అనుభవాలూ అవమానాలూ పూసగుచ్చినట్టు చెప్పాడు. బోరున విలపిస్తూ తమ్ముణ్ణి అక్కున చేర్చుకొని మధ్యాహ్నం మిగిలిన కొద్దిపాటి అన్నంలో రసం కలిపి ముద్దలు చేసి ముదిగారంగా తమ్ముడి చేత తినిపించింది. అలా తినడం సంతోషంగా వున్నా... ఆకాస్త అన్నం వాడికి సరిపోలేదు.

ఆకలి... ఆకలి.... విషయం వాళ్ళ అక్క గ్రహించింది.

"ఎంతసేపురా... అన్నం వార్చి... పప్పు చేస్తా ఉండు. తిందువుగాని... ఈరోజు మధ్యాహ్నం నుంచి పని లేదు. రేపు మల్లా పనిలోకి ఎల్లాల.... రేపు శనివారం... సాయంత్రం కూలి బట్వాడా ఇస్తారు.... రేపు సాయంత్రం వచ్చినావంటే యాభై రూపాయలిస్తా" అంది రాళ్లను యేరటానికి బియ్యం చాటలోకి తీసుకొంటూ.



ఈలోగా ఎప్పుడొచ్చిందో యేమో బావ మొదటి భార్య. వచ్చీ రావడంతోటే రాములయ్యను ఎగాదిగా చూసింది. ఆపై అక్కవేపు కొర కొర చూస్తూ "ఈ దరిద్రం ఎందుకొచ్చింది" అంటూ కళ్లెగరేస్తూ... గాండ్రించి తుపుక్కున ఉమ్మేసింది.

"ఏందీ... అంతా యిన్నాను. రేపటి బట్వాడా నుంచి ఏభై రూపాయలీదరిద్రానికి ఇస్తావా?! ఎవుడ్నడిగి ఇస్తావ్! నీ యబ్బ సొత్తేదీ ఇక్కడ తేరగా లేదే?"

ఏదో చెప్పబోయిన అక్కను వారిస్తూ, "నువ్విట్టా ఎదవ్వేషాలు యేస్తే ఇంట్లోంచి గెంటేస్తా. యేమనుకున్నావ్" తిట్టిపోస్తూ... గట్టి గట్టిగా అరవసాగింది.

ఇంక ఒక్క క్షణం కూడా ఉండలేకపోయాడు అభిమానం దెబ్బతిన్న రాములయ్య. విసవిసా వీధిలో కొచ్చేశాడు.

భయం, అశక్తతతో వారించలేని అక్క గ్రుడ్లనీరు గ్రక్కుకుంటూ వాడ్నేచూస్తూ గమ్మున ఉండిపోయింది.

అమ్మా నాన్న తన్నొంటరిని చేసి వదలి వెళ్ళారు. అప్పుదీర్చమని చుట్టుప్రక్కల వాళ్ళు వేధిస్తున్నారు. ఆదుకోవాలని ఉన్నా అక్క అందుకు, అశక్తురాలయింది. ఇంట్లో పావుశేరు బియ్యం కూడా లేవు.... చేతిలో చిల్లిగవ్వలేకపోయె... ఆకలి కడుపు... ఉద్యోగస్థుడిగా తన్ను చూడాలనుకొన్న తాత తనకిక లేడు. అమ్మానాన్న వస్తారో రారో తెలియదు. ఉన్నారో లేదో అదీ తెలియదు.

ఎందుకు బతకాల ?

ఎవరికోసం బతకాల?

ఎలా బతకాల ?

ఆలోచనలు... ప్రశ్నలు... మదనపడుతున్నాడు. పస్తులుంటూ... కన్నీళ్ళు పెట్టుకొంటూ... నీళ్ళు తాగుతూ... ఎన్నాళ్ళు బతకగలడం... నరకం లాంటి జీవితం ఎన్నాళ్ళు...

చచ్చిపోతే!

చచ్చిపోతే!!

ఎలాగూ అప్పులోళ్ళు చచ్చిపోతే భూమికి భారం తగ్గుతుందని అననే అనేశారు....

చచ్చిపోతే !!! ఈ బాధలేవీ ఉండవు కదా?!

ఇలా... పలు పలు ఆలోచనల మధ్య ఊగిసలాడుతూ చచ్చి పోదామని అనుకొంటున్నాడు గానీ చావడం ఎలాగ అన్న సందేహం మొదలైంది వాడిలో...

దగ్గరలో రైలుగేటు వుంది. ఎప్పుడూ ఏదో ఒక రైలు వచ్చిపోతూ ఉంటుంది... అక్కడ చద్దాం అనుకుంటూ... అడుగులు ముందుకు వేయసాగాడు.

ముందుకు వెళ్ళేకొద్దీ భయం పోయి మొండిధైర్యం వచ్చేసింది... కసిగా కదులుతున్నాడు... రయ్‌మని... చెవులు చిల్లులు పడేలా హారన్ మోగిస్తూ అప్పుడే పట్టామీది నుంచి దూసుకువస్తూ కనిపించిందో రైలు. కన్నార్పకుండా దాన్నే గమనించాడు... ఏదో స్ఫురించింది... గేటుదాటి పట్టాలమీద నిలబడి... ఎదురుచూడసాగాడు... పడి చద్దామని...

అతన్ని చూసిన దారంట పొయ్యేవాళ్ళు, అతన్ని అట్నుంచి దూరంగా నెట్టేశారు నాలుగు తగిలించి. వాళ్ళవంక కోపంగా చూస్తూ "మీకేం తెలుసు నా బాధ" అని గొణుక్కోసాగాడు రాములయ్య.

చావడానికి సిద్ధమైనా, ఇంకో ప్రయత్నం చేస్తే సరిపోలా. ఓవైపు గొణుక్కుంటూనే తన్ను తాను సమాధానపరచుకొన్నాడు.

రేపు జండా పండగ. ఈ ఒక్కపూట ఉండి... జెండా పండగ చూసుకొని ఆపై చచ్చిపోతే పోలా... పాటలు పాడాల... పాటలు బాగా పాడాల... లేకుంటే అయ్యవారు ఊరుకోడు. వీపు విమానం మోత మోగిపోతుంది. పాడటమంటే మాటలు కాదు. రాత్రంతా ప్రాక్టీసుకు ఒంట్లో శక్తి ఉండాల. శక్తి కావాలంటే తిండి తినాల. తిండి వండిపెట్టేందుకు అమ్మయినా ఉండాల. కాకపోతే కనీసం చేతిలో డబ్బైనా ఉండాల. అదీ లేదు, ఇదీ లేదు. తనకేదీ లేదు. ఏదీ లేకపోయినా సచ్చిపోవడం

నా చేతుల్లోనే కదా ఉండేది. ఇక ఆలస్యం పనికిరాదు. ఈవాళే సచ్చిపోతా...

కసిగా వడి వడిగా బస్టాండుకేసి నడిచి అంబేద్కర్ కూడలి చేరుకొన్నాడు. ఓ వారగా నిలబడి వచ్చే పొయ్యే బస్సుల వేపు అదోలా చూస్తున్నాడు. ఏదో ఒక బస్సుకింద పడి చావాలని ఆశగా ఉంది. గబుక్కున పడ్డానికి వీలు కలగడం లేదు... ఎవరు చూసి ఏమంటారోనని భయంగా ఉంది. ముందుకు వెనకకు ఊగిసలాడుతున్నాడు. అనుకొన్నంతా అయ్యింది. ట్రాఫిక్ కానిస్టేబులు కంట్లో పడనే పడ్డాడు. ఆయన దగ్గరగా వచ్చి... కాలరు దొరకబుచ్చుకొని ‘‘పర్సులు కొట్టే దొంగనాయాల్లా ఉండావే? ఎవర్రా నువ్వు?! ఏం జేస్తున్నావ్విక్కడ’’ పరిశీలనగా జూస్తూ రాములయ్యని నిలదీశాడు. బిక్కచచ్చిన రాములయ్య సమాధానం చెప్పలేక నీళ్లు నమలసాగాడు. ఏమనుకొన్నాడో ఏమో, వాడి మొహంకేసి చూస్తున్న కానిస్టేబులు కాస్త తగ్గి “పిల్ల నాయాలా వేలెడంత లేవు అప్పుడే దొంగబుద్ధులా” అంటూ నాలుగు తగిలించి తరిమేశాడు. క్రమంగా జగతిని చీకటి కమ్మేసింది.



నడవడానికి ఓపిక లేదు. తొందరగా చచ్చిపోవాలని ఉంది... చచ్చిపోవడం ఎలాగ? ఆలోచనలు తొందర పెడుతున్నాయి. అప్పుడే నిర్మాణ దశలో కొత్తగా కడుతున్న అంతస్థుల భవనం మీద పడింది వాడి దృష్టి... భవనం సమీపించాడు. చీకట్లో కళ్ళు స్పష్టంగా కనిపించలేదు. తడుముకొంటూనే మెట్లెక్కి పైకెళ్ళ సాగాడు. నాలుగో అంతస్థుపైకి వచ్చేశాడు. అక్కడి నుండి దుమికి చావాలని వాడి ఆశ. అక్కడా వాడి ఆశ నిరాశే అయ్యింది. వాచ్‌మేన్ రూపంలో వాడి ప్రయత్నానికి గండి పడింది.

“ఎవడ్రా నువ్వు. నీకిక్కడేం పని... దొంగ నాయాల” అక్కడే ఏదో పనిచేసుకొంటున్న వాచ్‌మెన్ టార్చి వేసి మరీ అరిచాడు. భయంతో గబగబ మెట్లు దిగి వాడి చేతికి చిక్కకుండా బ్రతుకుజీవుడా అనుకొంటూ పరుగు లంఘించుకొన్నాడు రాములయ్య. చాలా దూరం వచ్చేశాక గానీ వెనక్కు తిరిగే సాహసం చెయ్యలేదు. తన్నెవ్వరూ వెంబడించలేదన్న నమ్మకం కలిగాక కాస్సేపాగి గుండెలనిండా గాలిపీల్చి వదులుతూ ఆయాసం తీర్చుకొన్నాడు. కాళ్ళీడ్చుకొంటూ ఇల్లు చేరాడు.

బుడ్డిదీపం వెలిగించాడు. కొడిగట్టిన ఆ దీపం గుడ్డి వెలుగులే విరజిమ్మింది. బయటకు తొంగి చూశాడు. విద్యుత్ దీపాల వెలుగు రోడ్డంతా పరచుకొని ఉంది. కొంపలో కరెంటు ఉన్నా వైరు పట్టుకుని హాయిగా చచ్చిపోయి ఉందును. ఈ కొంపకదీ లేదు. హుఁ... అంటూ బలంగా నిట్టూర్చాడు. ఇంట్లో చెమ్మ ఇంకా ఆరలేదు. తడిగానే ఉంది. విసుగ్గా వెళ్ళి జాజిచెక్కల పెట్టె మీద కూలబడ్డాడు.

చావాలన్న కోర్కె బలంగా ఉంది. చచ్చిపోవడం కుదరడం లేదు. ఏదో గుర్తొచ్చి పెట్టె దిగి మూత లేవనెత్తి అందులోంచి అమ్మచీర ఒకటి వెలికి తీశాడు. అది రంగు వెలిసి అక్కడక్కడ చిరుగులు పడి వుంది దాన్ని చూస్తూ అతనిలో మళ్ళీ పిచ్చి ఆవేశం ఆరంభమైంది. జాజిచెక్కల పెట్టెపైకి ఎక్కాడు. అటక కొయ్యకు చీరను ఒక చుట్టు వేసి తీశాడు. ఒక కొసకు జారుముడి వేశాడు. మెడకు చీరను తగిలించుకొని, ముడి బిగించి జాజిపెట్టెను దూరంగా తన్నేశాడు... అంతే... అటక కొయ్య నుండి ఒక్కసారిగా చీర గొంతుకు బిగుసుకుంది. కానీ కాస్సేపయ్యాక చిరిగిన చీర పుటుక్కున తెగి అతని శరీరం దబ్బున కిందపడింది.

పడ్డంతో మెదడు మొద్దుబారి పోయింది. ఏం జరిగిందీ అతనికి ఓ పట్టాన అర్థం కాలేదు. తల పైకెత్తి చూశాడు. చీర మధ్యకు తెగిపోయింది. సగం చీర కొయ్యకు వేలాడుతుంటే సగం చీర తన ఒడిలో వుంది. అప్పుడతనికి అమ్మ గుర్తుకొచ్చింది. అమ్మ చీరను అలాగే ముఖానికి హత్తుకొంటూ “అమ్మా” అని ఏడ్చేశాడు. ఆవేళ అతని కన్నీళ్ళతో అమ్మచీర తడిసిపోయింది. ఆ కన్నీళ్ళు చావాలన్న కోరికను వాడి గుండెలోంచి తుడిచేశాయి.

సరిగ్గా అప్పుడే “వొరే రాములూ” పరుగెత్తుకొచ్చిన అక్క రాజమ్మ “నిన్ను ఆదరించలేని అలాంటి వాళ్ళతో నాకూ సంబంధం లేదు వొచ్చేసినాన్రా... వొచ్చేసినా... తెగ తెంపులు చేసుకొనే వచ్చేసినా.. లే.. నాయినా... లేఁ” అంటూ తమ్ముణ్ణి లేపి జరిగింది తెలుసుకొని ఘోరం తప్పిపోయినందుకు దేవునికి మనసులో దండం పెట్టి సంతోషిస్తూ తమ్ముణ్ణి అక్కున చేర్చుకొంది.

వచ్చింది అక్కో, అమ్మో తెలియని స్థితిలో అతని గొంతుకున్న చీరముడి ఎప్పుడో విడిపోయింది. అది ఇప్పుడతని గుండెలమీద అక్కవొడిలో నలిగిపోతూ కనిపించింది. రాములయ్య కళ్ళు మూసుకొని ఉండిపోయాడు.

## కవిత

### ఆ మామిడి చెట్టు ఏడుస్తూంది

విజయలక్ష్మి పండిట్
9441736843



ముక్కుపచ్చలారని
ఇద్దరు ఆడపడుచుల
మాన ప్రాణాలు తీసి
నా పచ్చని కొమ్మకు
వ్రేలాడకట్టారు ఆ
నరరూప రాక్షసులని
బోరున ఏడుస్తూంది
ఆ మామిడి చెట్టు.

నా కొమ్మలకు వ్రేలాడదీసిన
ఉరి బిగుసుకొని అరచిన
వారి ఆర్తనాదాలు వినకుండా
చెవులు మూసుకుంది
ఆ చెవిటి గ్రామం.
చెవులు రిక్కించని
ప్రక్కనున్న పట్టణవాసం.

ప్రసార మాధ్యమాలు
గొలపెట్టి గీపెడితే కాని
ఆలకించని పాలకులు.
ఎక్కడుంది ప్రజాస్వామ్యం?
ఎటుపోయింది మానవత్వం?

ఈ దేశం ఆడపిల్లలు
బహిర్భూమికి వెళ్ళకుండా
వారి శరీర మలినాలు
విసర్జించకుండా ఆవిరయ్యే
వరాన్ని వారికి ప్రసాదించు
లేకపోతే గ్రామాల
బహిర్భూములే ఆడపిల్లల శవాల
మరుభూములై రోదిస్తాయని
దేవునికి మొర పెట్టుకుంటూంది
నిర్వేదంతో తలదించుకుని
ఆ మామిడి చెట్టు.

### మనిషి ఒక బాటసారి

సప్రంగణేష్ బాబు
8977348821




నిజం ఏమిటంటే
నువ్వులేనప్పుడు కూడ ఈ లోకం అలానే ఉంటుంది
ఏ అబద్ధం మోయలేని భారంలో జీవచైతన్యం
కాలం వెనుక అడుగులో అడుగు వేస్తూ ప్రయాణిస్తుంటుంది
కొన్ని సంవత్సరాల క్రితం ఈ భూమికి నువ్వోకలవి
కొన్నేళ్ల తర్వాత నువ్వు జ్ఞాపకానివి
కురిసే వాన కురుస్తూనే ఉంటుంది
పూచే పూలు పూస్తూనే ఉంటాయి
నువ్వు నడిచిన దారుల్లో మరింకెన్నో కొత్త అడుగులు
సాగుతుంటాయి
రేపు ఈ రోజుగా ఈ రోజు నిన్నగా మారిపోతున్న
వాస్తవంలో
అంగీకరించాల్సిన గుండె చప్పుడు నెత్తికెత్తుకొని
నువ్వు నువ్వుగా మిగలడం ఓ పెద్ద విజయకేతనం
ఎందుకు దిగుళ్ళు ఎందుకు కన్నీళ్ళుఎందుకు భయం బరువులు
చేతనం చర్యలు ఎప్పుడూ ప్రభాతానికి ప్రతిబింబాలే
ఈ నేల ఆకాశం మన కోసం ఒక అవకాశం
కాస్త మనిషి తనాన్ని పూసి
ఇంకొంచ జీవ జ్వాల పోసి.....
అబ్బా ఎన్నిసార్లు చెప్పుకున్నా నిజం ఇదే కదా
మరెందుకు ఇక్కడంతా ఇలానే ఉంది

గుడ్డివాని ముందు దృశ్యంలా
చెవిటివాని ముందు శంఖంలా
పూర్తిగాని శిల్పంలా
కాని ఒకటి మాత్రం అబద్ధం నీడ చేరని నిజం
ఈ లోకం ఒక అద్భుతం మనిషి ఒక ఆద్వైతం
కాసిని మాటలతో ఇంకొన్ని రాతలతో
ఆకాశమంత విషయాన్ని ఓ చిన్న అద్దంలో
చూపించలేము
అనుభవాలు అనుభూతులు ఒక పాఠం
జీవితం ఈ భూమ్మీద మొదటి ఆఖరుగా మిగిలిన స్వప్నం
అర్థం చేసుకోడం అందుకోడం
మిగిలిన కథ కథానికం.

పరిశీలన

# జాషువా కవిత్వం తాత్విక సౌందర్యం

– డా॥ కె. ఆశాజ్యోతి
9449672394



*జాషువా దళిత తాత్వికత హిందూ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తుంది. అగ్రవర్ణ ఆధిపత్యాన్ని కొమ్ముకాసే బ్రాహ్మణీయ సాహిత్యం, ఆ సాహిత్యం ప్రతిఫలించే వర్ణాశ్రమ ధర్మాలు, భౌతిక జీవితం కంటే మరణానంతరం సుఖం ఉందని భ్రమింపచేసే మోక్ష, భావన, కర్మను అనుభవించాలనే కర్మసిద్ధాంత బోధనలను – ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ దళిత తాత్వికతను ప్రతిపాదించే కవిత్వం జాషువా ఆద్యంతం రాసాడు. జాషువా తన కవిత్వం ద్వారా ప్రజల పక్షాన నిలబడ్డాడు. అణగారిన ప్రజల నమ్మకాలలో బ్రతికాడు. సమాజంలోని కుల సమస్యలను, అస్పృశ్యతా సమస్యను తన రచనలలో ప్రతిఫలింపచేసాడు.*

*ఎంత కోయిల పాట వృధయయ్యెనో కదా*
*చిక్కు చీకటి వనసీమలందు*
*ఎన్ని వెన్నెల వాగులింకి పోయెనో కదా*
*కటిక కొండల మీద మిటకరించి*
*ఎన్ని కస్తురి జింకలీడేరెనో కదా*
*మురికి తిన్నెల మీద పరిమళించి*
*ఎన్ని ముత్తెపురాలు భిన్నమయ్యెనో కదా*
*పండిన వెదురు జొంపములలోన*

*ఎంత గంధవహనమెంత తంగేటి జున్ను*
*యెంత రత్నకాంతి యెంత శాంతి*
*ప్రకృతి గర్భమందు భగ్నమై పోయెనో*
*పుట్టరాని చోట బుట్టు కతన*

*– గబ్బిలం*

అంటాడు జాషువా ! పుట్టరాని చోట పుట్టు కతన అంటున్నాడంటే దేశంలో దళితుల సామర్థ్యాలు కాంతులు, సౌందర్యాలు ప్రపంచం చూడలేక పోతోందని అర్థం. అదే జాషువా వేదన ! ఐతే కోయిల పాట, వెన్నెల – వాగులు – కస్తూరి పరిమళాలు – సుగంధ వీచికలు. తంగేటి జున్ను – రత్నకాంతులు – శాంతి – ప్రకృతి గర్భంలో భగ్నమైపోకుండా సమస్త దళిత జాతి వేదనని తన భుజస్కంధాల మీద మోస్తూ దళిత జాతి ప్రతీకగా నిలబడి ''నాలుగు పడగల హైందవనాగరాజును ధిక్కరిస్తూ హిందూవాదాన్ని, అగ్రకుల ఆధిపత్యవాదాన్ని తిరస్కరిస్తూ తన జీవిత పర్యంతమూ పోరాడిన దళిత వీరుడు జాషువా! తన కవిత్వంతో దళిత తాత్వికతను ప్రతిపాదించాడు. జాషువా దళిత తాత్వికత హిందూ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తుంది. అగ్రవర్ణ ఆధిపత్యాన్ని కొమ్ముకాసే బ్రాహ్మణీయ సాహిత్యం, ఆ సాహిత్యం ప్రతిఫలించే వర్ణాశ్రమ ధర్మాలు, భౌతిక జీవితం కంటే మరణానంతరం సుఖం ఉందని భ్రమింపచేసే మోక్ష, భావన, కర్మను అనుభవించాలనే కర్మసిద్ధాంత బోధనలను – ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ దళిత తాత్వికతను ప్రతిపాదించే కవిత్వం జాషువా ఆద్యంతం రాసాడు. జాషువా తన కవిత్వం ద్వారా ప్రజల పక్షాన నిలబడ్డాడు. అణగారిన ప్రజల నమ్మకాలలో బ్రతికాడు. సమాజంలోని కుల సమస్యలను, అస్పృశ్యతా సమస్యను తన రచనలలో ప్రతిఫలింపచేసాడు.

"కులము లేని నేను కొడుకుల బుట్టించి
యీ యఖాతమందె త్రోయవలెనె
భార్యయేల బుట్ట బానిసకని వాడు
జరుపసాగె బ్రహ్మచర్య దీక్ష"

అంటూ గబ్బిలంలోని దళితుడు ఆర్తి, ఆవేదనలను తెలిపాడు. కులంలేని తనకు కొడుకులు కలిగితే వాళ్ళు కూడా తనలాగా కులహీనులుగా పిలువబడుతూ దుఃఖోన్మత్తులు కాకూడదనే అనుకుంటాడు.

ఇక భార్య గురించి చెప్పక్కర్లేదు. ఆమె పుట్టుకతోనే బానిస అని వ్యధ చెందుతాడు.

దళితుడు తన ఇంట్లోకి వచ్చిన గబ్బిలంతో ఇలా అంటాడు

"ధర్మమునకు పిరికి తనమెన్నడును లేదు
సత్యవాక్యమునకు జావు లేదు
వెఱవనేల నీకు విశ్వనాథుని మ్రోల
సృష్టికర్త తాను సృష్టివీవు"

భగవంతుడు అందరివాడైనపుడు సాక్షాత్తు భగవంతుడే అందరిని సృష్టిస్తున్నాడని భావిస్తున్నపుడు దళితుడు మాత్రమే భగవద్దర్శనానికి అనర్హుడు కావడంలోని అసంబద్ధతని ధిక్కరిస్తూ ధైర్యం నూరిపోస్తాడు.

గబ్బిలంతో దళితుడు చేసుకుంటున్న విన్నపంలా కనబడే, గబ్బిలం కావ్యం జాషువా దళితజాతికంతటికీ చేసుకుంటున్న ఆత్మనివేదనం!

"ముక్కు మొగమున్న చీకటి ముద్దవోలె
విహరణ సేయసాగె గబ్బిలమొకండు
దాని పక్షానిలంబున వాని చిన్న
యాముదపు దీపమల్లన నాటిపోయె"

గబ్బిలం ఎంత? దాని రెక్క ఎంత? ఆ రెక్కగాలికి దళితుడి ఆముదపు దీపం ఆరిపోయిందంటే ఈ దీపం ఎంత కొడిగట్టే స్థితిలో ఉందో తెలుస్తోంది! జాషువా Intensity of observation ఎంత సూక్ష్మమో, తీక్షణమో తెలుస్తోంది.

సింధు గంగానది జలక్షీరమెపుడు
గురిసి బిడ్డల బోషించుకొనుచునున్న
పచ్చి బాలెంతరాలు మా భారతమాత
మాతలకు మాత సకల సంపత్సమేత"

– భరతమాత

**గబ్బిలం ఎంత? దాని రెక్క ఎంత? ఆ రెక్కగాలికి దళితుడి ఆముదపు దీపం ఆరిపోయిందంటే ఈ దీపం ఎంత కొడిగట్టే స్థితిలో ఉందో తెలుస్తోంది! జాషువా Intensity of observation ఎంత సూక్ష్మమో, తీక్షణమో తెలుస్తోంది.**

భరతమాతను "పచ్చి బాలెంతరాలు" అని కేవలం జాషువా మాత్రమే పిలవగలగడం! అలా పిలవగల ఆత్మీయత – ఆర్ద్రత జాషువాకే ఉన్నాయి! నిరంతరం పాలధారలుగా సింధూ, గంగ నదులు ప్రవహిస్తుండడం భరతమాత నిరంతరం పచ్చి బాలెంతరాలిగానే ఉండడం ఎంతటి వాస్తవం! జాషువా కెంతటి ఊహా శాబల్యం.

"తేలిక గడ్డిపోచలను దెచ్చి, రచించెదనీవు తూగుటు/య్యెల గృహంబు, మానవుల కేరికి సాధ్యముగాదు, దానిలో/జాలరులందులో జిలుగు శయ్యలునంతి పురంబులొప్పగా/మేలు భళీ! పులుంగుటెకి మీదవురా గిజిగాడ ! నీడజా!!"

గిజిగాడు, సాలీడు, తుమ్మెద మొదలుకొని ప్రకృతిలో రమణీయకతకు ఆధారాలైన ఏ అంశాన్నీ స్పృశించకుండా లేరు జాషువా!!

జాషువా ఖండకావ్య సంపుటిలోని కవిత "శ్మశానవాటిక". ఈ కవిత మానవ జీవితంలో ఆఖరి మజిలీని పరిచయం చేస్తుంది. సత్యహరిశ్చంద్ర నాటకంలోని కాటికాపరి దృశ్యంలోనిది. కరుణరసార్ద్రత–జీవుని వేదనను తలపించే పద్యాలు గుండెలను కరిగించేస్తాయి. అస్పృశ్యత – అంటరానితనం ఒక్క శ్మశానంలో మాత్రమే లేదంటాడు జాషువా!

"ఇటనస్పృశ్యత సంచరించుటకు దావే లేదు;విశ్వంభరా నటనంబున్ గబళించి గర్భమున విన్యస్తంబుగావించి, యు క్కటపుం బెబ్బులి తోడమేకనొక ప్రక్కన్ జేర్చి జోకొట్టియూ అట గల్పించున భేద భావమును, ధర్మంబందుగారాడెడిన్"

అంటూ పెద్దపులిని – మేకను ప్రక్క ప్రక్కన చేర్చి జోకొట్టగలిగే అభేద భావము, ధర్మలక్షణం కేవలం శ్మశానంలోనే కనబడుతుందంటాడు జాషువా!

జాషువా హృదయ మార్దవానికి మరో మచ్చుతునక 'శిశువు' కవిత. సరళమైన పదాల్లో గాఢమైన అనుభూతిని కలిగించే కరుణ రసాత్మక రచన! శిశువును వర్ణిస్తూ

"భాష రాదు, వట్టి పాలు మాత్రమెత్రాగు
నిద్రవోవు; లేచి నిలువలేడు
ఎవరెరుంగరితనిదేదేశమో కాని
మొన్న మొన్న నిలకు మొలిచినాడు"

"మొన్న మొన్న ఇలకు మొలిచినాడు" అన్న జాతీయంలో ఎంతటి ఆత్మీయత – అనుభూతి పెనవేసుకొని ఉన్నాయి.

ఆధునిక కవులుగా చెప్పుకొని భావకవులమని స్వాతిశయం ప్రదర్శించే కవులను నిర్మొహమాటంగా ఖండించాడు. నన్నయ తన కవిత్వం చదివితే కొయ్యబారిపోడా, అని ఆధునిక కవి అనుకోగానే సరికాదని వరిగడ్డిలా పేలవమైన అభిప్రాయాలను కవిత్వంలో ఇరికించినంత మాత్రాన కవిత్వం కాదని అది కేవలం వడ్లగింజలో బియ్యపుగింజ మాత్రమేనని అంటాడు. భావకవులు ప్రతిష్ఠించుకున్న స్త్రీ మూర్తి వివరాలు అడుగుతూ

"ఇమ్మాడ్కి బ్రణయమధుర ర
సమ్ముం జవిసూపి, నిన్ను సాధించుచు నీ
గమ్మత్తు సేయు; నెవరా
యమ్మాయి? వచింపరాదటయ్యా ! మాతో"

అంటాడు. పైగా ముగ్ధత్వమో, ప్రణయమో తెలియని అయోమయంలో ఉన్న కవిని

"కమ్మని భావము గల ప
ద్యమ్మొక్కటి వ్రాయజాల వన్నిటిలో ము
గ్ధమ్మె! ప్రణయమ్మోయని
యుమ్మలికించెదవు నీదియుం గవనంబా?"

అంటూ ప్రశ్నిస్తాడు.

పంచముడు ఎవరిని ప్రశ్నిస్తూ ముసలివాడైన బ్రహ్మకు నలుగురు కుమారులున్నారని విన్నాము గాని

పసరము కన్న హీనమైన అభాగ్యుడు ఐదవ కులస్థుడు ఎవరు ఎటునుండి వచ్చారోనని ప్రశ్నిస్తాడు.

"వేద చతుష్టయంబు ప్రభవించిన వ్యాసుని
విశ్వవాణిలో
మాదిగలుందురా? రుధిర మాంసములుంగల
యంటరాని వా
రాదిమవాసులక్కటక్కటా! తలపోసిన
నల్ల గుండెలో
సూదులు మోసులెత్తును గృశోదరి ! యెట్లు
సహించుకొందువో"

అంటాడు. కొందరికి కడుపునిండితే కవిత్వం వస్తుందని తెలుపుతూ "మనుచరిత్ర" వంటి ప్రబంధం శ్రీకృష్ణదేవరాయల వంటి రాజు మృష్టాన్నము, ఊయెలపాన్పు, కప్పురపు తాంబూలాలు అందజేస్తే అల్లసాని రాయగలిగాడుతప్ప" పొట్టనిండని మాబోంట్ల కలంబు లెక్కరణి విన్నాణంబు జూపించెడినో'' అని ప్రశ్నిసాడు. అలాగే ఆర్థిక సాయంలేని తన పరిస్థితిని ఇలా చెప్పుకున్నాడు.

గ్రంథ రూపంబు దాల్చు భాగ్యంబు లేక
కంటతడి పెట్టుచుండు నా కదనవాణి"

(నాకు తెలిసిన జాషువా - బోయి భీమన్న )

కుల మౌఢ్యం సమాజంలో ఎంత తీవ్రంగా ఉందో తెలిపే పద్యం ఇది.

" నా కవితా వధూటివదనంబు నెగాదిగ జూచిరూపురేఖా కమనీయ వైఖరులు గాంచి భళీ భళీయన్నవాడె మీదేకుల" మన్న ప్రశ్న వెలయించి చివాలున లేచి పోవుచోబాకున గ్రుమ్మినట్లగును పార్థివ చంద్ర ! వచింపసిగ్గగున్"

సమాజంలోని దళితుల పరిస్థితులు ఇలా ఉన్నాయి కనుకనే

"కులమతాలు గీచుకున్న గీతలజొచ్చి
పంజరాన గట్టువడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు
తరుగులేదు విశ్వనరుడ నేను"

అని ప్రకటించుకున్నాడు అంతేకాదు

"గవ్వకుసాటిరాని పలుగాకుల మూకలసూయచేత నన్వెవ్విధి దూరినన్ ననువరించిన శారద లేచిపోవునే, యివ్వసుధాస్థలింబోడమరే రసలుబ్ధులు? గంటమూనేదన్ రవ్వలు రాల్చెదన్ గరగరల్ పచరించెదనాంధ్రవాణికిన్" అని ప్రకటించుకున్నాడు.

దళితుల మధ్య విభేదాలు - తగాదాల పట్ల తీవ్ర అసంతృప్తి జాషువాకు ! మాలమాదిగలు సంఘర్షించుకుంటూ సర్వనాశనమవుతున్నారని వ్యాకులపడతాడు జాషువా!

"మాల యేసుక్రీస్తు మాదిగలకుగాడు
మాదిగేసుక్రీస్తు, మాలకుగాడు
ఒకటి చిలువరించునొకడు స్నానంబిచ్చు
నిరువురేకమగుటకేది దారి

తాను విశ్వనరుడినని జాషువా చెప్పుకున్నా మాలమాదిగలు జాషువాను తమవాడంటే తమవాడని గొడవపడ్డారు. కుల జాడ్యం వదలించుకోవాలని జాషువా ఎంతగానో కోరుకున్నాడు. మాలమాదిగల సమస్యలను కష్టసుఖాలను కవితా వస్తువులుగా జాషువా స్వీకరించారు. భిన్నత్వంలో ఏకత్వం జాషువా దృష్టి.

***మూఢాచారాలు, అంటరానితనం కుల, మత బేధాలు సమాజానికి కలుగజేస్తున్న నష్టాన్నీ దళితులకు జరుగుతున్న అన్యాయాలు అవమానాలు తెలియజేస్తూ సంస్కరణ కేవలం ఏ కొన్ని వర్గాలకో వర్ణాలకో కాకుండా సమాజమంతటిలోనూ సాగాలని జాషువా భావించాడు.***

స్వాతంత్రోద్యమం, సంఘసంస్కరణోద్యమం సాగుతున్న కాలంలో స్వేచ్ఛాగాలులతోపాటు, సంఘం సంస్కరింపబడాలని తీవ్రంగా ఉద్యమిస్తున్న కాలంలో ఆ భావజాలాన్ని అందిపుచ్చుకుని మూఢాచారాలు, అంటరానితనం కుల,మత బేధాలు సమాజానికి కలుగజేస్తున్న నష్టాన్నీ దళితులకు జరుగుతున్న అన్యాయాలు అవమానాలు తెలియజేస్తూ సంస్కరణ కేవలం ఏ కొన్ని వర్గాలకో వర్ణాలకో కాకుండా సమాజమంతటిలోనూ సాగాలని జాషువా భావించాడు. కందుకూరి చేస్తున్న సంఘసంస్కరణ ప్రయత్నాలు బ్రాహ్మణ వర్గానికి చెందడం, గురజాడ-గిడుగు రామ్మూర్తుల భాషా సంస్కరణలు కేవలం సాహిత్యంపై ఆధిపత్యం కలిగిన వర్గాలకు మాత్రమే పరిమితం కావడంతో దళితజాతిని, వారనుభవిస్తున్న హీనమైన జీవితాన్ని తన కవిత్వం ద్వారా అక్షరబద్ధం చేసాడు. తన సమకాలికులు వర్గసాహిత్యం సృష్టిస్తున్న తరుణంలో దళితులు అనుభవిస్తున్న సామాజిక భ్రష్టత్వం ఎంతటి ఘోరమైన నేరమో తన కవిత్వం ద్వారా తెలిపాడు. స్వాతంత్రోద్యమ కాలంలో రాసిన గబ్బిలం సభ్య సమాజానికి ఒక కొత్త కోణాన్ని కొత్త దృష్టిని అలవాటు

## పురస్కారం

### కేదార్‌నాథ్‌సింగ్‌కు జ్ఞానపీఠ పురస్కారం



ప్రసిద్ధ హిందీ కవి కేదార్‌నాథ్‌సింగ్‌కు 2013 సంవత్సరానికి జ్ఞానపీఠ పురస్కారం దక్కింది. హిందీలో జ్ఞానపీఠం పొందినవారిలో కేదార్‌నాథ్‌సింగ్ పదవ వ్యక్తి. జూలై 7, 1934లో ఉత్తరప్రదేశ్‌లోని బలియా జిల్లాలో ఛకియా గ్రామంలో కేదార్‌నాథ్ జన్మించారు. న్యూఢిల్లీలోని జవహర్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, హిందీ విభాగాధిపతిగా పనిచేసారు. 'అకాల్ మే సరస్' కవితా సంపుటికి గాను 1989లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. కవిత్వంతో పాటు కథలు, వ్యాసాలు విస్తృతంగా రాశారు. 'అభీ బిల్‌కుల్ అభీ', 'యహా సే దేఖో' వంటి వీరి పుస్తకాలు ప్రాచుర్యం పొందాయి. సరళంగా, సూటిగా సాగే కేదార్‌నాథ్ రచనా శైలి పాఠకుల ఆదరణ పొందింది. గుర్రం జాషువా కుమార్తె ప్రముఖ సంఘసంస్కర్త, రచయిత్రి హేమలతా లవణం స్థాపించిన జాషువా ఫౌండేషన్ లక్ష రూపాయల నగదు పురస్కారం కేదార్‌నాథ్ సింగ్ అందుకున్నారు.

చేసింది. గబ్బిలమనే క్షీరదాన్ని సందేశకర్తగా స్వీకరించి దళితజాతి ఆర్తిని, వేదనను భగవంతునికి నివేదిస్తున్నట్లుగా కనిపింపజేస్తూ అన్యాపదేశంగా కరుడుగట్టిన వర్గ, వర్ణాధిపత్య సాహిత్యం మాత్రమే సమాజం కాదని నేలంతా విస్తరించిన దళితుల జీవితాలలోని వెతలు, అంటరానితనంతో కునారిల్లుతున్న జాతి జీవిత చిత్రణ సాహిత్యంలో భాగం కావలసిన అవసరం తెలిపారు. గబ్బిలం మహాకావ్యం ద్వారా సాంఘిక అసమానతల పట్ల ధిక్కార స్వరాన్ని వినిపింపజేసాడు. కుల, మత పీడనను ధిక్కరించాడు. రచనా విధానంలో మితవాదిగా కనబడుతూ సామాజిక రుగ్మతలపై తీవ్రంగా స్పందించిన భావాలతో అతివాదిగా దర్శనమిచ్చాడు.

*"నాదు కన్నీటి కథ సమన్వయముసేయ*
*నార్ద్ర హృదయంబు గూడ గొంతవసరంబు"*

అంటాడు జాషువా, జాషువాకు తెలుసు దళితుల జీవితాలలోని వేదనార్తి హృదయదఘ్నం కావాలంటే కేవలం పాండిత్యమో, మేధస్సో ఉంటే చాలదని!! ఆర్ద్ర హృదయం కొంత అవసరమని తెలపడం ద్వారా సమాజపు క్రూర వైఖరి గ్రహించగలిగాడు. కనుకనే దళితుల స్థితిగతులు అర్థం కావడానికి కేవలం మేధో సంపత్తి చాలదని హృదయ సంపత్తి జత గూడాలని భావించాడు.

ప్రపంచమంతా **Hungry thirties** ప్రభావంలో కొట్టుమిట్టాడుతుంటే తెలుగు నేలపై ఒకే ఒక్కరు అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భావానికి ముందే 1941 లో గబ్బిలం వంటి అభ్యుదయాత్మక ఆలోచనాత్మక కావ్యం రాసాడు. దళిత సంవేదనను శివ నివేదనం ద్వారా తెలిపాడు. గబ్బిలాన్ని కావ్య నాయికగా స్వీకరించడంలో జాషువా తాత్వికత అవగతమౌతుంది. దళిత రాజ్యాధికారం జాషువా ఎజెండా! కులపీడన, నిరంతర అవమానాలనుండి జాషువా కవిత్వం ఆవిర్భవించింది. మాల – మాదిగల మధ్యవైరుధ్యం పెచ్చు మీరేలా వినిర్మింపబడ్డ హిందూసమాజం, చాతుర్వర్ణ వ్యవస్థ అన్నీ కలసి దళితుణ్ణి సమూలంగా అణచి వేసాయని జాషువా అభిప్రాయం ఆంగ్ల విద్యతో తెలుగు సాహిత్యంలో ఆధునికత ప్రవేశిస్తే "గబ్బిలం" వంటి ఇతివృత్తాన్ని రచనకు స్వీకరించి తన సమకాలికుల కంటే తాను ఎంతటి ఆధునికుడో మానవీయ స్పర్శ కలిగిన వ్యక్తిగా ఇతర కవుల కంటే ఎంత ముందున్నాడో జాషువా తెలిపాడు

*"మత పిచ్చిగాని వర్ణో*
*న్నతిగాన స్వార్థ చింతనముగానీ నా*
*కృతులందుండదు, శబ్దా*
*కృతి బ్రహ్మానంద లక్ష్మి నృత్య మొనర్చున్"*

ఇదే జాషువా కవితా తాత్వికత! జాషువా తాత్వికత కరుణ రసార్ద్ర భరితం! జాషువా కవితాంబుధిలో ప్రతి మానసం ఓలలాడవలసిందే, దళితార్ద్రత అనుభూతించ వలసిందే! అందుకే జాషువా ఇలా అన్నాడు.

*"రాజు మరణించె నొక తార రాలిపోయే*
*కవియు మరణించె నొక తార గగనమెక్కె*
*రాజు జడమయ్యె రాతి విగ్రహములందు*
*సుకవి జీవించె ప్రజల నాలుకల యందు!!*

## స్వకీయం

# కథా ప్రస్థానంలో నా ఆలోచనలు - అనుభవాలు



- జయంతి పాపారావు
0891-2557961

**వర్గరహిత వివక్షరహిత సమసమాజ ప్రజాస్వామ్య సహజీవన సంస్కృతి - లక్ష్యంగా రాయాలని దిశానిర్దేశం చేసుకున్నాను. సమాజ విశ్లేషణ- ప్రజా చైతన్యం మార్గాలుగా పెట్టుకున్నాను. డబ్బు, కీర్తి, పదవులు, పురస్కారాలు, సన్మానాలు, ప్రశంసలు, సుఖాలు - మున్నగు వాటి కోసం రాయకూడదని గట్టిగా అనుకున్నాను. ప్రజల పక్షంగా నిజాయితీతో నిలబడిరాయాలి. పత్రికా సంపాదకులతో వ్యక్తిగత పరిచయాలు పెంచుకోకూడదు ఎందుకంటే - రచయిత - రచన తనసొంత కాళ్లమీద, నేల మీద, బలంగా నిలబడగలగాలి. ప్రచారానికి లొంగిపోకూడదు.**

వ్యక్తి కంటే సంస్థ గొప్పది. సంస్థ కంటే సమాజం గొప్పది. ఇదీ నా విశ్వాసం. అయితే - నా సొంత కారణాల వల్ల నేను ఏ సాహిత్య సంస్థలోనూ సంఘంలోనూ పనిచేసి సాహిత్య సేవ చేయలేకపోయాను. అయితే నా సొంత రచనా వ్యాసంగం కొనసాగిస్తూనే, సాహిత్యం మొత్తానికి పనికొచ్చే చిన్న చిన్న కొన్ని పనులైనా చేస్తూ ఉండాలన్న తపన నాలో ఎప్పట్నుంచో ఉంది. పదవీ విరమణ తరువాత, నా తపనను సాకారం చేసుకునే పని ప్రారంభించాను. నా సొంత డబ్బుతో, నా సొంత కృషితో, ఎవరి దగ్గర్నుంచీ ఏ రూపంలోనూ ఏ విధంగానూ డబ్బు సాయం తీసుకోకుండా, ఆ పనులు చేయాలని సంకల్పించాను. డబ్బు చాలా గొప్పది. డబ్బు చాలా చెడ్డది. అందువల్ల, డబ్బు కోసం ఆ పనులు ఎంత మాత్రం చేయకూడదు కాక చేయకూడదని సంకల్పించాను. అందువల్లే నేనీ పనికి పూనుకున్నాను.

మరో విషయం కూడా ఈ సందర్భంలో చెప్పుకోవటం మంచిదనిపిస్తుంది. నేను నా రచనావ్యాసంగం 1957లో ఇరవై ఏళ్ల వయసు లోపునే ప్రారంభించాను. కొన్నినియమాలు 1963 లో పెట్టుకున్నాను. వర్గరహిత వివక్షరహిత సమసమాజ ప్రజాస్వామ్య సహజీవన సంస్కృతి - లక్ష్యంగా రాయాలని దిశానిర్దేశం చేసుకున్నాను. సమాజ విశ్లేషణ- ప్రజా చైతన్యం మార్గాలుగా పెట్టుకున్నాను. డబ్బు, కీర్తి, పదవులు, పురస్కారాలు, సన్మానాలు, ప్రశంసలు, సుఖాలు - మున్నగు వాటి కోసం రాయకూడదని గట్టిగా అనుకున్నాను. ప్రజల పక్షంగా నిజాయితీతో నిలబడిరాయాలి. పత్రికా సంపాదకులతో వ్యక్తిగత పరిచయాలు పెంచుకోకూడదు ఎందుకంటే - రచయిత - రచన తనసొంత కాళ్లమీద, నేల మీద, బలంగా నిలబడగలగాలి. ప్రచారానికి లొంగిపోకూడదు. ఆ నియమాలు నేను పాటిస్తూనే వస్తున్నాను. నాకు నచ్చిన కథ లేదా నవల కనబడితే, దాని వివరాలు పుస్తకంలో రాస్తూవస్తున్నాను. వెయ్యికి పైగా కథల వివరాలు ఉన్నాయి. అందువల్ల, ఎంపిక చాలా తేలికైన పని అయింది.

నాకు నచ్చినకథ శీర్షికనిచ్చి కొందరి సాహితీవేత్తలతో 20 వ్యాసాలు రాయించాను. కథను వెంటాడుతూ... గతంలోకి శీర్షికన సంకలనంలో ప్రచురించాను. అదే విధంగా నిలిచే నవలలు ఏవి ? శీర్షికన ఇరవై నవలల మీద 20 మంది సాహితీ వేత్తల చేత 20 వ్యాసాలు రాయించి సంకలనం 2001లో ప్రచురించాను. సంతోషంగా రాస్తానన్న ఏ రచయితా సకాలంలో రచించి పంపించలేదు. వందల మీద ఫోన్ కాల్స్ చేయాల్సి వచ్చింది. ఎందుకు రాయలేక పోతున్నారో అని ఆశ్చర్యపోయాను. రచయితలు ఎవరి సాహిత్యాన్ని వాళ్లే పట్టించుకుంటున్నారని, ఇతరుల సాహిత్యం జోలికి వెళ్లటం లేదని తెలిసి అంతకంటే ఎక్కువగా ఆశ్చర్యపోయాను! ఫలానా కథ మీద లేదా నవల మీద రాయమని నేను ఎవరికీ చెప్పలేదు. కొందరైతే, రాసి పంపించనే లేదు! సంకలనాలు వచ్చాక -

మీరు రచయితల మేథా శ్రమను దోచుకుంటున్నారు – డబ్బు పంపించండి – అని ఇద్దరు రచయితలు నిల దీశారు. ఆ మాట వాళ్లు ముందుగా చెప్పలేదు! డబ్బు చెల్లించి సమస్య పరిష్కరించుకున్నాను. వ్యాపార లాభాల కోసం పని చేస్తున్న వ్యాపారి గానే నన్ను భావించారు! రచయితలు ఎవ్వరూ పుస్తకాలు కొనలేదు! పుస్తకాలు అమ్ముడు పోలేదు. నేను మేథాశ్రమను దోచుకున్నానేమో కానీ. నేను మాత్రం వేల మీద నష్టపోయాను! రచయితలు కాని సాహిత్యభిమానులు కొద్ది మంది పుస్తకాలు కొన్నారు. విశ్వవిద్యాలయాలు, పెద్ద సంస్థలూ చేయాల్సిన పనిని మీరు చేశారని ఇద్దరో, ముగ్గురో అన్నారు. మంచి కథలకు కానీ, మంచి నవలలకు కానీ మీ సంకలనాల్లో చోటు లేకుండా పోయింది. దీని వల్ల మంచి సాహిత్యం నష్టపోతుంది. మీ సంకలనాల వల్ల ఏమీ ప్రయోజనంలేదు.. అని కొందరన్నారు. మంచి కథ అంటే ఏది ? ఏమిటి? ఒక కథను మంచి కథగా నిర్ధారించడానికి ప్రమాణాలేమిటి? మీరు చేస్తే, నేను ఇటుపైన జాగ్రత్త పడతానన్నాను. ఎంత అడిగినా, ఎవరూ ఏమీ చెప్పలేదు! కొందరు కోపగించుకున్నారు కూడా! ఏది మంచి కథ? మంచి కథను నిర్ధారించడానికి ప్రమాణాలేమిటి? ఈ ప్రశ్నను నేను 1960 నుంచి చాలా మంది రచయితలను అడుగుతూ వస్తున్నాను. చాగంటి సోమయాజులు గారిని అడిగాను. నా కథలు చదవండి, తెలుస్తుందన్నారు. అదే విధంగా మరో ముగ్గురు చెప్పారు. విశ్వనాథ సత్యనారాయణ, చలం.... ఏవేవో కొందరి పేర్లు చెప్పి, వారి కథలు చదివితే తెలుస్తుందన్నారు కొందరు. రావిశాస్త్రి – పిపీలికం–(ఆంధ్రజ్యోతి వారపత్రిక – 17.01.1969) – నేనెవర్ని – అని తెలుసుకోవాలన్న జిజ్ఞాసతో పడ్డపాట్లు అన్నీ ఇన్నీ కాదు! నేనూ ఆ చీమ స్థితిలో పడ్డాను!

*మంచి కథ అంటే ఏది ? ఏమిటి? ఒక కథను మంచి కథగా నిర్ధారించడానికి ప్రమాణాలేమిటి? మీరు చేస్తే, నేను ఇటుపైన జాగ్రత్త పడతానన్నాను. ఎంత అడిగినా, ఎవరూ ఏమీ చెప్పలేదు! కొందరు కోపగించుకున్నారు కూడా! ఏది మంచి కథ? మంచి కథను నిర్ధారించడానికి ప్రమాణాలేమిటి?*

నేను నా పదహారో ఏట మహాభారతాన్ని చదివాను. అప్పుడే నాకు సాహిత్యం పట్ల ఆసక్తి కలిగింది. నాకు గ్రామీణ జీవితం బాగా తెలుసు. ముప్పయి గ్రామాల ప్రజల మీద మూడు కుటుంబాలు ఆస్తిపరులు పెత్తనం చెలాయిస్తూ ఉండటం కళ్లారా చూశాను. ఆ దుర్భరస్థితి నన్ను ఆలోచనలో పడేసింది. దానిమీదే రాయాలన్న ఆలోచన కూడా ఏర్పడింది. అయితే – దానికి స్పష్టమైన రూపు 1963లోనే ఏర్పడింది. రావిశాస్త్రి 1963లో – నేనెందుకు రాసేను– శీర్షికను విశాఖ రచయితలకు ఇచ్చి వ్యాసాలు రాయించారు. ఆ సందర్భంలోనే నాకు – ముందు చెప్పిన స్పష్టమైన దృక్పథం ఏర్పడింది. రావిశాస్త్రి శీర్షిక సాహిత్యంలో మార్పుకి, మలుపుకి దారి చూపించింది. నేనెందుకు రాసేను? ('విశాఖ' పత్రిక – నవంబరు, 1965) లో రావిశాస్త్రి ఇలా చెప్పేరు–"రచయిత ప్రతివాడూ తాను రాస్తున్నది ఏ మంచికి హాని కల్గిస్తుందో, ఏ చెడ్డకి ఉపకారం చేస్తూందో అని ఆలోచించవలసిన అవసరం వుందని నేను తలుస్తాను. మంచికి హాని చెడ్డకి సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను". వర్గపోరాటాల వల్ల మంచి జరుగుతుందని కొందరూ, చెడ్డే జరుగుతుందని కొందరూ అభిప్రాయపడ్డారు. దేన్నయితే – కొందరు 'మంచి'గా పరిగణిస్తారో, దాన్నే కొందరు 'చెడ్డ'గా పరిగణిస్తారు! సాహిత్యంలో వర్గసంఘర్షణ ఊపందుకొంది. ఏది మంచి– ఏది చెడ్డ– నిర్ధారించే సామాజిక ప్రమాణాలేంటి? ప్రజాస్వామ్య పద్ధతిలో చిన్న జవాబు దొరుకుతుంది. వర్గస్పృహ ప్రాతిపదికగా – ఎక్కువ శాతం పీడిత బాధిత ప్రజలకు మేలు జరిగితే – దాన్ని 'మంచి'గా పరిగణించుకొనే అవకాశం ఉంది. దానివల్ల అతికొద్ది మంది ప్రజలకు కాస్త 'చెడ్డ' జరిగినా – సామాజిక న్యాయ పద్ధతిలో దాన్ని భరించక తప్పదన్న సానుకూల అవగాహన అవసరం. ఇదే ఆలోచన నాకు తోచింది.

1969లో రావిశాస్త్రి ఇలా రాశారు (విద్యార్థి సాహితి–ఆంధ్రా యూనివర్శిటి విద్యార్థి రచయితల సంఘం వారి కథా సంకలనం – ముందుమాట– 28–04–1969).– "రాజ్యాన్ని రాక్షసుల బారినుండి తప్పించాలంటే మిగతా వారు గట్టిగా నిలబడవలసి వుంటుంది. దుష్టుల్ని శిక్షించాలంటే భగవంతుడైనా సరే, మనిషి జన్మ ఎత్తవలసిందేనంటారు. మనిషైన తరువాత ఆయనకైనా సరే మరో మనిషి సాయం అవసరం కాక తప్పదు. అందుచేత, ఉడుకు నెత్తురున్నవారు దుష్ట శిక్షణకోసం కత్తులైనా పట్టాలి, కత్తిలాంటి కలాన్నైనా పట్టాలి".

1963లో రావిశాస్త్రి ప్రకటించిన ఆయన దృక్పథంలో మార్పు వచ్చిందని కొందరన్నారు. నిజానికి మార్పు రాలేదని నేననుకున్నాను. అందులో చెప్పిన 'మంచి' ని సాధించడానికి, ఇందులో 'మార్గం' చూపించారు. ప్రజాసాయుధ పోరాట మార్గాన్ని సూచించారు. కత్తి స్థాయిలో కలం ఉండాలని నిర్ధేశించారు. అయితే– దుష్ట శిక్షణ జరిగినంత మాత్రాన్న అంతా మంచే మిగులుతుందనీ, అంతా మంచే జరుగుతుందనీ చెప్పుకోగలిగే చారిత్రక ఆధారాలు ప్రపంచ చరిత్రలో ఎక్కడా కనిపించవు! 'రాక్షస రాజ్యం' – స్థానంలో – ఏ నిర్మాణం – జరగాలి? నిర్మాణం గురించి ముందుగా స్పష్టమైన పథకం – ప్రణాళిక – ఉండాలి. నిర్మాణానికి అడ్డుగా నిలిచే – దుష్ట శిక్షణ – గురించి తరువాత వస్తుంది. నిర్మాణం

గురించి ఏమీ మాట్లాడకుండా, దుష్టశిక్షణ గురించే ముందుగా మాట్లాడుతూ ఉంటే, ప్రజల్లో విశ్వసనీయత ఏర్పడదు. అది లేకపోతే, ఇటు దుష్టశిక్షణ- అటు నిర్మాణం - రెండూ కూడా జరగవు - అని నేను కొందరి విద్యార్థి రచయితలతో అన్నాను. మీరు చెప్పింది ఆలోచించవలసిన విషయమే. చర్చించుకుంటాం - అన్నారు. ఆ తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు.

1984లో రావిశాస్త్రి ఇలా రాశారు (స్వాతి వారపత్రిక - 17-08-1984) -"సామాజిక స్పృహగాళ్ళు- అని తిట్టబడే రచయితలు ఈ దోపిడీ వ్యవస్థ దుంపనాశనం కానిదే సర్వమానవ సమాన సౌభ్రాతృత్వం అనేది సర్వత్రా సిద్ధించదు, అందుచేత ఆ దుష్ట వ్యవస్థ నాశనం చేసి తీరాలని అనే స్పృహతో రాస్తారు". సర్వమానవ సమాన సౌభ్రాతృత్వం - అనే నిర్మాణం గురించి ఆయన ఇక్కడ పేర్కొన్నారు.

ఇదంతా ఇక్కడ ఎందుకు చెప్పుకున్నాం? ఏది మంచి కథ - అనే విషయం గురించి తెలుసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో చెప్పుకున్నాం. ప్రతి రచయితకీ ప్రాపంచిక దృక్పథం ఉంటుంది. అందులోంచి సాహిత్య దృక్పథం ఏర్పడుతుంది. ఆ సాహిత్య దృక్పథమే రచయిత రచనకు దిశానిర్దేశం చేస్తుంది. నడుపుతుంది. అయితే - అందరి రచయితల ప్రాపంచిక దృక్పథాలు, సాహిత్య దృక్పథాలు ఒకలా ఉండవు. భిన్నంగా ఉంటాయి. అదే విధంగా, పాఠకుల్లో కూడా - వారు గుర్తించినా, గుర్తించకపోయినా - భిన్నమైన ప్రాపంచిక దృక్పథాలు - సాహిత్య దృక్పథాలు - ఉంటాయి. రచయిత దృక్పథంతో, పాఠకుడి దృక్పథం ఏకీభవిస్తే, ఆ కథను పాఠకుడు మంచి కథగా భావిస్తారు. ఆ విధంగా - దృక్పథమే - ప్రమాణమౌతుంది. అందువల్ల, ఒకరు 'మంచికథ'గా భావించింది, మరొకరు 'చెడ్డకథ'గా భావించే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంలోనే, సాహిత్య సంస్థల - సంఘాల - గొప్పతనం- ప్రయోజనం ఉంటాయి. ఎందుకంటే - సాహిత్య దృక్పథాల్లో సారూప్యత ఆధారంగానే అవి ఏర్పడతాయి. సమైక్యంగా, నిర్దేశించుకున్న లక్ష్యాల కోసం సమైక్యంగా పనిచేస్తాయి.

ఏది మంచికథ - అనే విషయంలో కొంతమేరకు అవగాహనకు వచ్చాం కాబట్టి, ముందుకి సాగుదాం. రావిశాస్త్రి తరతరాలుగా తరగని సాహితీ సంపదను సమాజానికి ఇచ్చి వెళ్ళిపోయారు. ఆయన సాహిత్యం వల్ల ప్రభావితుడు కాని రచయిత తెలుగులో ఎవరూ లేరంటారు. అయితే - ఆయన పోయాక, ఆయన్నీ ఆయన సాహిత్యాన్నీ ఎవరూ పట్టించుకోలేదట! 2007లో - రాచకొండ విశ్వనాథశాస్త్రి తాత్విక ప్రపంచం - రావిశాస్త్రి నవలలపై విశ్లేషణ- అనే గ్రంథాన్ని రచించి ప్రచురించాను. ఇద్దరో ముగ్గురో సాహితీవేత్తలు- శాస్త్రీయ ప్రమాణాలతో విశ్లేషించబడిన విశిష్ట పరిశోధన- గా పేర్కొన్నారు. రచయితల వైపు నుంచి స్పందన లేదు. సాహిత్యాభిమానులు కొందరు బాగా స్పందించారు. అభిమానించారు. వేల మీద నష్టం వచ్చినా, సంతోషించాను. ఎందుకంటే - ఆ పరిశోధన ప్రజా చైతన్యానికి ఉపయోగపడుతుంది. 2007లోనే - రాచకొండ విశ్వనాథ శాస్త్రి కథానికా యాత్ర - తత్వ దర్శనం- అనే గ్రంథాన్ని రచించాను. దాన్ని తెలుగు విశ్వవిద్యాలయం వారు 2013లో ప్రచురించారు.

> *2007లో - రాచకొండ విశ్వనాథశాస్త్రి తాత్విక ప్రపంచం - రావిశాస్త్రి నవలలపై విశ్లేషణ- అనే గ్రంథాన్ని రచించి ప్రచురించాను. ఇద్దరో ముగ్గురో సాహితీవేత్తలు- శాస్త్రీయ ప్రమాణాలతో విశ్లేషించబడిన విశిష్ట పరిశోధన- గా పేర్కొన్నారు. రచయితల వైపు నుంచి స్పందన లేదు.*

**ఆధునిక తొలితెలుగు కథానిక - గురజాడ 'దిద్దుబాటు'**

1910-శతజయంతి సందర్భంలో, నూరేళ్ళ-నూరుగురు కథకులు - నూరు కథానికలు -సంకలనాన్ని 2010లో ప్రచురించాను. 1910 నుంచి ప్రతి సంవత్సరం, ఒక్కో సంవత్సరం ఒకే ఒక రచయిత ఒకే ఒక కథానిక సేకరించి ప్రచురించాను. **Chronological and Historical Research in Literature** - పద్ధతిలో తెలుగులో వచ్చిన తొలి సంకలనం ఇదే. ఇతర భారతీయ భాషల్లో కూడా ఈ విధంగా ఈ పద్ధతిలో వచ్చిన తొలి సంకలనం ఇదే. ఆయా భాషల సాహిత్య సంస్థల నుంచి, ప్రముఖుల నుంచి సమాచారం సేకరించగా ఈ విషయం తేలింది. 1910 - 1935 మధ్యకాలంలో ఈ పద్ధతిలో కథలు దొరకవని, కష్టాలు కొనితెచ్చుకోవద్దని మిత్రులు కొందరు నా పట్ల అభిమానంతో చెప్పారు. ఎన్నో గ్రంథాలయాల్లో వెదికి కథలను సేకరించగలిగాను. రెండు సంవత్సరాల శ్రమ ఫలించింది. రెండు లక్షల రూపాయల ఖర్చుతో దరిదాపు ఎ-4 సైజులో 700 పేజీల హార్డ్‌బౌండ్ గ్రంథం ప్రచురించాను. ఏ సంస్థ - ఏ విశ్వవిద్యాలయం - ఎవరూ - చేయని చేయలేని పనిని శాస్త్రీయ పద్ధతిలో మీరు చేశారని అయిదారుగురు రచయితలు మాత్రమే సంబరపడ్డారు. నూరుగురు రచయితలకూ లేదా వారి వారసులకూ కాపీలను సౌజన్యంతో ఉచితంగా రిజిస్టర్డు పోస్టులో పంపించాను. పదిమంది రచయితలు మాత్రమే పుస్తకం అందినట్లు చెప్పి, ఒకటో, రెండో కాపీలు కూడా కొన్నారు. మిగిలిన వారు పుస్తకం అందినట్లు కూడా చెప్పలేదు! రచయితల వైపు నుంచి రెండు

రకాల అభిప్రాయాలు వచ్చాయి. నా కథ లేకపోతే ఈ సంకలనానికి విలువెక్కడుంటుంది! అనే రీతిలో సంకలనంలో చోటు దొరికిన రచయితలు అనుకున్నారు! చోటు దొరకని వాళ్ళు, ఎవరికి తోచిన విధంగా వారు అసంతృప్తి పడ్డారు! ఆ విధంగా - రెండు వైపుల నుంచి, అన్ని వైపుల నుంచి కష్టాలే వచ్చాయి! రచయితలు కాని సాహిత్యాభిమానులు బాగా అభిమానించారు. నేను ఖర్చుపెట్టిన డబ్బు తిరిగి వచ్చేసింది.

ఈ సంకలనంలో నేను ముందుకు తెచ్చిన **Chronological and Historical Research in Literature** శాస్త్రీయమైన, ప్రయోజనకరమైన పద్ధతిగా - ప్రమాణంగా - పలు దేశాల్లోని సాహితీవేత్తలు నిర్ధారించిందే. సమాజం-చరిత్ర-సాహిత్యం - వీటిమధ్య సంబంధాలు ఏ విధంగా పరస్పరం ప్రభావితమౌతాయో - ఏ విధంగా సమాజ నిర్మాణాలకు, లక్ష్యాలకు దిశానిర్దేశం చేయడంలో ఉపకరిస్తాయో - విశ్లేషించారు. అందువల్ల, అదే పద్ధతిలో, నూరు కథలను శాస్త్రీయ ప్రమాణాలతో విశ్లేషించారు. వీలైనంత వరకూ ఎక్కువమంది కథకుల కథలకు చోటు కల్పించాలని, సంకలనంలోని 25 కథలను తొలగించి, వాటి స్థానంలో మరో 25 గురి కథలకు చోటు కల్పించి విశ్లేషించాను. సమాజ శాస్త్రాల్లో - సమాజ శాస్త్ర క్షేత్రాల్లో - ఏ ఏ శాస్త్రీయ పద్ధతులలో, ఏ ఏ శాస్త్రీయ ప్రమాణాలతో - పరిశోధనలు జరుగుతాయో - అవే పద్ధతులలో, అవే ప్రమాణాలతో సాహిత్యంలో కూడా పరిశోధనలు జరగాలన్న ధ్యేయం నాలో ఎప్పట్నుంచో ఉంది. ఇప్పుడది సాకారమయింది. అధ్యయనం (నూరేళ్ల-నూరుగురు కథకులు - నూరు కథానికలు: 1910-2009: శతజయంతి అధ్యయనం) - 2012 లో ప్రచురించాను. "సమాజ శాస్త్రాల పద్ధతిలో, ప్రమాణాలతో సాహిత్యంలో పరిశోధన చేసి చూపించారు. భావి పరిశోధనలను దిశానిర్దేశం చేశారు. ఈ అధ్యయనానికి మీకు అయిదు పి.హెచ్.డి.లు, రెండు డి.లిట్.లు ఇచ్చినా తక్కువే!....." ఈ విధంగా కొందరు ఆచార్యులూ - సాహిత్యవేత్తలూ అభినందించారు. వారి సహృదయత అభినందనీయం. 12 మంది రచయితలు అభిమానించి ఈ గ్రంథాన్ని కొన్నారు. రచయితల వైపు నుంచి స్పందన లేదు. రచయితలు కాని సాహిత్యాభిమానులు బాగా అభిమానించారు.

> ***నూరు కథలను శాస్త్రీయ ప్రమాణాలతో విశ్లేషించారు. వీలైనంత వరకూ ఎక్కువమంది కథకుల కథలకు చోటు కల్పించాలని, సంకలనంలోని 25 కథలను తొలగించి, వాటి స్థానంలో మరో 25 గురి కథలకు చోటు కల్పించి విశ్లేషించాను.***

2013లో - ప్రాచీన కథ - ప్రస్థానం - ఆరువేల సంవత్సరాల కథా యాత్ర - అనే గ్రంథాన్ని ప్రచురించాను. 'నాలుగు సంవత్సరాలు నిరంతర కృషి చేశాను. మూలగ్రంథాలు పరిశోధించి రాశాను. మూలగ్రంథాలు దొరక్క నానాపాట్లు పడ్డాను. న్యూఢిల్లీ, వారణాసి, పూణే నుంచి గ్రంథాలు సేకరించాల్సి వచ్చింది. దరిదాపు ఎ-4 సైజులో 610 - హార్డ్‌బౌండ్ గ్రంథం. రెండు లక్షల రూపాయల ఖర్చు. 150 గ్రంథాలకు పైగా, ముఖ్యంగా ఆంగ్ల గ్రంథాలు- సంప్రదించి రాశాను. మన ప్రాచీన కథ, ఆరువేల సంవత్సరాలనాటి ఋగ్వేదంలో ప్రారంభమయింది. అప్పట్నుంచి 19వ శతాబ్ది ముగింపు వరకూ- అంటే ఆరువేల సంవత్సరాల కాలంలో వచ్చిన భారతీయ కథా- తెలుగు కథా - సాహిత్య విభాగం మొత్తాన్ని దొరికిన మేరకు పరిశోధించి, చారిత్రక వివరాలతో, విశ్లేషణతో ఈ గ్రంథంలో ఒకచోట చేర్చాను. అంతేకాకుండా, ప్రాచీకథ స్వరూప స్వభావాలు తెలుసుకోవడానికి వీలుగా, కథా కావ్యాల్లోని ప్రతినిధి కథలను లేదా పూర్తి కథలను కూడా విశ్లేషించాను. "ప్రాచీన కథా విజ్ఞాన సర్వస్వం... ప్రాచీన కథా విజ్ఞాన ఖజానా... సాహిత్య చరిత్రకు మహోపకారం చేసిన పరిశోధన... ప్రాచీన కథపైన తెలుగులో వచ్చిన మొట్టమొదటి సమగ్ర పరిశోధన... ఇతర భారతీయ భాషల్లో కూడా ఇదే మొట్టమొదటి సమగ్ర పరిశోధన... పది పిహెచ్‌డిలు ఇచ్చినా తక్కువే... అయిదు డి.లిట్‌లు ఇచ్చినా చాలవు..." ఆ విధంగా ఆచార్యులు, సాహిత్యవేత్తలు అభినందించారు. ఆరుగురు రచయితలు మాత్రమే అభిమానించి, గ్రంథాన్ని కొన్నారు. రచయితల వైపు నుంచి స్పందన లేదు. సాహిత్యాభిమానులు నన్ను చాలా బాగా అభిమానిస్తున్నారు. వారిలో వైద్యనిపుణులు, న్యాయవాదులు, ఆచార్యులు, ఉన్నతోద్యోగులు మున్నగువారు కూడా ఉన్నారు. వారి సహృదయత, సాహిత్యాభిమానం శిఖరాగ్రమయినది. అభినందనీయమైనది.

ప్రాచీన కథ - ప్రస్థానం - కొనసాగింపుగా ఆధునిక కథ - ప్రస్థానం - రచిస్తున్నాను. ఇది కూడా దరిదాపు ఎ-4 సైజులో 650 పేజీల గ్రంథం. ఈ సంవత్సరం చివర్లో వెలుగుచూస్తుందని భావిస్తున్నాను. దీనితో కథా సాహిత్య విభాగం మొత్తం - ప్రాచీన కథ ఆవిర్భావం నుంచి నేటి వరకూ - చారిత్రక పద్ధతిలో - చారిత్రక వివరాలతో- పరిచయాలతో - విశ్లేషణలతో - ఎంతో కొంతమేరకు ఏదో రూపంలో రెండు గ్రంథాల్లో దొరుకుతుంది.

అనువాద క్షేత్రంలో కూడా చిన్న కృషి చేస్తున్నాను. 20 రచయితల 20 కథలను ఎంపికచేశాను. ఆచార్య శేషారత్నం హిందీలోకి అనువదించారు. తెలుగుకీ చునీహుఈ కహానియాం- శీర్షికన సంకలనాన్ని 2004లో సందర్భ

ప్రకాశన్, న్యూఢిల్లీ వారు ప్రచురించారు. రచయితలకూ లేదా వారి వారసులకు కాపీని రిజిష్టర్డు పోస్టులో సౌజన్యపూర్వకంగా పంపించాను. ఆ అనువాద గ్రంథానికి మానవ వనరుల శాఖ జాతీయ పురస్కారం లభించింది. అప్పటి ప్రధానమంత్రి గౌరవనీయులు అటల్ బిహారీ వాజపేయి తన చేతుల మీదుగా ఆ పురస్కారాన్ని ఆమెకు అందజేశారు. ఆ వార్త తెలిసి, అంతవరకూ మౌనంగా ఉన్న ఇద్దరు వారసులు – ఆ ఇద్దరూ కూడా అనువాదకులే – ఆచార్య శేషారత్నం మీద కేసుపెడతామని బెదిరింపులు మొదలెట్టారు. ఆ ఇద్దరు రచయితలూ ఎన్నో ఏళ్ల క్రితమే అనుమతులిచ్చారు. ఆ కథలను ఆమె అనువాదం చేసి హిందీ పత్రికల్లో ప్రచురించారు. ఆ కథలను ఆమె ఈ సంకలనంలోకి తీసుకున్నారు. అదీ ఆమె చేసిన నేరం! నేను వాళ్లతో మాట్లాడలేదు కానీ, స్నేహితుల ద్వారా సమస్య పరిష్కరించుకున్నాం.

కాపీలు అందినట్లు నలుగురు రచయితలు మాత్రమే చెప్పారు. మిగతావారు ఆ మాట కూడా చెప్పలేదు! 2013లో 20 రచయితల 20 కథలను ఎంపిక చేయగా డా॥క్రిష్ణబాబు అనువదించారు. నూఢిల్లీ ప్రచురణ సంస్థ ప్రచురిస్తోంది. ప్రముఖ హిందీ సాహితీవేత్త (నూఢిల్లీ) ముందుమాట రాశారు. ప్రచురణ సంస్థ అడిగిన డబ్బు పంపించాను. 100 కాపీలు కొనడానికి కూడా ఒప్పుకున్నాను. ఈ సంవత్సరంలోనే వెలుగు చూస్తుందని అనుకుంటున్నాను. పుస్తకాలు అందాక రచయితలకు సౌజన్యపూర్వకంగా (ఉచితంగా) కాపీలు పంపిస్తాను.

హిందీ అనువాదం చాలా ఖర్చుతో కూడుకున్నది. అనువాదకులు కూడా కథకి రూ.500 అడుగుతున్నారు! నూఢిల్లీ ప్రచురణసంస్థలు మన ఖర్చుతోనే ప్రచురిస్తారు. లాభాలు మాత్రం వాళ్లవి! అయితే – ఆ పుస్తకాలు మన దేశంలోనే కాకుండా, విదేశాల్లోని పాఠకులకు కూడా చేరుతాయి. మా నూరేళ్ల సంకలనంలోని 100 కథలూ (అందులోని 50 కథలు తొలగించి, వాటిస్థానంలో మరో 50 కథలు చేర్చాను.) అనువాదకులు ఉచితంగా హిందీలోకి అనువాదం చేస్తున్నారు. అదే విధంగా మలయాళంలోకి కూడా అనువాదం ప్రారంభమయింది. అయితే ఎంతకాలం ఎన్ని సంవత్సరాలు పడుతుందో నాకే తెలియదు! నూరు నవలలపై నూరుగురు సాహితీ వేత్తల చే ప్రత్యేక వ్యాసాలు రాయించి సంకలనం ప్రచురించాలన్న ఆలోచన కూడా ఉంది.

నా అనుభవంలోకి వచ్చిన కొన్ని వాస్తవాలు కొన్ని సాధారణ వాస్తవాలు కొన్ని గుర్తించాను.

1. సాహిత్యం మొత్తానికి సంబంధించిన కృషి నిస్వార్థంగా చేస్తే, సాహిత్యాభిమానులకు కొదవ లేదు.

2. రచయితలలో, కొద్ది మినహాయింపులతో, అధ్యయన శీలత లేకుండా పోయింది. పుస్తకాలు కొనరు చదవరు. వారి కథ సంకలనాలలో లేదా అధ్యయన గ్రంథాల్లో ఉందా? లేదు అన్నంత వరకే పరిమిత మయిపోతున్నారు.

3. కష్టపడి శ్రమించి జీవించే జన సామాన్యంలో నున్న జీవన విలువలు కూడా చాలా మంది రచయితల్లో కనిపించవు. సాహిత్య పట్ల ప్రజలకు గౌరవం, అభిమానం లేకుండా పోవడానికి ఇది కూడా ముఖ్యకారణమే.

4. ప్రజా ఉద్యమాలు బలహీనపడినప్పుడు సాహిత్యం తన శక్తినంతా పుంజుకుని విజృంభించి, ప్రజా ఉద్యమాలను పునరుజ్జీవింపజేయటం లేదా కొత్తఉద్యమాలకు ఊపిరి పోయటం చేయాల్సి ఉంది. ఆ పని జరగటం లేదు. సాహితీ వ్యవస్థ క్షీణదశలో పడిపోయింది. సమిష్టి ఉద్యమ కృషి లేదు.

*ప్రజా ఉద్యమాలు బలహీనపడినప్పుడు సాహిత్యం తన శక్తినంతా పుంజుకుని విజృంభించి, ప్రజా ఉద్యమాలను పునరుజ్జీవింప జేయటం లేదా కొత్తఉద్యమాలకు ఊపిరి పోయటం చేయాల్సి ఉంది. ఆ పని జరగటం లేదు. సాహితీ వ్యవస్థ క్షీణదశలో పడిపోయింది. సమిష్టి ఉద్యమ కృషి లేదు.*

5. సాహిత్య వ్యవస్థలో నిశ్శబ్దం మానసిక రోగాలు ప్రబలి పోతున్నాయి. ఇది చాలా హానికరమైన వ్యాధి.

6. నెలకి లక్షల మీద ప్రజాధనాన్ని జీతాలుగా పుచ్చుకుంటున్న విశ్వవిద్యాలయ ఆచార్యులు, కొద్ది మినహాయింపులతో, మొక్కుబడి సాహిత్య పరిశోధలు నిజానికవి పరిశోధనలు కూడా కావట చేయిస్తున్నారట! ఆ మాట నేను ఆచార్యుల నోటంటే విన్నాను.

7. మన సాహిత్య వ్యవస్థలో సాహిత్య కార్యకర్తలు లేరు. నిర్మాణంలోనే లోపాలున్నాయి.

8. రాజకీయ వ్యవస్థ పట్ల ప్రజలు ఏవిధంగా విశ్వాసం కోల్పోయారో. అదేవిధంగా సాహిత్య వ్యవస్థ పట్ల కూడా ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారు.

యువతరం రచయితలు విద్యార్థి రచయితలు సమిష్టిగా నడుంబిగించి ముందుకు రావాల్సి ఉంది. వర్గ రహిత వివక్ష రహిత సమసమాజ ప్రజాస్వామ్య సహజీవన సంస్కృతి లక్ష్యంగా ఉద్యమించాల్సి ఉంది. సాహిత్య వ్యవస్థను నిశ్శబ్దం నుంచి, మానసిక రోగాల నుంచి విముక్తి చేయాల్సి ఉంది. యువతరం ఆ పనిని చేయగలరనీ, చేస్తారని ఆశిద్దాం.

**పరిశీలన**

# తెలుగు భాషకు వావిళ్ళ వారు చేసిన సేవ



వావిళ్ళ రామస్వామి శాస్త్రులు వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రులు


– డా. జి. శైలమ్మ

**9618361905**


***తెలుగు భాషలో ఉన్న గ్రంథాలు 18వ శతాబ్దిలో వ్రాత ప్రతులుగానే ఉండేవి. అవి ఎక్కువగా తాటియాకులపై రాసిన తాళపత్ర ప్రతుల్లో లభించేవి. చిన్న తాటాకు పై రాయడం ఎంత కష్టమో, చదవడం అంతకన్నా కష్టంగా ఉండేది. కారణం లేఖన కౌశలం ఒక్కొక్కరిది భిన్న రీతులలో ఉండటమే. కొంత మంది బ్రహ్మరాతలు రాసేవారు. వాళ్లు రాసింది వారికే అర్థమవుతుంది. కొంతమందికి అది కూడా అర్థం కాదు. కొంత మంది లేఖన విధానం గొలుసు కట్టుగా ఉంటుంది. దీని వల్ల చాలా గ్రంథాలు ప్రచారం లేక మూల పడిపోయి ఉండేవి. బహుళ జనాదరణ పొందవలసిన గ్రంథాలు ముద్రణకు నోచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వావిళ్లవారు గుర్తించారు.***

నెల్లూరు జిల్లాలోని రామతీర్థం దగ్గర ఉన్న చిన్న ఊరు వావిళ్ళ . 'వావిళ్లవారి వాఙ్మయసేవ' గ్రంథాన్ని ఋషి వెంకట రమణయ్య రాశారు. దీనికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి బహుమతి లభించింది. వావిళ్లవారి వాఙ్మయ సేవ గురించి మరుపూరు కోదండ రామరెడ్డి కూడా రాశారు.

తెలుగు భాషలో ఉన్న గ్రంథాలు 18వ శతాబ్దిలో వ్రాత ప్రతులుగానే ఉండేవి. అవి ఎక్కువగా తాటియాకులపై రాసిన తాళపత్ర ప్రతుల్లో లభించేవి. చిన్న తాటాకు పై రాయడం ఎంత కష్టమో, చదవడం అంతకన్నా కష్టంగా ఉండేది. కారణం లేఖన కౌశలం ఒక్కొక్కరిది భిన్న రీతులలో ఉండటమే. కొంత మంది బ్రహ్మరాతలు రాసేవారు. వాళ్లు రాసింది వారికే అర్థమవుతుంది. కొంతమందికి అది కూడా అర్థం కాదు. కొంత మంది లేఖన విధానం గొలుసు కట్టుగా ఉంటుంది. దీని వల్ల చాలా గ్రంథాలు ప్రచారం లేక మూల పడిపోయి ఉండేవి. బహుళ జనాదరణ పొందవలసిన గ్రంథాలు ముద్రణకు నోచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వావిళ్లవారు గుర్తించారు.

**ముద్రణాయంత్ర సామగ్రి**

గ్రంథ ముద్రణ కార్యక్రమం పాశ్చాత్య దేశాల్లోనే మొదట జరిగింది. క్రీ.శ. 1571 – 1630 సంవత్సరాల మధ్యకాలంలో విల్లె జాన్స్ బ్లాక్ **(villian Jonson Black)** వ్రాని ముద్రాయంత్రాన్ని కని పెట్టాడు. దీనికే బ్లో వాదుమయ హస్త ముద్రాయంత్ర మని పేరు **(Black's wooden hand press)** తరువాత కొంత కాలానికి క్రీ.శ. 1753 – 1816ల మధ్య కాలంలో దీని కంటే మెరుగైన ఆల్బియన్ **Albion press** ముద్రణాయంత్రం వచ్చింది. ఇదేకాలంలో కొలంబియన్ ముద్రాయంత్రం కూడా వచ్చింది. ఈ యంత్రాల పని తీరు అంతంత మాత్రమే. కారణం అక్షరాలకు కాటుక పట్టించి. కాగితాన్ని పరచడం, ముద్రించడం వంటి పనులన్ని చేతితోనే చేయాల్సి రావడం వల్ల ఎక్కువ ప్రతులను ముద్రించ లేక పోయే వారని లోటు పాట్లను తెలియజేశారు.

క్రీ.శ. 1774 – 1833 మధ్యకాలంలో ఫ్రెడ్‌రిక కోనింగ్ జర్మనీ దేశీయుడు, మొదట సిలిండర్ ముద్రా యంత్రాన్ని కనిపెద్దడం వల్ల ముద్రించడం కొంచెం సులభమైంది. 19 వ శతాబ్దం నాటికి ముద్రణా యంత్రాలు అనేకం వెలువడ్డాయి.

క్రీ.శ 1812 న ఫోర్టు సెంట్ కాలేజి బోర్డు స్థాపించబడింది గవర్నమెంటు అధికారులు ద్రావిడ భాషలలో

ను ఆంగ్ల భాషలోను గ్రంథ ముద్రణ కావించారు. కాలేజి ప్రెస్ **(college press)** స్థాపించడానికి ముందే చెన్న పట్టణం (మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము **(oriental manuscripts library)** మదరాసు లిటరరీ సొసైటీ **(madras literary society)** ప్రదర్శనా శాలలో నెలకొల్పబడింది. కాలేజీ బోర్డులో బహుభాషా కోవిదులగు ఎ.డి. కాంచెలు. ఎఫ్. డబ్లియు ఎల్లిస్ మున్నగు వారు సభ్యులుగా ఉన్నారు. క్రీ.శ. 1835 సం॥ నుండి తెలుగు వాఙ్మయం ముద్రణకు నోచుకుంది. పద్య గ్రంథాలు, సంస్కృత గ్రంథాలు కొన్ని ముద్రించబడ్డాయి.

> ***తెలుగు ముద్రణకు విశేషంగా కృషి చేసిన వారు పుదూరు ద్రావిడ వంశానికి చెందిన వావిళ్ల రామస్వామి శాస్త్రులు గురించి తెలుసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీరు పుట్టుకతో తమిళులు అయినప్పటికి తెలుగు భాషపట్ల ఉన్న మక్కువ కొద్ది తెలుగు ముద్రణను అభివృద్ధి చేశారు.***

గ్రంథ ముద్రణలో తమిళులకు ఉన్న శ్రద్ధ తెలుగువారికి ఆ కాలంలో లేదు. ముద్రణకు ఉపయోగించే కాటుక, కాగితాలు ఇతర దేశాలనుండి రావాల్సిందే. తమిళులు ముందుగా తెచ్చుకొనేవారు. తమిళులకు లిపి సౌలభ్యం కూడా ఎక్కువ. అక్షరాలు తక్కువ ఈ భాషలో ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలు లేవు. ఋకారం లేనందున వట్రసుడి ఆవశ్యకత లేకండా ఉండేది. తమిళ గ్రంథ ముద్రణ తెలుగు గ్రంథ ముద్రణ కంటే ఒక శతాబ్దకాలం ముందున్నారని చెప్పటంలో సందేహం లేదు.

తెలుగులో అచ్చుకూర్పుకు ఉపయోగించు అక్షరాల దిమ్మలు అయిదు విధాలుగా ఉండేవి. అవి

1. హెడ్డింగ్ గ్రేట్ ప్రయిమర్ **(Heading great primer)**
2. టూలైన్ ఇంగ్లీషు బాడీ **(two line english body)**
3. గ్రేట్ ప్రయిమర్ **(great primer)**
4. ఇంగ్లీష్ బాడీ **(english body)**
5. లాంగ్ ప్రయిమర్ **(long primer)**

తెలుగు ముద్రణకు విశేషంగా కృషి చేసిన పుదూరు ద్రావిడ వంశానికి చెందిన వావిళ్ల రామస్వామి శాస్త్రులు గురించి ఇప్పటివారు తెలుసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీరు పుట్టుకతో తమిళులు అయినప్పటికి తెలుగు భాషపట్ల ఉన్న మక్కువ కొద్ది తెలుగు ముద్రణను అభివృద్ధి చేశారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన రాజులు, కవులను గురించి కూడా ఈ గ్రంథంలో వివరించారు.

వేంగీ దేశాన్ని పాలించే చాళుక్య ప్రభువులు చోళరాజులతో బంధుత్వము కలుపు కొన్నారు. చాళుక్య చక్రవర్తి రాజనరేంద్రుడు ఆంధ్రవాఙ్మయానికి ఆది పోషకుడు, అతని కుమారుడు కులోత్తుంగుడు ద్రావిడ భాషలకు తెలుగు భాషకు విశేష కృషి చేశారు. శ్రీ కృష్ణ దేవరాయలు వాడుక భాష కన్నడం అయినా తెలుగు భాషకు విశేషంగా కృషి చేశారు. మహా రాష్ట్ర ప్రభువులు తమ భాషతో సమానంగా తెలుగు భాషను అభివృద్ధి చేశారు.

పుదూరు ద్రావిడ బ్రాహ్మణులు నెల్లూరు జిల్లాలోని నాయుడుపేటకు సమీపాన గల పుదూరు గ్రామాన నివాస మేర్పరచుకొన్నారు. తమిళంలో పుదు పదానికి 'క్రొత్త' అనే అర్థం ఉంది. పుదూరు వెంకటగిరి ప్రభువులకు చెందినది. వెంకటగిరి రాజావారు విద్యాపోషకులు, విద్వదభిమానులు కావటం వలన వీరికి కొంత ఇనాము ఇచ్చి పోషించారు. పుదూరు వాసులు తమిళులు అయినప్పటికి నివాసం ఆంధ్ర ప్రాంతంలో ఉండుటవల్ల ఆంధ్రుల వలె ఇంటి పేరుని ఊర్ల పేర్లతో స్థిర పరచుకొన్నారు. అవే నేలటూరు, చదలవాడ, వావిళ్ల, కాళహస్తి మొదలైనవి.

ఈ గ్రంథంలో ఆనాడు మత శాఖలు ఏ విధంగా ఉన్నాయో, వావిళ్ళవారు ఏ మతానికి చెందిన వారో తెలుసుకొనే ఆస్కారం ఉంది. దక్షిణ దేశంలో బ్రాహ్మణులలో ద్వైతులు, అద్వైతులు, విశిష్టాద్వైతులు అనే మూడు తెగలవారున్నారు. ద్వైతులను మాధ్వులని, అద్వైతులను స్మార్తులని, విశిష్టా ద్వైతులను వైష్ణవులని పిలుచుకొనే వారు. పుదూరు ద్రావిడలలో స్మార్తులు, వైష్ణవులు అను రెండు తెగలున్నాయి. అయితే వీరు ఏ తెగకు చెందినవారు. అనే దాని మీద చర్చఉంది. దీనికి వేదం వెంకటరాయ శాస్త్రి పుదూరు ద్రావిడులు మొదట వైష్ణవులని తరువాత కొంతకాలానికి కొంత మంది స్మార్తులుగా మారారని వివరణ ఇచ్చారు.

ఒక పుస్తకాన్ని ముద్రించాలి విజ్ఞానాన్ని పంచాలన్న తపన కలిగిన వ్యక్తి వావిళ్ల రామ స్వామి శాస్త్రులు . పుస్తక ముద్రణకు అవసరమైన జ్ఞానాన్ని పొందాడు. వివిధ భాషల్లో ప్రావీణ్యం పొందాడు.

రామస్వామి శాస్త్రులు, ఇతని సోదరుడు అనంతునారాయణ శాస్త్రి వేదాధ్యయనంలో, సంస్కృత భాష నేర్చుకొనటంలో ఎక్కువ మక్కువ కలిగుండేవారు. నెల్లూరు లోని శ్రీకృష్ణ ఉపాధ్యాయుల వద్ద వేదాధ్యయనం చేసి గోదావరి జిల్లాలోని దాక్షారామంలో ఉన్న ప్రసిద్ధ విద్వాంసులు పాపయ్య శాస్త్రి వద్ద కొంతకాలం పాటు వ్యాకరణం అభ్యసించారు. పోషణ భారమైనందువల్ల చెన్నపట్టణంలోని తండియార్పేటలో ఉన్న తంజావూరు రామానాయుడు శ్రీమంతులు, ఉదారస్వభావులు సంస్కృత భాషపట్ల మక్కువ ఎక్కువ

అందువల్ల సంస్కృత పాఠశాలను ఏర్పాటు చేయడమే కాక ఉచిత భోజనం వసతి సౌకర్యం ఏర్పాటు చేశాడు. రామస్వామి సోదరులు ఇక్కడే వ్యాకరణ సాహిత్యం అభ్యసించారు. ఇక్కడ వారికి సంతృప్తి కరంగా లేకపోవడం చేత మైసూరుకి వెళ్లి కన్నడం కూడా రాయడం, మాట్లాడటం నేర్చుకొన్నారు. విద్యనభ్యసించడానికి వారికున్న భక్తి ఆసక్తి, అభిరుచి నేటి యువతకు ఆదర్శం కాగలదు.

**గ్రంధముద్రణ పట్లఉన్న ఆసక్తి:**

రామస్వామి శాస్త్రులుకి గ్రంధముద్రణ విధానం పట్ల ఉన్న మక్కువ కొద్ది మొట్ట మొదటిసారిగా మైసూరులో కన్నడ గ్రంధాన్ని ముద్రించారు. దీనికి తగిన ఆదరణ, సహాయం లభించనందున మద్రాసులో ఏర్పాటు చేయాలను కొన్నారు. వీరి సంకల్పానికి అండగా నిలిచిన వారు సర్.టి.మాధవ రావు, గౌరవనీయులు వళ్లె చెంచలరావు, అంబాశంకరదవే, వల్లూరు జమీందారు, వేదం వెంకటాచల శాస్త్రి కలసి 'వివేక రత్నాకర ముద్రాక్షరశాల' పేర ముద్రణాలయాన్ని స్థాపించి గ్రంథ ముద్రణను సాగించారు. దీని ద్వారా ఆశించిన రీతిలో ఫలితం రానందువల్ల రామశాస్త్రుల వారే స్వయంగా 'హిందూ భాషా సంజీవని' పేరుతో అప్పుచేసి మరీ ముద్రాక్షరశాలను స్థాపించాడు. ఇది బాగా సాగుతున్న సమయంలో సోదరుడు అనంత నారాయణ శాస్త్రి ఉపాధ్యాయునిగా మైసూరులో నియమించబడటం వల్ల ఒంటరి అయిన రామస్వామి అధైర్యపడకుండా ముందుకు నడిచాడు. సహపాఠి అయిన సరస్వతి, తిరువేంకట చార్యులు కొంతకాలానికి నెల్లూరులో స్థిరపడ వలసి రావడంతో ముద్రణ కుంటుపడింది. ఈ సమయంలో రామస్వామి తండియార్పేటలో తమ గృహంలోనే ఆది సరస్వతీ నిలయ ముద్రాక్షరశాలను ఏర్పాటు చేసి ముద్రణను కొనసాగించారు.

> ***వావిళ్ళ రామస్వామి శాస్త్రుల వారు తాళ పత్ర గ్రంధాలను సేకరించడం, ముఖ్యమైన వనుకొన్నవి ప్రచురించడంలో విశేషకృషి చేసినారు. అతి తక్కువ కాలంలో 50 గ్రంథాలను ప్రచురించారు. అవసరమైన గ్రంథాలను ప్రచురించారు.***

ముద్రణ చేయాలన్న సంకల్పం పట్టుదలే రామస్వామి శాస్త్రుల వారిని ముందుకు నడిపాయి. ఎదురైన కష్టాలకు ఎక్కడ కుంగిపోలేదు. 1854 నుండి గ్రంథ ముద్రణ చేపట్టినట్లు బ్రిటీషు మ్యూజియం అధికారులు ప్రకటించిన గ్రంథ పట్టిక ద్వారా తెలుస్తుందంటే ఈయన ఖ్యాతి ఎంతదూరం పోయిందో గమనించాలి. ముద్రాపకులుగా, గ్రంథ ప్రచురణ కర్తగా గ్రంధ సంపాదకులుగా పనిచేసి ఈయన సంకల్పాన్ని నెరవేర్చుకున్నారు. బ్రౌను పండితుడు ఈయన గురించి ఇలా వ్యాఖ్యానించాడు. 'చేతి వ్రాత పుస్తకములు చదువుకొనే రోజులలో శ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రుల వారు ముద్రణాలయమును స్థాపించి చదువరుల కష్టములను నివర్తింప జేసిరి.' పు: 17 అని అన్నారు.

వావిళ్ళ రామస్వామి శాస్త్రుల వారు తాళ పత్ర గ్రంధాలను సేకరించడం, ముఖ్యమైన వనుకొన్నవి ప్రచురించడంలో విశేషకృషి చేసినారు. అతి తక్కువ కాలంలో 50 గ్రంథాలను ప్రచురించారు. అవసరమైన గ్రంధాలను ప్రచురించారు. సంస్కృతం అభ్యసించే వారిని దృష్టిలో పెట్టుకొని అమరకోశము, శబ్ద మంజరి, బాలరామాయణం, వ్యాఖ్యానంతో కూడిన రామయణం, భాగవతం ప్రచురించారు.

ఆ రోజుల్లో ముద్రణ ఏవిధంగా చేసేవారో తెలుసుకోవచ్చు. ముద్రణ చేయడానికి ఎంత కష్టపడ్డారో కూడా తెలుస్తుంది. ముద్రణాశాలలో ముద్రించుటకు కావాల్సిన పేపరు, శుద్ధప్రతిని తీసుకొచ్చే వాళ్లకు దినవేతనం ఇవ్వడం మొదలైన కష్టాలను ఆనాడు ఎలా ఎదుర్కొన్నారో రామస్వామి శాస్త్రుల కుమారుడు వేంకటేశ్వర శాస్త్రులు ఇచ్చిన వివరణ, భాషా పరిశీలన వల్ల తెలుసుకోవచ్చు-

"కడచిన శతాబ్దిలో గ్రంథప్రచురణ చాలా వింతగా ఉండెడిది. ముట్టు కొనినచో చినిగి పోవునంతటి పలచని గోధుమ రంగు కాగితములనే సాధారణంగా ముద్రాపకులు వాడచుండెడివారు. అట్టి కాగితము రీము ఒక్క రూపాయకు దొరుకుచుండినది (రీము× ఒక ఫారము వేయిప్రతులను ముద్రించుటకు సరిపోవు కాగితము) అచ్చు కూలి ఫారమున కొక్క రూపాయ. పండితులు గ్రంథమును సంస్కరించి అచ్చు తప్పులు సరిదిద్దుటకు ఫారమునకు ఒక రూపాయతో సంతృప్తి పడుచుండిరి. కావలసిన అక్షరముల దిమ్మెలు లేకున్నను అచ్చు పనులు నిలువనే నిలువవు. పోత పోసిన అక్షరములు వచ్చు వరకును నిరీక్షింపనవసరము లేనే లేదు. 'ప' – అక్షరం లేనిచో దానికి బదులు –వ, 'న' లేనిచో దానికి మారుగా 'స', 'ర' లేనిచో 'ఠ', ఈ రీతిగా కూర్చి ముద్రించినచో' సరిపోవును గదా! దాని కయి నిరీక్షింపనేల?"

తక్కువ స్థలంలో ఎక్కువ అక్షరాలు పట్టేట్లు అందంగా ఉండేలా గ్రేట్ ప్రయిమర్ టైపు నందును, ఇంగ్లీషు బాడీలోనూ అక్షరాలను పోత పోయించి ముద్రణ కళకొక శోభను తెచ్చారు. అప్పటి కాలంలో వాల్మీకి రామాయణాన్ని వ్యాఖ్యాన సహితంగా మాస సంచికలుగా ముద్రించారు. దీనికి 850 మంది చందాదారులు నెలకు చందా ఒక్క రూపాయి పదహైదు

సంపుటాలుగా ముద్రించారు. దీని వెల డెబ్బై రూపాయలుగా నిర్ణయించబడింది. రామాయణం రెండు కాండలు ముద్రణ పూర్తయిన కాలంలో 1891 న రామస్వామి శాస్త్రులు మరణించారు. అముక్తమాల్యద అను ప్రౌఢ ప్రబంధానికి వ్యాఖ్యను రచించి 1869 లో ముద్రించారు. అనాడు కొరక రాని కొయ్య అయినప్పటికీ రామస్వామి శాస్త్రులు వారు ఆసక్తితో ముద్రించారు. ఈయన కుమారుడు వేంకటేశ్వర శాస్త్రులు ముద్రణా భారాన్ని తలకెత్తుకున్నాడు.

**వేంకటేశ్వర శాస్త్రులు:** వావిళ్ల రామస్వామి శాస్త్రులకు కలిగిన కుమారుడు వెంకటేశ్వర శాస్త్రులు. ఈయన 1885న జన్మించాడు. ఈయనకు ఆరేళ్ల వయస్సులో తండ్రి మరణించారు. ఈయన కూడా తండ్రిలాగే సంస్కృతం ఆంగ్లం అభ్యసించి ఆంగ్ల, సంస్కృత తెలుగు గ్రంథాలను ముద్రించేవారు. వావిళ్ల ముద్రణాలయ మేనేజరుగా పనిచేసిన కాళహస్తి చంద్రమౌళి, వేంకటేశ్వర శాస్త్రుల వారికి కుడి భుజంగా ఉండేవారు. వేంకటేశ్వర శాస్త్రులు బహుభాషా వాఙ్మయ సేవను గుర్తించి ఆంధ్రావళి వారు భాషోద్ధారక అన్న బిరుదును, ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వారు కళాప్రపూర్ణ బిరుదు నిచ్చి సత్కరించారు. ఈయన 1956 లో మరణించారు.

*వావిళ్ల రామస్వామి శాస్త్రులకు కలిగిన కుమారుడు వెంకటేశ్వర శాస్త్రులు. ఈయన **1885**న జన్మించాడు. ఈయనకు ఆరేళ్ల వయస్సులో తండ్రి మరణించారు. ఈయన కూడా తండ్రిలాగే సంస్కృతం ఆంగ్లం అభ్యసించి ఆంగ్ల, సంస్కృత తెలుగు గ్రంథాలను ముద్రించేవారు.*

స్వాతంత్రోద్యం సమయంలో భారతీయులను విడగొట్టి పాలించే దృక్పథం పాశ్చాత్యులలో నిండుగా ఉండేది. దాని ఫలితమే బెంగాళీదేశం రెండుగా విడిపోయింది. అదే సమయంలో వందేమాతర ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. జాతీయోద్యమాన్ని ప్రోత్సహించడానికి బంకించంద్ర చటర్జీ రచించిన ఆనందమఠం అను నవలను అనువదించి ముద్రించారు. అంతే కాకుండా మహా పురుషుల జీవిత చరిత్రలను ముద్రించి ప్రచురించారు. 1916లో 'త్రిలింగ' అను పత్రికను కూడా నడిపేవారు. ఈ పత్రిక వార పత్రికగా మొదట ఏర్పడినా తరువాత మాస, పక్షపత్రికగా మారింది. ప్రజాదరణ పొందే గ్రంథాలతో పాటు వివాదానికి గురైన గ్రంథాలను కొడా వావిళ్లవారు ముద్రించడం జరిగింది.

త్రిలింగ పత్రికలో వాఙ్మయ భాషా విషయాలతో పాటు సహాయ నిరాకరణ ఉద్యమం, త్రాగుడు నిరోధము, మధ్యపాన నిషేదం, దేవాలయ ప్రవేశం మొదలైన అంశాలతో వెలువడేది. ఈ పత్రికకు విద్యాశేఖర అక్కిరాజు ఉమాకాంతం గారు సంపాదకత్వం వహించేవారు.

తెలుగు పత్రికతో సంతృప్తి చెందక ఆంగ్లవార పత్రికను 1927 జనవరిలో ఫెడరేటెడ్ ఇండియా పేరుతో ప్రారంభించాడు. దీనికి అనుభవజ్ఞులైన పత్రికారచయిత వ్యాసరావు సంపాదకులుగా ఉన్నారు. దీని ప్రధాన ఉద్దేశ్యం భారతదేశం విడిపోవడం కంటే ఐక్యతతో ఉండటం మంచిదని చెప్పడానికి రూపొందించబడింది.

దేశభక్తి మెండుగా ఉన్న వేంకటేశ్వర శాస్త్రుల గారికి, జాతియోద్యమ నాయకులు లోకమాన్య బాలగంగాధర తిలక్, గాంధీ మహాత్మునితోను పరిచయం ఏర్పడింది. బాలగంగాధర తిలక్ మరాఠి భాషలో రాసిన 'భగవద్గీత రహస్యాన్ని' నోరి సుబ్రహ్మణ్య శాస్త్రి గారిచే అనువదింపజేసి ముద్రించారు. కొద్ది కాలంలో ప్రతులు అమ్ముడు పోయాయి. తరువాత ముద్రణకు నోచుకోలేదు. మరాఠిలో వెలువడుతున్న కేసరి పత్రిక సంపాదకుల వద్ద నుండి కాపీరైట్స్ లభించనందువల్ల ఈ గ్రంథం మలి ముద్రణకు నోచుకోలేదు.

విద్యార్థులకు ఒక రోజు భోజనం పెట్టించడమే కాక వివిధ రకాల పోటీలు పెట్టి గెలిచిన వారికి బహుమతులు ఇచ్చేవారు. విద్యార్థులకు ఆర్థిక సాయం చేసేవారు. లాభాపేక్ష లేకుండా గ్రంథముద్రణ కార్యక్రమాన్ని చేపట్టిన వావిళ్లవారు ముద్రణా లయము పెట్టి సార్థకత సాధించారని చెప్పుటలో సందేహం లేదు. వావిళ్లవారు తెలుగు వాఙ్మయాన్ని ముద్రించుటలో ముందడుగే గాని వెనుకడుగు వేయలేదు. వావిళ్లవారు వ్యావహారిక భాషోద్యమం ముమ్మరంగా జరిగే కాలంలో వావిళ్ల వారు గ్రాంధిక భాషలోనే గ్రంథ ముద్రణ సాగించేవారు. గురజాడ అప్పారావు వ్యావహారిక భాషా ప్రాధాన్యతను తెలియజేస్తూ గ్రాంథిక భాషా వాదానికి తన అసమ్మతిని తెలియ జేస్తూ ఆంగ్లంలో రాశాడు. ఆంగ్లభాషలో ఉన్నందువల్ల పునర్ముద్రణకు నోచుకోలేక పోయింది. విశాలాంధ్ర ప్రచురణాలయం వారు 1968 లో పోరంకి దక్షిణామూర్తి గారిచే అనువదింపజేసి తెలుగులో ముద్రించారు. వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రులు గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకాన్ని ముద్రించి విస్తృత ప్రజాదరణ పొందుటకు కారకులయ్యారు.

**విమర్శాగ్రంథాలు:** వివిధ రకాల గ్రంథాలకు విమర్శా గ్రంథాలను విమర్శా పీఠకలను ముద్రించిన ఘనత వావిళ్ల వారికే దక్కుతుంది.

## కవిత

### జన్మదినం చెట్టుకు వర్ధంతి పూలు

స్ఫూర్తి
9490098694



**Wish you happy returns of the day**

జన్మదిన శుభాకాంక్షలు

జన్మదినమంటె కాలం పుస్తకంలో
వయసు సంతకాన్ని చేయడం

ఒకటితో మొదలు పెడితేనే
అంకెలకు విలువొస్తుంది
కాలంపై కాలు పెడితేనే
వయసుకు నడకొస్తుంది

జన్మదినాల పూలను
కాలం దారానికి అల్లితేనే
మనిషి జీవితం పూలదండై పరిమళిస్తుంది

తడబడేటి అడుగులల్లో
అమ్మనాన్నల చిటికెన వేలే
జన్మదినం నాడు బహుమతై
బాల్యాన్ని దాటిస్తుంది

బడిలో అక్షరాల్లో
మెరిసి మురిసి నప్పుడు
నేర్చుకున్న విజ్ఞానమంతా
కౌమార్యంలోని జన్మదినాల్లో
మనిషిని ఆకాశం చేస్తాయి
నక్షత్రాలను పూలై కురిపిస్తాయి
చెలి పరిమళమంతా పులుముకొని
ఒంటరితనం జంటై
ఒక ఇంటికి చిరునామానద్దీ
యవ్వనంలోని జన్నదినాలన్ని
జీవన సంద్రాన్ని దాటించే
తెర చాపలవుతాయి

జీవిత పుస్తకంలో
అనుభవాలే అక్షరాలై
వృద్దాప్య జన్మదినాలు
నూతన తరానికి పాఠమై బోధిస్తాయి
బతుకు సంగీతానికి సరిగమలవుతాయి

మనిషిని మరణం ముద్దాడినప్పుడు
జన్మదినాల సంఘబలంతో
మరణంపై మనిషి
వర్ధంతి తిరుగుబాటు జెండా నెగరేస్తాడు
మరణాన్ని పండుగ చేస్తాడు
కాలానికి సాక్షీభూతుడవుతాడు

---

వసుచరిత్రకు విమర్శా గ్రంథాన్ని రాసింది వజ్ఝల చిన సీతారామస్వామి శాస్త్రి చేత రాయించి ముద్రించారు. ఇది అత్యంత ప్రజాదరణ పొందింది. ఇలా మహాభారతానికి ప్రబంధ గ్రంథాలకు విమర్శా గ్రంథాలు రాయించి ముద్రించి పరిశోధకులకు అత్యంత ఆసక్తిని కలిగించారు.

వ్యాఖ్యలు-టీకలు: తెలుగు గ్రంథాలని చెప్పుకొంటున్నప్పటకీ పదజాలం సంస్కృత భూయిష్టంగా ఉండేది. దేశ్యపదాల కంటే తద్భవ పదాల ప్రయోగం తెలుగు పద్యాలలో కనిపించేది. తెలుగులో చెప్తే గాని తెలుగు వారికి అర్థం కాదు. అందుకని టీకలు, వ్యాఖ్యలు చేయిస్తే బాగుంటుందని ఒక మంచి సంకల్పానికి ఒడిగట్టి మహాభారతంలో కొన్ని పద్యాలకు, భాగవతానికి టీకలు రాయించారు. భాగవతాన్ని పాలపర్తి నాగేశ్వర శాస్త్రితో పాటు కొంత మంది విద్వాంసులు కలిసి విశేషార్థాలతో వ్యాఖ్యలు రాశారు. దీని వల్ల తెలుగు వారికి చదువుకోడానికి ఎంతో సౌలభ్యం చేకూరింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు, టీకలు అలభ్యం. తరువాత కొన్ని ముఖ్యమైన గ్రంథాలకు వ్యాఖ్యలు, టీకలు రాయించి ముద్రించారు.

ఇలా చెప్పుకొంటూ పోతే తెలుగు వాఙ్మయంలోని దేన్ని వదలకుండా పద్యకావ్యాలు, అచ్చతెలుగు కావ్యాలు ద్విపద కావ్యాలు, శతకాలు, వచన గ్రంథాలు, జీవిత చరిత్రలు, నవలలు, కథలు, నాటకాలు, ఛందో గ్రంథాలు, వీలైనంత వరకు తెలుగు పాఠకులకు అర్థమయ్యేలా ముద్రించారు. కొన్ని గ్రంథాలను అనువదించారు.

ముద్రణ పట్లవారికున్న ఏకాగ్రత, పాఠకుని ఆదరణ పొందడానికి వావిళ్ల వారు పడిన తపన గ్రంథం ఆద్యంతం అత్యంత ఆసక్తి గొలిపే విధంగా వుంది. ఈ గ్రంథం చదివిన తరువాత గ్రంథ ముద్రణ ఎంత సౌలభ్యంగా అందుబాటులోకి వచ్చిందో తెలుసుకోవచ్చు. చేతిలో చిల్లిగవ్వలేని సమయంలో అప్పుచేసి గ్రంథ ముద్రణకు సాహసించిన తీరు తెలుస్తుంది. ఈ ముద్రణాలయం ద్వారా ఎంతో మంది విద్వాంసులు అనువాదకులు బయటకు వచ్చారు. చాలా మందికి జీవన భృతి లభించింది. ముద్రణకు ఈ విద్యాంసుల కృషి, తెలుగు భాషోద్ధరణకు ఎలా నడుం బిగించారో ఈ పుస్తకం చక్కగా వివరిస్తుంది.

కథ

తమ్మెర రాధిక
9440626702



# తీరం దాటిన తుఫాను

***చ**ల్లటి సాయంకాలం పూట హఠాత్తుగా ఈదురు గాలులు వీచినట్టు, హోర్డింగులు విరిగిపడ్డట్టు ఇంటి లోపల్నించి మాటల కేకలు హోరెత్తించాయి. చెక్కగేటు తీసుకొని లోపలికి రాబోతున్న రామారావు ఆగిపోయాడొక్క క్షణం. తుఫాను వేగం అంచనా వేయడానికి!*

"అక్కడే ఆగిపోయారేం! వచ్చి మీ అమ్మ నిర్వాకం చూడండి. మా అమ్మ మా అమ్మ అని ఊరేగుతారుగా!"

ఉరమని పిడుగు కిటికీలోంచి దూసుకొచ్చి ఆయన మీద పడింది. విధిలేక సైకిల్ వాకిట్లోని నేరేడు చెట్టుకు ఆన్చి గాలి ధాటికి విరిగిపడ్డ కొమ్మలా లోపలికొచ్చాడు.

ముందుగదిలో తల్లి చాపమీద కూర్చుని వత్తులు చేసుకుంటూ కన్పించింది. 'వత్తులేగా ఆవిడ చేసేది అదెలా తప్పవుతుంది? వత్తులు చేసుకోవడం ఆవిడ జన్మహక్కు' ప్రేమగా తల్లి వైపు చూసాడు. రాహువు మింగిన చంద్రుళ్ళా కళతప్పి ఉందావిడ మొహం మటుకు. అత్తా కోడళ్ళన్నాక కీచులాటలు తప్పవు, ఆరళ్ళు తప్పవు అనుకున్నాడు.

"ఏంటా దిక్కుమాలిన చూపు? మీ అమ్మ ఏం చేసిందని అడగరేం?'' భార్య భద్రకాళి అరుపుకు దడుచుకొన్నాడు రామారావు. వెధవ ధాష్టీకం చేసే వాళ్ళంటే అతనికి మంట.

"హు... ఎక్కడికి పోతాయి బుద్ధులు...." అత్తగారి వైపు నిరసనగా చూస్తూ, భర్త చెయ్యందుకుని విసురుగా లోపలికి లాక్కెళ్ళింది.

'అరంజాతి ఆడది... అరంజాతని... నాఘటం వుండగానే వాణ్ణి ఇంత రొష్టు పెడుతోంది చూడు' భ్రమరాంబ ఉడుకుబోత్తనంగా పత్తిని పిసికేసింది.

లోపల గదిలో శ్యామల మంచంమీ్మద బోర్లా పడుకొనుంది.

"దీని బ్రతుకు బుగ్గిపాలు చేసింది మీ అమ్మ. వచ్చిన ప్రతీ సంబంధాన్ని ఇది ఎందుకు కాదంటోందో నాకర్థమై చావలా, ఇదిగో ఈ వుత్తరం చదవండి."

భద్రకాళి రౌద్రంతో ఊగిపోతూ జాకెట్లో దాచుకున్న ఉత్తరం తీసి రామారావు ముఖం మీదకు విసిరేసింది. ఆయన గుండెల్లో చలిపిడుగు పడింది. ఏం మునిగిపోయే రాతలున్నాయో దీన్లో! శ్యామల పేరుతో వుందా వుత్తరం. హతవిధీ! పిల్లలో అదీ ఇదీ అని చెప్పలేనంత ప్రతిభ వుంది. అదంతా ఈ వుత్తరం మూలకంగా బుగ్గయిపోదు కదా!

"చదవండీ!"

గబగబా కవరు విప్పాడు రామారావు. దాన్లో రెండు మూడు పంక్తులు మాత్రమే వున్నాయి. అవి చదివి దిమ్మ దిరిగి కుర్చీలో కూలబడిపోయాడు. భార్య కేసి చూసాడు.

మొహం నిప్పుల కుంపటిలా వుంది. ఎదుట వాళ్ళకు నచ్చేలాగున నాలుగు తీయని కబుర్లు చెప్పడం ఆమెకెప్పుడూ చేతకాదు. పచ్చి పసుపు కొమ్ము రంగులో వుండే భద్రకాళి కోపంలో ఎర్రగా కందిపోయింది. ఆమెని అనునయించాలని ప్రయత్నిస్తూ "చూడు భద్రం కాసిన్ని మంచినీళ్ళు పట్రా! ఉన్నపళంగా ఈ ఉత్తరం వుపద్రవం ఏంటో అర్థం కాదు... కాస్త స్థిమితపడీ...."

ఆ మాట ఆవిడ వినిపించుకోలేదు. తన హంగామాకు భర్త దగ్గర్నించి సరిఐన సమాధానం లభించలేదని ఆగ్రహించింది. విసురుగా వెళ్ళిపోయిందక్కడ్నించి.



తన తల్లి ఎందుకిలా చేసిందా అని రామారావు మెదడు ఆలోచన్లో పడింది. మిణుగురులతో జ్యోతిని వెలిగించలేనట్లే తల్లి ఆలోచనలేంటో ఒక పట్టాన అంతుపట్టవు. అసలు ఈ అస్థిమితమంతా ఇంట్లో చెలరేగడానికి అందరూ కారణమేనేమో!

శ్యామల తమ రెండవ కూతురు. కాలేజీ చదువు అయిపోయి ఈ మధ్యనే నారాయణస్వామి కాలేజీలో లెక్చరర్‌గా చేరింది. పెళ్ళి చేసి పంపేస్తే బాధ్యత తీరుతుందని భద్రకాళి రోజూ పోరుతుంటే తెలిసిన బంధువులందరికీ చెప్పుంచాడు మంచి పెళ్ళికొడుకును చూడమని.

పెద్దమ్మాయి దివ్యా, కొడుకు రాహుల్ తమకు తెలిసిన సంబంధాలను తీసుకొస్తే భ్రమరాంబ ఎన్నో వంకలు అభ్యంతరాలు చెప్పి తిరగ్గొట్టేసింది. రామారావుకే దోవా కనిపించక నీరసించిపోయాడు. అయిన వాళ్ళ దగ్గర మొహమాటాలు చెడకుండా పని జరగాలని భద్రకాళి నేర్పుగా మసులకోవాలనుకుంది, అత్తగారి ప్రవర్తన చూసాక కుందేలుకు నాలుగో కాలు మొలిపించలేకపోయాం అని గింజుకుని ఆవిడకు ఎదురు తిరగడం మొదలు పెట్టింది. బొంబాయి నించి ఉత్తరం వచ్చాక తన ఓపికకు పరీక్ష పెట్టడం మంచిది కాదని ఆవిడకు వార్నింగ్ ఇచ్చింది.

"అదేంటి బామ్మా మా బంధువుల సంబంధాలు నిక్కచ్చిగా వద్దనేస్తున్నావ్? సంబంధాలు బాగాలేవు అని నువ్వు చెప్పే ముక్కలో అర్థం వుందీ? అయినా నీ యిష్టం ఎవరికీ శ్యామలకు నచ్చుతే సరి." దివ్య ఒక సంబంధం తెస్తూ భ్రమరాంబ మాటలు కొట్టి పారేయ్యబోయిందో సారి.

"శ్యామల మహార్జాతకురాలే. దాన్ని చేసుకోవడానికి ఎక్కడో అక్కడ దాని మొగుడు పుట్టే వుంటాడు. రేపీపాటికి పుంజాలు తెంపుకు రాడు దానికోసం." గుండు మీద సైను పంచ సరిచేసుకుంటూ కొడుకువైపు చూసింది.

అవునవునంటూ చిరునవ్వుతో తలపంకించాడు ఆనాడు.

అలాంటి అమ్మ, ఇప్పుడు ఇప్పుడు.... ఆలోచనలు సుళ్ళు తిరుగుతుండగానే ఫోన్ మ్రోగుతుంటే వెళ్ళి తీసాడు రామారావు.

"నాన్నా... అసలు మనింట్లో ఏం జరుగుతోంది? బామ్మ అమ్మని తిప్పలు పెట్టడానికే కంకణం కట్టుకున్నట్టు కనపడుతోంది. శ్యామల పెళ్ళి గురించి మీరెవరూ పట్టించుకోరా? వచ్చిన సంబంధమల్లా వంకలు పెట్టి వదులుకుంటే రేపెవరు దాన్ని చేసుకోవడానికి ముందుకొస్తారూ! అమ్మ మాట కూడా పట్టించుకోండి మరి ఆమెకూ బాగూ ఓగూ తెలుసుకదా! ఎవరో అతను బొంబాయి నించి ఉత్తరం రాసాట్ట, ఏవిటో పిచ్చికూతలు. చెల్లాయికి మటుకు ప్రత్యేకంగా ఫోను చేసాట్ట పెళ్ళికి అనుకూలమని. ఏమిటీ అప్రతిష్ట అని దాన్ని తిడితే అంతా బామ్మకు తెలుసులేవే అంటోంది చెల్లాయి. అందర్నీ కూర్చోబెట్టి కనుక్కోండి వివరాలన్నీ. " ముక్క చీవాట్లు వేసి ఫోన్ పెట్టేసింది దివ్య.

ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ వంట గదిలోకి వెళ్ళి మంచినీళ్ళు త్రాగాడు.

భద్రకాళి కోపంగా వంట చేసుకుంటోంది మధ్య మధ్య ఖర్మ! ప్రారబ్ధం లాంటి శబ్ధాలు చేస్తూ. ఇహ లాభం లేదని ముందు గదిలోకి వచ్చాడు. తల్లి చేస్తున్న పనిలో ఏ మాత్రం మార్పు లేదు. మట్టసంగా కూర్చొని వత్తులు చేస్తోంది. ఆవిడ్ని గట్టిగా దబాయించి అసలు సంగతి రాబడుదాం అన్న భార్య చర్యలు అతనికి చిరాకు పుట్టిస్తున్నాయి. అమ్మా, అత్తగారూ అన్న మంచీ మర్యాదా పెట్టుకు కూర్చొంటే ఈ సమస్య తెమిలేదేనా అని భద్రకాళికి ఉడుకుబోత్తనంగా వుంది.

"అమ్మా బొంబాయి నించి వచ్చిన ఆ ఉత్తరమేంటీ అలా రాసాడా అబ్బాయి! ఎవరసలతను? నీ కోడలు చూసావా ఎంత కోపంగా ఉందో? ఇంట్లో ఏంటీ గలాటా! ఇప్పుడే దివ్య కూడా ఫోన్ చేసి ఏంటేంటో మాట్లాడుతోంది నా కళ్ళముందు బొడ్డూడని పిల్లది. ... మీ ఇద్దరిలో ఎవరికి పుట్టిన బుద్ధిదీ?"

కోపంగా అడగబోయి నిస్ప్రుహగా నిట్టూర్చాడు.

"బాగుంది నాయనా. దానికి మంతి చెడి వుంది అందుకని వాకిట్లోకి వచ్చావో లేదో తుఫానులా విరుచుకుపడిందిగా! దాన్నే అడగలేక పోయావ్? నీ పెళ్ళాన్ని, " నిరసనగా మూతి విరిచింది భ్రమరాంబ.

"మాటలు తిన్నగా రానీండి.... మీరు చేసిన వెధవ పన్లు సమర్ధించుకో వద్దు పై మిక్కిలి కావాలని బుకాయిస్తే ఏం చేస్తాం".

"ఏమిటే మాటలు మీరుతున్నావ్? ఏ బెల్లం నీళ్ళో చల్లి

వాణ్ణి ఆకట్టుకున్నట్టునుకున్నావా? పెళ్ళంటే!"

"నేనాట్టే మంచిదాన్ని కాదు, మాటలు జాగర్త." చేతిలో పోపు గరిటె గదలా తిప్పుతూ హుంకరించింది భద్రకాళి.

"భద్రం అమ్మని నేనడుగుతూనే వున్నా కదా... ఊర్కే ఇద్దరి కిద్దరూ చెలరేగి పోతున్నారు. సమస్య ఎక్కడ మొదలు అయ్యిందో కనుక్కోవాలి గానీ బుద్ధిపూర్వకంగా మీరు కొట్టుకుంటుంటే ఎలా? పిల్లని చూడండి మొదలు తిండీ తిప్పలు లేక మూలపడుతుందేమో!" విసుగ్గా మొహం పెట్టాడు రామారావు.

అతని విసుగుని లెక్క చేయ్యకుండా

"చాటు మాటుగా ఏం భోధ పోస్తుందో మీకని ఆవిడ్ని ఓ కంట కనిపెడుతూనే వున్నా... మరియాదగా ఆ ఉత్తరం సంగతి తేల్చండి."



భర్తకు హుకుం జారీ చేసి మరీ నడుం మీద చేతులుంచుకుని అత్తగారి వైపు తీవ్రంగా చూసింది.

"నీకే కాదు నాకూ వచ్చు మాటలు, తిన్నగా వుండు... ఓ రెచ్చిపోతున్నావు ఏం చూసుకునీ?" ఈసడింపుగా అంది భ్రమరాంబ.

"అవును మరీ... మీ యింటి వైభోగం చూసుకునే మురిసిపోతున్నా..... ఇంతోట జమిందారీ కుటుంబాలు కదూ.... వెధవ కొంపలో పడ్డాను... ఓ మంచి లేదూ మర్యాద లేదు." భద్రకాళి చీదరించింది.

"నోటికొచ్చినట్టు పేలవాకు... నాలుక చీరేస్తా ఏవనుకున్నావో... అత్తగారనీ చూడవా"? రామారావు కరుగ్గా అరిచాడు.

"అబ్బో..... అమ్మ..." చేతులు తిప్పుతూ –

"అమ్మయితే మీ నెత్తినెందుకు నీళ్ళు దిమ్మరిస్తుంది... అమ్మంట అమ్మ...." విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

"ఏంటమ్మా ఇదీ... ఇంటిని నరకం చేయ్యడమే పనిగా పెట్టుకున్నారా మీరంతా కలిసి? అసలా ఉత్తరంలో మాటలకు అర్థాలేంటి?"

రామారావు నిస్సహాయంగా అడిగాడు.

కొడుకు బాధ చూసాక హృదయం ద్రవించింది భ్రమరాంబకు. సంసారం గుట్టు వ్యాధి రట్టూ అన్నారు. ఎందుకొచ్చిన అవస్థ జరిగిందంతా చెప్పేస్తే పోలా!

"ఒరే సన్యాసీ.... శ్యామలకు మొన్నామధ్యనో సంబంధం వచ్చింది. వచ్చిన వాళ్ళేమన్నారో గుర్తుందా?" ఆరా తీసింది కొడుకు జ్ఞాపకశక్తి పరీక్షిస్తూ.

"ఏమడిగారూ?" ఆలోచనలో పడ్డాడు రామారావు.

"కంగారు పడకు అంతా సరిచేస్తాను. సవ్యంగానే వెళ్ళ మారిపోతుంది తంతు. మొన్న వచ్చిన పెళ్ళివాళ్ళు ఏమడిగారంటే కాబోయే కోడలు తప్పని సరిగా ఉద్యోగం చేయ్యాలనీ, ఆ ఉద్యోగం కూడా తాను పని చేసే బాంబే కంపెనీలోనే ఇప్పిస్తాననీ పెళ్ళికొడుకు అన్నాడు. బాంబే అనగానే నాకు మన శాంతమ్మ వాళ్ళు గుర్తొచ్చి, శాంతమ్మ వాళ్ళాయన పెట్టిన కంపెనీ తెల్సా అని అడిగాను. దాంతో వాళ్ళు మొహాలు మొహాలు చూసుకుని నవ్వారు. తమ అబ్బాయి పంజేసిన ఆ కంపెనీలోనే అని చెప్పారు వాళ్ళు. దాంతో ఆ కంపెనీ పెట్టిన వాళ్ళు మా బంధువులే అని చెప్పానురా." అంది భ్రమరాంబ.

శాంతమ్మ ఎవరో చప్పున గుర్తుకు రాలేదు రామారావుకు. ఆవెకూ, ఈ ఉత్తరానికీ ఏంటీ సంబంధం అని రెట్టించాడు తల్లిని. ఆవిడ మళ్ళా నవ్వింది.

"ఆ పెళ్ళి సంబంధం వాళ్ళ దగ్గర మన శాంతమ్మ నంబర్ తీసుకున్నాను. ఇంతకీ ఆ శాంతమ్మ ఏవరనుకున్నావూ! మా పెద్ద మావగారి మనవరాలు, అంటే మీ పెదనాయన గారి కూతురు నీకు అక్క అవుతుంది. మీ చిన్న తనంలోనే ఆవిడ పెళ్ళి చేసుకుని బొంబాయి వెళ్ళిపోయింది. మీ నాన్నగారి ఉద్యోగ రీత్యా మనం ఆ వూరు ఈ వూరు తిరగడం మూలాన కాస్త ఆవిడతో మీ అందరికీ పరిచయాలు తక్కువే. నాకు తెలిసి శాంతమ్మకు ముగ్గురు కొడుకులని వినికిడి. నంబరు తీసుకున్నాగా నేనే డైరెక్టుగా అక్కకు ఫోన్ చేసాను. ఎంత సంతోష పడిందనుకున్నావూ! అబ్బో... అబ్బో... ఫోన్లోనే కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యిందనుకో..."

వింటున్న రామారావు విసుగ్గా మొహం పెట్టాడు శాంతక్క మొహం గుర్తుకు రాక.

"శాంతక్క ఇద్దరు కొడుకులకు పెళ్ళిళ్ళు అయ్యాయిట. ఆఖరబ్బాయి పెళ్ళికి వున్నాట్ట. మనవాళ్ళు ఎవరన్నా వుంటే చూడమంది. తను బొంబాయి వచ్చాక చాలా వరకు బంధువులందరితో రాకపోకా లేకుండా వుందిట. ఆఖరి వాడికి మనలోని పిల్లని చూస్తే మళ్ళీ బంధుత్వాలు కలుస్తాయని ఆశపడిందిరా పాపం".

"నిజమే అమ్మా... నువ్వు చెప్పే కథకూ.. ఆ ఉత్తరానికీ ఎక్కడా లంకె కుదరడం లేదు కదే!" ఆశ్చర్యంగా అడిగాడు తల్లిని.

"అక్కడికే వస్తున్నా... నేను ఆమాటా ఈ మాటా చెప్పి వాళ్ళబ్బాయికి ఇక్కడ మంచి సంబంధం వుందని చెప్పాను. దాంతో ఫోటో పంపివ్వమంది. మన శ్యామల ఫోటో పంపించాను దాన్నడిగి. శాంతకు చెప్పలేదు శ్యామల నా మనవరాలని. శ్యామలకూ చెప్పాను అప్పుడే ఇంట్లో చెప్పొదనీ. తన కొడుకు ఫోటో పంపింది శాంత. తల్లీ కొడుకులకు ఏ మాత్రం అనుమానం రాకుండా వ్యవహారం నడిపాను కానీ దాని కొడుకు దగ్గర శ్యామల ఫొటో చూసి పెళ్ళి చూపులకు వచ్చినబ్బాయి ఆశ్చర్యపోయి తామంతా ఈ అమ్మాయిని చూడ్డానికి పోతే మీ గురించి అడిగారు వాళ్ళు మేమే నంబరు ఇచ్చాం అని చెప్పాట్ట. దాంతో శాంత కొడుకు నాకు ఫోన్ చేసి వివరాలు అడుగుతే మనమంతా బంధువులం అనీ, నేను శాంతకు ఏమవుతానో చెప్పాను. శ్యామల తన మేనగోడలని తెల్సి ఎంతో సంతోషపడింది శాంత."



"మరా వెధవ వుత్తరం ఎందుకు రాసాట్టా!!" మళ్ళీ రంగంలోకి వచ్చింది భద్రకాళి.

అత్తగారు తమను బురిడీ కొట్టించాలని చూస్తోందని ఆమె అనుమానం.

"ఓసి నీ అనుమానం దొంగల్దోలా.... ఓరే రావుడూ నువ్వూ చదివావుగా ఆ వుత్తరం! ఏం వుందిరా ఆ వుత్తరంలో! శ్యామలని ఉద్దేశించి రెండు మాటలకు తిరుగు జవాబని నా వుద్దేశం. ఏ వన్నాడూ మీ అమ్మా నాన్నా లేచిపోయి పెద్దలకు చెప్పకుండా పెళ్ళి చేసుకున్న వాళ్ళయినట్లయితేనే మా అమ్మని సంప్రదించమనండి... అప్పుడే మన పెళ్ళి అవుతుంది అనేగా వుందీ? ఆ వుత్తరం పోస్టువాడు సరాసరి నీ కివ్వబట్టేగా అంతరాద్ధాంతం చేస్తున్నావు? ఉత్తరం పత్తరం లేకపోతే పిల్ల పెళ్ళి కుదిర్చానని నను అంబరాన్ని ఎక్కంచక పోదువా?"

అత్తగారి మాటలకు భద్రకాళి వెక్కిరింతగా చేతులు తిప్పింది.

''అబ్బో... ఇంతోటి సంబడాలకు అంబరానికి ఎగరడాలూనూ.... వంశం వంశం అంటుంటారుగా... లేచిపోయిన వాళ్ళ సంబంధాలు కావాలంటే అట్టాంటి వాళ్ళ దగ్గరికే వెళ్ళాలి. అంతే గానీ నా పిల్లను ఇలా అడ్డమయిన రాతలు రాసేవాడికివ్వను. అయినా ఇంత కథ నాకు తెలియకుండా ఎలా నడిపిందో చూసారా మీ అమ్మ." ఎకసెక్కంగా అంది.

రామారావు భార్యని వారించేలోపే భ్రమరాంమ అందుకుంది.

"అసలా వుత్తరంలో నాకే తప్పు కనపడలేదురా అబ్బాయ్! శాంతమ్మ నన్ను అనాల్సిన మాట దాని కొడుకు పరోక్షంగా అన్నాడేమో అనిపిస్తోందిరా. నేను కాపరానికి వచ్చిన కొత్తలో శాంత వివాహం ఇంట్లో పెద్ద వాళ్ళకు ఇష్టం లేకుండా జరిగింది. కులాంతర వివాహం చేసుకుని బొంబాయి వెళ్ళిపోయింది. అందరూ అది చచ్చిందా బ్రతికిందా అని ఎప్పుడూ పట్టించుకోలేదు. ఇన్నాళ్ళకు మళ్ళీ మనకు పెళ్ళి చూపులకు వచ్చిన వాళ్ళ ద్వారా తారసపడింది. అసలు శాంత పెళ్ళి చేసుకొని బొంబాయి వెళ్ళిపోయే ముందు బాబాయిలందరి దగ్గరికి ఆశీర్వాదం కోసం వచ్చినప్పుడు.

'మళ్ళీ నీ లాగే లేచిపోయిన వాళ్ళెవళ్ళయినా దొరికినప్పుడే నీ పిల్లల పెళ్ళిళ్ళు చెయ్యమ్మా' అని చెప్పాను నేను.

ఆ మాట అదింకా మర్చిపోనట్టుంది."

భ్రమరాంబ మాటలకు భద్రకాళి రామారావు యిద్దరూ మాటలు రానట్టు మొహాలు చూసుకున్నారు.

"ఆ మాట ఆనాడు ఎంతో ఈసడింపుగా అన్నాను. అది మర్చిపోయి వాళ్ళు పెద్ద కంపెనీ నడుపుతున్నారన్న ఆశతో మిమ్మల్ని ఎవర్నీ సంప్రదించకుండానే ఇదంతా చేసాను. మరి వాళ్ళ ఆలోచన అలా వుంటే ఏం చేస్తాం?"

తల్లి మొహంలో బాధ చూసాక మరేం మాట్లాడలేకపోయాడు రామారావు.

ఎప్పుడు గదిలోంచి లేచి వచ్చిందో శ్యామలతండ్రి దగ్గరికి వచ్చి సెల్లు అందించింది. ఏంటని అతను అడుగుతుంటే మాట్లాడ మని సైగ చేసింది శ్యామల.

"హల్లో!" అన్నాడు రామారావు.

"సారీ రా తమ్ముడూ... నా కొడుకు రాసిన ఉత్తరం నేను బాధ పడ్డానని అది మీ అందరికీ తెలియాలని మాత్రమే రాసాడు. జరిగిందానికి నేనూ, వాడూ సారి చెబుతున్నాం. శ్యామల ప్రస్తుతం మీ యింట్లో జరుగుతున్నదంతా ఫోన్లో వినిపించేట్టు ఆన్ చేసి పెట్టింది. వింటుంటే బాధని పించి చేస్తున్నాను. శ్యామలని మా యింటికి ఇవ్వడం మీ కందరికీ ఇష్టమైతే ముహుర్తాలు పెట్టిస్తావని ఆశిస్తాను."

శాంత అవతల ఫోన్ కట్ చేసినా ఇవతల రామారావు నోరు తెరుచుకుని చూస్తుండిపోయాడు తుఫాను దిశ మార్చుకుందని తెలిసి!!

## కవిత

### అక్షర మథనం

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

మనిషి నడుస్తున్నాడు
కరెన్సీ నడకను కొలుస్తుంది
అద్దంలో ప్రతిబింబం చూస్తున్నాడు
మహాత్ముని బోసినవ్వుల నోటు కనబడుతూంది
ఉపన్యాసం సాగుతూ వుంది
మాట తులాభారం తూగుతుంది!
భూ భ్రమణం మారింది
అంటుకు తిరగాల్సిన రెండు హృదయాలు
విడిపడి పోతున్నాయి
హాయిగా ఎగరాల్సిన జంట పక్షులు
వేటగాడి గురికి రాలుతున్నాయి!
అనుబంధం
రక్త సంబంధం
ఆర్థిక లావాదేవీల్లో ముడిపడ్డాయి
అక్షరం ఆర్థికమైంది
చరచిరాస్తుల సంపాదనలో మునుగుతూంది!
అక్షరానికి సానపెట్టాల్సిన గురువులు
భోషాణంలో దాస్తున్నారు
మట్టిని ముద్దాడిన అక్షరాలు



విద్వేషాలై
ప్రాంతీయాలై
అసత్యాలై
విరాజిల్లుతున్నాయి
కరెన్సీ పల్లకీల్లో వూరేగుతున్నాయి
అందరూ వేటగాళ్ళే
ఆహరం కోసం
అక్షరం పై మాటు వేసిన వాళ్ళే
అక్షరం కోశాగారమైంది!
ఇప్పుడు అక్షరం సొగసు
చూడడమే విద్య
ఇది అక్షర క్షేత్రం చూడని విద్య
ఇది అక్షర జననం తెలియని విద్య
ఇది అక్షర ప్రక్రియ తెలియని విద్య
అక్షరానిది అంతా బహిర్గతం
మనిషిది అందని అంతర్గతం!

---

### అంతరాలు

- గడీల సుధాకర్ రెడ్డి
9948936488

చందాలేసుకొని
శవదహనాలొకవైపు
శతకోటీశ్వరులై
ప్రపంచ కుబేరుల
సరసన ఒకవైపు
కూటికి లేక
కాటికి కాల్జాపడమొకవైపు
తిన్నకూడరగక
పరుగులు దీయడం ఒక వైపు
అక్షరధ్యాసలేని
అమాయక జనమొక వైపు
ఎల్ కె జి కే
లక్షలు గుమ్మరించేటోళ్ళొకవైపు
నింగిని చీల్చుకొని ఎగబాకే
నివాస గృహాలొకవైపు
నిత్యం మురికివాడల్లో
వీధుల్లో నివసించే వారొకవైపు

కూసుండి మేస్తే
అరగని వాడికి
పంచభక్ష్య పరమాన్నాలు
ఆహరహరం కృషి జేస్తున్నా
అన్నదాతకు
అన్నం మెతుకే కరువు
రోడ్ల విస్తరణలో
కార్లల్లో
మందిని ముంచిన నయాసంపన్నుల షికార్లు
కనీసం కాలినడకకు
దారి మిగలక
గరీబుల బేజార్లు
అయినా అభివృద్ధి పాటతో
మేకవన్నెపులులు
అవినీతి బాటకై



8 లైన్ రోడ్ వేగిరపరుస్తూనే ఉండ్రు
వానికి గెలుపు ముఖ్యం
గెలిచినంక అడ్డం నిలువు
బలుపు ముఖ్యం
అందుకే
ఎప్పుడు దొరకనోడు
ఎలచ్చన్ల ముందర
బహురూపుల వేషగాడై
వచ్చినప్పుడు
ముఖం మీద కాండ్రించి ఉమ్మి
వాడు మేకవన్నెపులై
వచ్చినప్పుడు
మీరు గొర్రెల్లా వానితో
మమేకం కాకుండ్రి
పొట్టేలు వై కొమ్ములతో
కుమ్మి కుమ్మి పొడిచి
చంపండి....
రేపటి మీ బాలల భవిష్యత్ కై.....
ఉజ్వల భారత్ కై....



# వి.ఆర్.రాసాని కథల్లో జీవవైవిధ్యం

- కోలా శేఖర్
9441441097

***రాసాని తన రచనల ద్వారా రాయలసీమ ప్రజల ఆకాంక్షల్ని, ఆవేదనల్ని, కష్టాలను, వివిధ కులాల సంస్కృతీ సాంప్రదాయాల్ని అంతకుమించి దళిత బహుజన గిరిజన జీవితాల్లోని చీకటి కోణాలను ఆవిష్కరిస్తున్న రచయిత. రాయలసీమ ఆత్మ ఆతని కథల్లో ప్రతిబింబిస్తుంది.***

అన్ని ప్రక్రియల్ని అలవోకగా రాసిన అరుదయిన వారిలో డా॥ వి.ఆర్.రాసాని కూడా ఒకరు. ఆయన కథలు రాశారు. నవలలు రాశారు. కవిత్వమూ, కాలమ్ రచనలూ, నాటికలూ రాశారు. అలాగే మంచి విమర్శనా వ్యాసాలు రాశారు. అంతకు మించి మంచి నటుడు. నాటక ప్రయోక్త. రాసాని తన రచనల ద్వారా రాయలసీమ ప్రజల ఆకాంక్షల్ని, ఆవేదనల్ని, కష్టాలను, వివిధ కులాల సంస్కృతీ సాంప్రదాయాల్ని అంతకుమించి దళిత బహుజన గిరిజన జీవితాల్లోని చీకటి కోణాలను ఆవిష్కరిస్తున్న రచయిత. రాయలసీమ ఆత్మ ఆతని కథల్లో ప్రతిబింబిస్తుంది.

మెరవణి, పయనం, మావూరి కతలు వంటి కథా సంపుటాలు, చీకటిరాజ్యం, మట్టి బతుకులు, చీకటి ముడులు, ముద్ర, బతుకాట, వలస, పరస, ఏడో గ్రహం వంటి నవలల్ని, కాటమరాజు యుద్ధం, తరిగొండ వెంగమాంబ, చెంచునాటకం, అజ్ఞాతం వంటి నాటకాలను, దృష్టి, జలజూదం, నేలతీపి, మనిషి పారిపోయాడు, స్వర్గానికి ఇంటర్వ్యూ వంటి నాటికలను ముద్రించారు. ఆంధ్రప్రభ వారపత్రికలో ఇది తిరుపతి, ఆంధ్రభూమి దినపత్రికలో మా వూరి కతలు, కామధేనులో రాయలసీమ నటరత్నాలు, కళాదీపిక పక్షపత్రికలో లోకూలు అన్న పేర్లతో కాలమ్ రచనలు చేశారు. రాయలసీమ వేడుక పాటలు, జానపద గేయాలలో పురాణాలు, పనిపాటలు వంటి విమర్శనా గ్రంథాలను మరెన్నో విమర్శనా వ్యాసాలను రాశారు.

వీరి రచనల్లో సాంస్కృతికాంశాలు, తాత్త్విక అంశాలతోబాటుగా విస్తృతమైన జీవవైవిధ్యం కూడా కనిపిస్తుంది. తాను చూసిన అనేక జంతుజాలాన్ని, పశుపక్ష్యాదులను, క్రిమికీటకాలను ఎన్నింటినో సందర్భానుసారంగా తన రచనల్లో చిత్రించారు. అలా రాసాని ప్రస్తావించిన జీవవైవిధ్యాన్ని (1) రాసాని కథల్లో జీవవైవిధ్యం, (2) రాసాని నవలల్లో జీవవైవిధ్యం (3) రాసాని నాటకాల్లో జీవవైవిధ్యం, (4) రాసాని కవితల్లో జీవవైవిధ్యం అని వర్గీకరించుకొని పరిశీలించవచ్చు.

రాసాని కథల్లో జీవవైవిధ్యం : రాసాని కథల్లో పశువులు, గొర్రెలు, మేకలు, నక్కలు, తోడేళ్ళు, ఉడతలు, ముంగిసలు, ఎంటవులు, తాబేళ్ళు, ఎలుగ్గొడ్లు, గుర్రాలు, పాములు, ఎలుకలు, ఇసుళ్ళు, పట్టుపురుగులు, బల్లులు, రేసుకుక్కలు వంటివెన్నో ప్రస్తావించబడ్డాయి.

పాలగొడ్డు కథలో వ్యవసాయంకోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు చనిపోతే, ఆతని భార్య వెంకటమ్మ లోన్లో ఒక పాలగొడ్డును కొనుక్కుంటుంది. ఆ ఆవు యిచ్చే అరకొర పాలతో జీవనం గడవక కసాయివాళ్ళకు దాన్ని అయిష్టంగానే అమ్ముకోవడం కనిపిస్తుంది. బుసీఫెలస్ నువ్వు అనాథవు కావు అన్న కథలో మహబూబ్ బాషా అనే ముస్లిం తన కుటుంబ పోషణకు ఆధారంగా నిలచిన గుర్రబ్బండిని లాగే గుర్రం ముసలిదై పోతే దాన్ని అతని కొడుకు నిరాదరించి, మరణావస్థకు చేరుస్తాడు. ప్రసిద్ధమైన మరో కథ 'పయనం'లో అడవిలో నీళ్ళున్నచోట గుడారాలేసుకొని జీవించే నక్కలోళ్ళ నక్కలవేట, తోడేళ్ళ వేట గురించి చెప్పబడింది. అందులోనే గంగజ్జ అన్న గిరిజనుడు ఉడుతల్ని, గుడ్లగూబల్ని వేటాడుతాడు. అందులోనే ముంగిసల్ని, ఎంటవల్ని,

పిచ్చుగుంట్లోళ్ళు కాకుల్ని వేటాడే విధానం కూడా ప్రస్తావించబడింది.

'విషప్పురుగు' కథలో చిత్తూరు జిల్లాలో విస్తృతంగా సాగే స్మగ్లింగ్‌లో ఎర్రచందనాల తర్వాత నక్షత్ర తాబేళ్ళు, పూడుబాములు ఎలా ప్రధాన వనరుగా మారాయో చెప్పబడింది.

'వేమన్న గుర్రం' కథలో అనంతపురం జిల్లానుంచీ వేమన్న వేషం వేసుకుని గుర్రాలపైన వచ్చే రెడ్ల గురించి చెప్పబడింది. వేమన్న యాత్రచేసే వ్యక్తి గుర్రం చేత ఎన్ని ఫీట్లు చేయిస్తాడో ఈ కథలో వుంది. 'గాలిచెట్టు' కథలో మునిదేవర దగ్గర చిన్న బిడ్డకు పుట్టెంటికలు తీసే సమయంలో బలియిచ్చే మేకపిల్ల కనిపిస్తుంది. 'నేలరాలిన వసంతం'లో తిమ్మిగాడు మేపే గొర్రెల మందను, ఆతని కళ్ళు పోవడానికి కారణమైన కోకిలను, కోకిల గానాన్ని వర్ణించడం జరిగింది. కుబుసాలు' కథలో రైతు గంగిరెడ్డి పెంచిన పట్టుపురుగుల్ని తిన్న నాగుబామును యానాదివాడు ఎలా పడతాడో చెప్పబడింది. అలాగే 'వేట' కథలో ఈగను వేటాడే బల్లిని ప్రతీకాత్మకంగా చిత్రించడం జరిగింది. అందులోనే పుట్టల్లో పుట్టకూడు రూపంలో వున్న ఇసుళ్ళ గుడ్లు, వర్షానికి తడిసి, ఇడిగి ఇసుళ్ళుగా మారితే వెంకటస్వామి అనే ఒక ఇర్లోడి చేత పట్టబడి, ఎలా ఆహారంగా మారుతాయన్న విషయం చెప్పబడింది. 'నాలుగో నాటకం' కథలో ఒక గిరిజనుడి చేత పెంచబడి, పల్లెల్లో ఫీట్లు చేసే ఎలుగుబంటి ఒక ప్రధాన పాత్ర. 'చెప్పు తినెడి కుక్క'లో పరిశోధనలో భాగంగా ఒక పరిశోధనా విద్యార్థి క్షేత్రకార్యం కోసం ఓ పల్లెకు వెళ్ళినప్పుడు ఆతని కొత్త చెప్పుల్ని పోటీపడి తినే కుక్కలు, 'దయ్యం చెట్టు' కథలో మేకలమంద, 'సాలెగూడు'లో ఇంటిముందర కంపచెట్టుకు అల్లిన సాలీడు, 'మావూరికతల్లో'ని 'నొగలమింద కూసున్నాడా నల్లనయ్యే గదా'లో ఎద్దుల బండిని లాగే సేద్యపుగొడ్లు, 'కోళ్ళ దొంగ', 'కాన్పుల కట్టె', 'విషప్పురుగు' కథల్లో కోడిపుంజులు దర్శనమిస్తాయి. అలాగే 'అద్భుత వీరుడు – అతిలోక బుర్ర' అన్న పిల్లల కథలో పిల్లవాడు అడవికి తోలుకెళ్ళిన గొర్రెలమందపైన బడ్డ రేసుకుక్కల గుంపును, నక్కల గుండునెక్కి కూర్చున్న పిల్లవాడికోసం ఎగబ్రాకే పులులు, ఎలుగ్గొడ్లు, ఆతనికి టింగుబుర్రనిచ్చి రక్షించిన వనదేవత కనిపిస్తాయి. 'నామాల సాయిబు' అన్న కథలో తిరుమల కొండన కనిపించే కోతుల్లాంటి గండంగుల్ని ప్రస్తావిస్తాడు.



డా. వి.ఆర్.రాసాని

వలస నవలలో చిత్తూరు ప్రాంతం నుంచి భద్రావతికి వలసవెళ్ళిన రైతులు మేపే ఎనుముల్ని, పంటపొలాలపైన జరిగే ఏనుగుల దాడిని, మేకపిల్లని మింగిన కొండచిలువని, ఇంకా రకరకాల చేపల వేటను, అడవిలో తిరుగాడే పులిని, మనిషిని కరచిన పందిని వర్ణించడం జరిగింది.

రాసాని నవలల్లో జీవవైవిధ్యం : కథల్లో వలె రాసాని రాసిన నవలల్లోను జీవవైవిధ్యం సందర్భానుసారం చెప్పబడింది.

'చీకటిరాజ్యం' నవలలో గొర్రెలు, మేకలు మేపడమే కులవృత్తిగా కలిగిన కురబల జీవనవిధానం, అణచివేత, భూస్వాముల దోపిడీ వాటికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన పల్లె యువకుల కథ వుంది. ఈ కురబలకు గల గొర్రెలమందలు, వాటిలోని రకాలు, వాటికి వచ్చే వ్యాధులు, వాటికి వేసే మందులు చిత్రించడం జరిగింది.

అలాగే 'మట్టిబతుకులు' నవలలో పందుల్ని మేపడమే వృత్తిగా కలిగిన వడ్డిబోయల గురించిన కథవుంది. ఈ నవలలో పందులు, వాటిని మేపే విధానం, వాటితో వచ్చే అగచాట్లు చిత్రితమైవుంది. అంతేగాకుండా వడ్డివాళ్ళు ఎలుకల బొరియలకు ఊదర పెట్టి ఎలుకల్ని వేటాడే విధానం కూడా చెప్పబడింది. వాళ్ళకవి ఆహారంగా ఉపయుక్తమయిన విషయం లోకానికి కొత్త విషయాన్నందించినట్లయింది.

'చీకటిముడులు' నవలలోను, పరస నవలలోను పశువుల గురించి చెప్పబడింది. చీకటి ముడులలో రెడ్డి గారింట్లో ఎలా పశువుల్ని మేపిందీ, ఒక ఆవు మనుషుల్ని ఎలా పొడిచి హింసించిందో చక్కగా వ్రాయబడింది. అలాగే 'పరస' నవలలో గంగిరెద్దుల ప్రదర్శనలను, పల్లెజనం చేత పూజలందుకునే దేవరెద్దుల్ని, పశువుల సంతల్ని, ఆ పశువుల్లో వుండే జాతుల్ని, రకాలను వివరంగా చర్చించడం జరిగింది. అలాగే వలస నవలలో చిత్తూరు ప్రాంతం నుంచి భద్రావతికి వలసవెళ్ళిన రైతులు మేపే ఎనుముల్ని, పంటపొలాలపైన జరిగే ఏనుగుల దాడిని, మేకపిల్లని మింగిన కొండచిలువని, ఇంకా రకరకాల చేపల వేటను, అడవిలో తిరుగాడే పులిని, మనిషిని కరచిన పందిని వర్ణించడం జరిగింది. ఏడో గ్రహంలోని శనీశ్వరుడి వర్ణన సందర్భంగా గబ్బిలం, గ్రుడ్లగూబ, కాకివంటి పక్షులు, పిల్లి, నక్క, గాడిద వంటి జంతువుల ప్రసక్తి వుంది.

రాసాని నాటకాలలో జీవవైవిధ్యం : రాసాని రాసిన 'తరిగొండ వెంగమాంబ' అనే నాటకంలో తిరుమల కొండపైనున్న కోతుల్ని, రకరకాల పక్షుల్ని వర్ణించడం జరిగింది. అలాగే 'కాటమరాజు యుద్ధము' అనే నాటకంలో కాటమరాజు వర్గీయులు గుర్రాలపైన కాసే పశువుల మంద 'కూడితే ఆరామడ చెదరితే పన్నెండామడ'గా విస్తరించిన వైనం,

ఎర్రగడ్డపాడు యుద్ధంలో సింహగిరిరాజుల సైన్యంపైకి కోడెల్ని తోలడం, అందులో ఒంటి కొమ్ము బొల్లావు చేసే యుద్ధం అద్భుతంగా చిత్రింపబడింది. ఈ నాటకంలోనే గొడ్ల కళ్ళను పొడిచే కుందమాదేవి పెంపుడు చిలుక యుద్ధానికి కారణభూతమైన విధానం చెప్పబడింది.

'చెంచునాటకం'లో చెంచిత యొక్క పిల్లవాన్ని నోట కరచుకుపోయిన పులి వర్ణింపబడింది. చెంచిత చేసిన సాహసంలో గండబేరుండ పక్షి, దాన్ని బంధించి వుంచిన ఏడు శిరస్సుల నాగేంద్రుడు చిత్రించబడ్డారు.

రాసాని కవితల్లో జీవవైవిధ్యం : వచన సాహిత్యంలో వర్ణించినంత జీవవైవిధ్యం కవితల్లో తక్కువే అయిన ఒకటి రెండు గేయాలలో జీవవైవిధ్యాన్ని ప్రస్తావించిన సందర్భాలు లేకపోలేదు. 'మాయమైన మౌనగీతం' (ప్రస్థానం : జనవరి – మార్చి, 2005) కవితలో 'పాలధేనువుల మెడపట్టీ గంటల్లో' అనే చోట పాడియావుల్ని

> *రాసాని తన రచనల్లో జీవవైవిధ్యాన్ని ప్రతిభావంతం గానూ, సందర్భాను సారంగాను చిత్రించారు. ఈనాటి రచనల్లో ఇది అరుదైన అంశమే గాకుండా, రాను రాను కనుమరుగై పోతున్న కొన్ని జీవాలకు, ఈ కాలంలో అవసరమైన జీవకారుణ్యానికి అత్యవసరంగా చిత్రించాల్సిన విషయం కూడా.*

''బలి బుక్కులు బలిసిన ఈ గడ్డపైన
ఎన్నికోకిలలు పిలిస్తే మాత్రం
ఇక తిరుగొస్తుందా పాట"

అన్న చరణంలో కాకుల్ని, కోకిలల్ని ప్రస్తావించడం జరిగింది. అలాగే 'బడాయిపాట' (కవితా మాలిక, 2006)లో "గువ్వల చెరువుకనము లోన గూడు కడదామన్నదిరా – గువ్వలోలెమనమూ హాయిగుందమన్నదిరా – గూటిలోన మనమూ గుట్టుగుందమన్నదిరో'' అన్న గేయభాగంలో గువ్వల్ని, వాటి గూళ్ళను చెప్పడం జరిగింది.

'పల్లె పిల్ల గొర్రెతనం' గేయంలో (వార్త – ఉగాది – 2007) ఎక్కువగా పశుసంబంధ పదబంధాల్ని వాడాడు.

"ఆమె ఓ పల్లె పిల్ల.
ఆమె మట్టువాసన ఇంకాపోని
నల్ల గొర్రెపిల్ల
మెడకింద లింగాలు కదిలిస్తూ
చెంగున దూకే కంచి మేకపిల్ల
గంగడోలు ఊపుకుంటూ
గంభీరంగా నడిచే గంగిగోవు
......................................
ఆమె వంటి మిసమిసలు
పూలపూల గుడ్ల కోడిపెట్టను
గుర్తుకు తెస్తోంది.
......................................
ఉడిగిన వేళ మగడు పోయి
ఒంటరిదైనప్పుడు.........
నశించిపోయిన
పాడిపశువులతో
గొర్రెల మందలతో
మేకల గుంపులతో
ఒకప్పుడు ఆమె గడిపిన
మధురక్షణాలను నెమరు వేసుకుంటూ
కలల కసువును వాటిముందర విసరడానికి
తన చివరి క్షణం వరకు
ఎదురుచూస్తూ వుంటుంది.
మనుషుల నుండి మాయమైపోయిన
అమాయకపు గొర్రెతనాన్ని
మేకల మంచితనాన్ని
పశువుల పసిడి మనసును
ఎదురుపడిన ప్రతి మనిషి
గుండెలోకి దూరి
అన్వేషిస్తూనే వుంటుంది
కొన ఊపిరిదాకా"

ఈ గేయంలో పశువుల మందలు, గొర్రెలు, మేకలు ప్రసక్తమైనాయి.

'కలల్ని ముక్కలు ముక్కలు చేసి' అని ప్రారంభమయ్యే కవిత 'జారుడు జర్తె'లో

'ఇల్లాలి వంటిమీది పసిడి పావురాలు'

'కసవు తిని కడుపులు నింపిన పసరాలు – కసాయి కొక్కేనికి దట్టాలై వ్రేలాడుతాయి' అంటూ పావురాలను ప్రతీక స్థానంలోను, కసాయివాడి కరకు కత్తికి బలైపోయే పశువుల్ని వర్ణించడం జరిగింది.

ఇలా రాసాని తన రచనల్లో జీవవైవిధ్యాన్ని ప్రతిభావంతంగానూ, సందర్భానుసారంగాను చిత్రించారు. ఈనాటి రచనల్లో ఇది అరుదైన అంశమే గాకుండా, రాను రాను కనుమరుగైపోతున్న కొన్ని జీవాలను, ఈకాలంలో అవసరమైన జీవకారుణ్యాన్ని అత్యవసరంగా చిత్రించాల్సిన విషయం కూడా.

## కవిత

### చీమ

ఎన్. అరుణ



**నా** వల్లనే ఈ నీడంతా
అని అరిచింది వృక్షం
ఆకుల కళ్లను చిట్లించి
నలువైపులా చూసింది

ఆ మహావృక్షం కింద నిలబడి
ఓ చీమ
వ్వెవ్వెవ్వె అని వెక్కిరించింది
'ఇంత పెద్దగా బలిశావు
అయినా ఏం లాభం!

ఉన్న చోటి నుండి
అడుగైనా కదలలేవు
నన్ను చూడు
ఎంత స్వేచ్ఛగా ఉన్నానో!'
అంటూ

మీసాలు దువ్వుకుంటూ
దర్జాగా వెళ్ళిపోయింది.
అంత పెద్ద వృక్షరాజమూ
ఆశ్చర్యంతో
అలా చూస్తూ ఉండిపోయింది.

---

### గుండె చెఱువై

కిలపర్తి దాలి నాయుడు
9491763261



**ఒ**కప్పుడు చెఱువు
బిడ్డకు పాలిచ్చిన బాలింతలా ఉండేది
గుండె రక్తాన్ని శరీర భాగాలకు పంపినట్టు
ప్రతీ మడికి నీటిని అందించేది
పండగ దినాలొచ్చాయంటే మా చెఱువే పుణ్యతీర్థమయ్యేది.
మా ఊరి ఆడ పిల్లలంతా
ఈ చెఱువును చూడగానే కలువలౌతారు
మా నాన్న మట్టి గంధాన్ని పూసుకొని
తల్లి ఒడిలో దూరిన చిన్న పిల్లాడయ్యింది యిక్కడే.
మా ఊరి వినాయకుడు నిమజ్జనానికి వెళుతూ
కులమత భేదాల కుళ్ళును కడిగేది మన చెఱువేనంటూ
మునిగేవాడు
పిల్లలకు చేపలే ఈత నేర్పుతున్నాయో
చేపలకు పిల్లలే ఈత నేర్పుతున్నారో చెప్పడం కష్టమే సుమండి!
మా మలిన మనస్సులను ఉతికి పరిశుభ్రం చేయబడిన చోటిది
ఒక్కొక్కసారి కొన్ని శరీరాలు నుండి ఆత్మలు బయటకు పోయిన
విషాద సందర్భాలూ ఉన్నాయ్.
ఊరి శరీరానికి మెదడంటే అది మా చెఱువే మరి.
వలలకు బతుకిచ్చింది గాదెలకు జీవమిచ్చింది ఈ చెఱువే
భువన విజయంలో కూర్చున్న కవుల్లా
చెఱువు గట్టున నిటారుతనాన్ని పునికి పుచ్చుకున్న కొబ్బరి చెట్లు
ప్రకృతిపై పద్యాలల్లేవి
తప్పకుండా దొరికిన లంకెల బిందెల్లా
గుమ్మడి (పాదులు) కాయలు ప్రతియింటికీ చేరేవి.
బడిలో పిల్లలందరు ఒకేసారి మాట్లాడినట్టు
కప్పల సందడి రాత్రి నిద్రకు కొంచెం దూరంచేసేవి
పరిశీలకు లెవరో వచ్చి కలియ దిరిగినట్టు
అడవి బాతులు షికారు చేసేవి.
అధినాయకుని చుట్టూ బాడి గార్డుల్లా
చెఱువు చుట్టూ కొంగలు మెళ్ళెత్తి చూసేవి.
ఇప్పుడు ఆ చెఱువు కబ్జా డ్రాగన్ కోరల్లో పడి...
చదరపు 'గజం' కాళ్ళ కింద (బడి)
నలిగి అచ్చెరువు గొల్లుతోంది
ఊరును వలస బాటపట్టించడానికి తెలియని పునాది వేస్తుంది
మళ్ళల్లో కాంక్రీటు నారు పోసి
కళ్ళల్లో విషాదం నింపిన నగరీకరణ
ప్రపంచీకరణ పంపిన యమ దూతైతే ఊళ్ళు బీళ్ళేమరి.

## విశ్లేషణ

# మహా రచయితల వింత అలవాట్లు

- ఉదయమిత్ర

9985203376



*సుప్రసిద్ధ రష్యన్ రచయిత, నాటక కర్త 'చెహోవ్' తన ఇంట్లో పెద్ద పెద్ద పార్టీలు ఇచ్చేవాడు. ఆ విందులకు తన స్నేహితుల్నీ, బంధువుల్నీ, పరిచయస్తుల్నీ పిలిచేవాడు. వాళ్లు మాట్లాడుకుంటుంటే, చెహోవ్ ఓ మూలన కూర్చొని శ్రద్ధగా గమనించేవాడు. ఇట్లాంటి ఘటనల, సంభాషణలనుంచి అనేక విషయాలు గ్రహించి, తన నాటకాలలోని సీన్లను రక్తి గట్టించేవాడు.*

**"నా** జీవితంలోని అతి పెద్ద నాటకాన్ని తెల్సుకోవాలనుకుంటున్నావా?'' అంటూ ఆస్కార్ వైల్డ్ ఓమిత్రునితో వాదనకు దిగాడు.. "నేను నా మేధస్సును జీవితానికిచ్చి, నా టాలెంట్‌ను మాత్రమే సాహిత్యానికిచ్చాను" అన్నాడాయన".

నిజంగానే, కొందరు ప్రముఖ సాహితీవేత్తల వ్యక్తిగత అలవాట్లు జూస్తే, వింతగానూ, ఆశ్యర్యంగానూ అనిపిస్తాయి, "ఆస్కార్‌వైల్డ్" ఎక్కడికి వెళ్లినా జేబులో ఓనోట్ బుక్ పెట్టుకొని వెళ్లేవాడు. తన చుట్టూ మనుష్యుల సంభాషణల్లోని మెరుపుల్ని భద్రంగా నోట్ చేసుకునేవాడు.. ఆయన సృష్టించిన ప్రసిద్ధమైన ఏక వాక్యాలు, హాస్య సంభాషణలు అన్నీ ఈ పరిశీలన నుండి పుట్టినవే.. ఇట్లా ప్రయాణాల్లో విశేషాల్ని నోట్ చేసుకోవడం, ఆయనొక్కడే చేయలేదు. ఆయనకు సమకాలికుడైన ప్రసిద్ధ నాటక కర్త "బెర్నార్డ్ షా" కు సైతం ఈ అలవాటుండేది. ఆయన లండన్ వీధుల్లో బస్సుల్లో ఏ లక్ష్యమూ లేకుండా తిరుగుతుండే వాడు. సాధారణంగా ఆయన బస్సెక్కితే, చివరి స్టేజీవరకు టిక్కెట్ తీసుకొని ప్రయాణం చేసేవాడు. ఆయన రచించిన సుప్రసిద్ధ నాటకం " ఆర్మ్స్ అండ్ ద మ్యాన్", ఇట్లా బస్సులో ప్రయాణాల ఆధారంగా రాసిందే.

సుప్రసిద్ధ రష్యన్ రచయిత, నాటక కర్త 'చెహోవ్' తన ఇంట్లో పెద్ద పెద్ద పార్టీలు ఇచ్చేవాడు. ఆ విందులకు తన స్నేహితుల్నీ, బంధువుల్నీ, పరిచయస్తుల్నీ పిలిచేవాడు. వాళ్లు మాట్లాడుకుంటుంటే, చెహోవ్ ఓ మూలన కూర్చొని శ్రద్ధగా గమనించేవాడు. ఇట్లాంటి ఘటనల, సంభాషణలనుంచి అనేక విషయాలు గ్రహించి, తన నాటకాలలోని సీన్లను రక్తి గట్టించేవాడు.

ప్రసిద్ధ భావకవి **(romantic poet)** "పి.బి షెల్లీ" కి మరో వింత అలవాటు ఉండేది. ఆయన రాసుకునే రూములో బ్రెడ్లు, (లవర్ ఆఫ్ బ్రెడ్) సమృద్ధిగా ఉండేవి. ఎప్పుడయినా ఊహ తెగినప్పుడో. ఆలోచనా సరస్సులో సరిగా ఈద లేనప్పుడో, విపరీతంగా కోపం వొచ్చేసి ఓ బ్రెడ్డు తీసుకొని, పరపరా నములుతూ బయటికి వెళ్లిపోయేవారు.

రష్యా తత్వవేత్త, సిద్ధాంతకర్త ఐన మైఖేల్ భక్త్", తాను జర్మన్ నవల మీద రాస్తోన్న సిద్ధాంత గ్రంథం నుండి పేజీల్ని చించి, తన సిగరెట్లకు కవర్ గా వాడుకునేవాడు. చిత్రమేమంటే ఆకాలంలో పేపర్ కొరత ఉండేది. అది రెండో ప్రపంచ యుద్ధం కావడంతో ఆయన ఇంట్లోంచి బయటికి వెళ్లే పరిస్థితి ఉండేది గాదు. ఆ కాలంలో ఆయన పొగతాగే మేధావిగా ఓ ఆరాధ్య స్థితికి వొచ్చాడు. స్మోక్ (1995) సినిమాలో మనకు ఈ ఛాయలు కనబడుతాయి. అందులో సిగరెట్ల కోసం సిద్ధాంత గ్రంథాల పేజీల్ని కాల్చడం ప్రముఖంగా చూయిస్తాడు.

మానవ మేధస్సు మీద అతిగొప్పనవల రాసిన "మైఖేల్ ప్రోస్ట్' ఎపుడూ ఒంటరిగా ఉండడానికి ఇష్టపడేవాడు. ప్యారిస్ వీధుల్లోని రణగొణ ధ్వనుల్నుండి తప్పించు కోవడాన్కి ఎప్పుడూ తన రూముకి గొళ్లెం వేసుకొని రాతపని చేసేవాడు. నిద్రాహారాలు ఆ సింగిల్ రూములోనే. అతను పగలంతా నిద్రబోయి, రాత్రి మాత్రమే రాసేవాడు. అతనెప్పుడూ ఒంటిపూట మాత్రమే భోంచేసేవాడు (తక్కిన సమయాల్లో టీ, కేకుల్తో గడిపేవాడు). కాని, ఆ ఒక్క భోజనాన్ని మాత్రం.. నిద్రబోయేముందు ఎనిమిది గంటల ముందు, పక్కాటైమ్‌లో

## కవిత

### సముద్రం ఏం చేస్తుంటుంది

- జుగాష్విలి
98482 66384

ఇప్పుడా సముద్రం ఏం చేస్తుంటుంది

ఇదే సముద్రం
ఇదే చోటు

నిన్నేం చేస్తుంటుంది
మొన్నేం చేస్తుంటుంది
అటుమొన్నేం చేస్తుంటుంది
అంతకు ముందు కూడా యిలానేనా

ఇదే సముద్రం
ఇదే చోట
రేపేం చేస్తుంది
ఎల్లుండేం చేస్తుంది
అవటాలెల్లుండేం చేస్తుంది
ఆ తర్వాత కూడా యిలానేనా
మండే ఎండల్లోనూ, జోరువానలోనూ
చీకటిలోనూ వెలుతురులోనూ
పండువెన్నెలలోనూ
ఒకేలానా...
కాదంటే కాదు కదా

◆

సముద్రం నిద్రపోతే ఎంత బావుండు
అది ఒక కలకూడా కంటే యింకెంత
బావుండు
కలనిండా సుతిమెత్తని నీరు పరుచుకుంటే
మరెంతగా బావుండు



---

తీసుకునేవాడు.

విరివిగా దేవతల కథల **(Fairy tales)** రాసిన ప్రసిద్ధ కవి, రచయిత "హన్స్ క్రిష్టియన్ అండర్సన్" ను ఎప్పుడూ ఓ భయం వెంటాడుతుండేది. తానెప్పటికయినా మంటల్లో కాలి చనిపోతానని ఊహిస్తూ భయపడేవాడు. ఆ ఉద్దేశ్యంలోనే, అతను ఎక్కడికెళ్లినా తన బ్యాగులో ఓ పొడగాటి తాడును (మంటల నుండి రక్షణ కోసం) పెట్టుకు తిరుగుతుండేవాడు.

రాసేటప్పుడు మహారచయితల శారీరక భంగిమ (పోస్టర్)లు కూడా వింత గొలిపేవిగా ఉండేవి. "ట్రూమన్ క్యాపోట్" అనే రచయిత ఎప్పుడు వెల్లకితలా సోఫాలో పడుకొని, పక్కన ఓ గ్లాసు షెర్రీ ని పెట్టుకొని రచన కొనసాగించేవాడు. "వర్జీనియా ఉల్ఫ్", "ఎర్నెస్ట్ హేమింగ్వే" లు మాత్రం ఎప్పుడూ నిలబడే రాసేవాళ్లు.

ప్రఖ్యాత రచయిత "విక్టర్ హుల్యాగో" కు మరో విచిత్రమైన అలవాటుండేది. ఆయన తన పని మనిషికి తన బట్టలు మొత్తం అప్పగించేసి, దిసముల (స్టార్క్ నేకెడ్) లో రచన కొనసాగించేవాడు. ఆయన ఆ పరిస్థితుల్లో బయటికి పొయ్యే పరిస్థితి లేకపోవడంలో రచన నిర్విరామంగా సాగేది.

"అలెగ్జాండర్ డ్యూమన్" రచనా పద్ధతి మరోలా ఉండేది. తాను రాసే ఒకో సాహితీ ప్రక్రియకు ఒక్కో రంగు నోటు పుస్తకాన్ని ఉపయోగించేవాడు. ఉదా: కవిత్వానికి పసుపురంగు, యధార్ధరచనకు నీలం రంగు నోటు పుస్తకాల్ని వాడేవాడు.

"జేమ్స్ జాయిస్" మీద రంగులు ప్రభావం బాగా ఉండేది ఆయన రాసేటప్పుడు స్వచ్ఛమైన తెల్లని కోటు ధరించి, నీలం రంగు పెన్సిళ్లనే ఉపయోగించేవాడు. కారణాలు తనకే తెలియాలిగాని, "టి.ఎస్. ఇలియట్" తన ముఖానికి ఆకుపచ్చ పౌడరు వేసుకుని రచన కొనసాగించేవాడు. డిటెక్టివ్ నవలా సామ్రాజ్ఞిగా పిలువబడే "అగాథా క్రిస్టీ" కి తన విలాసవంతమైన బాత్‌టబ్ పక్కన ఎప్పుడూ ఆపిల్స్ ఉండేవి. అక్కడే ఆమె హత్యా రహస్యాల్ని ఛేదించే అద్భుతమైన నవలల్ని సృష్టించేది.

ప్రఖ్యాత జర్మన్ కవి, తత్వవేత్త, నాటక కర్త ఐన "ఫ్రెడరిక్ స్కిల్లర్" కు ఆపిల్ పండ్ల పట్ల గల యావ జూస్తే ఆశ్చర్యమనిపిస్తది. ఆయన రాతబల్ల వెనుక ఉన్న డ్రాయర్ సొరుగులో ఎప్పుడూ బోలెడన్ని కుళ్లిన లేదా కుళ్లి పోతున్న ఆపిల్ పండ్లు ఉండేవి. ఎప్పుడయినా ఆయన ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నప్పుడు, కుళ్లిన ఆపిల్ పండ్ల వాసన ఘాటుగా పీల్చి, రచన మొదలు పెట్టేవాడు.

ఈ మహా రచయితల అలవాట్లు, వింత పోకడలు జూస్తే వాళ్లకు ఇట్లాంటి సంకుచితమూ, సామాన్యమూ అయినటువంటి విషయాలపట్ల ఎంత తీవ్రమైన ఆపేక్ష ఉండేదో అర్ధమవుతుంది. వాళ్లు తమ స్వీయ సంతోషాల **(Private Pleasures)**ను రసజ్ఞత లోకి మార్చుకోవడం, ఎవరికయినా ఆశ్చర్యమనిపిస్తుంది. ఆ విధంగా వాళ్లు సృజనాత్మక రచనలు జేసి, స్థలకాలాలకు అతీతంగా నిలబడగలిగారు.

**( EPW (Economic & political weekly ) లో** యిచ్చిన "**private pleasures**" వ్యాసానికి స్వేచ్ఛానువాదం. )

## నచ్చిన రచన

# స్ఫూర్తిదాయక రచన

- *వకుళాభరణం లలిత*




వరవరరావు అన్నట్లు ఈ గ్రంథం "వైయక్తిక, మానవ సంబంధాలు, పరిసరాల ప్రభావాల నిర్దిష్ట చరిత్ర". సాహిత్య పరంగానూ, కళాత్మక హృదయంతోనూ ఉన్న ప్రతి ఒక్కరూ ఆ యింట్లో సభ్యులే. ఆమె సాహిత్య సమాలోచనకు తోడుండే వాళ్లే, కృష్ణా బాయి జ్ఞాపకాలు అనుభవాల దొంతరలు. ఆమె రచన జీవనదీ ప్రవాహం. ఈ ప్రవాహం నిరంతరం ఎడతెరపి లేకుండా ప్రవహిస్తూనే ఉంటుంది. సాహిత్యం, సమాజానికున్న సంబంధమే ఆమె మనుగడ.

ఈ గ్రంథంలో కృష్ణాబాయి రాయని అంశం లేదు. తడవని సమస్య అంత కన్నా లేదు. ఇంతటి వైవిధ్యం గల రచనలు చాలా అరుదుగా ఉంటాయి. విప్లవోద్యమం ఆచరణ గురితో, ఆ సాహిత్యంతో ముడిపడి ఉన్న కుటుంబం, దానికున్న ప్రత్యేక హోదా. సాహిత్యంలో మన సమాజం కన్పిస్తుంది. స్నేహితులు, సన్నిహితుల ప్రేమాభిమానజల్లులో తడిసిన జీవితం ఆమెది. జనం ప్రేమికులు. చరిత్ర నిర్మాతలు కూడా, ప్లాస్టిక్ పువ్వులాంటి ఈ సమాజాన్ని మొత్తంగా కరిగించి వెయ్యాల్సిందేనంటారు కృష్ణాబాయి. జీవిత సర్వస్వాన్ని త్యాగం చేసి అయినా సరే సమైక్య జీవన సౌందర్యం పునాది మీద నూతన వ్యవస్థను నిర్మించాలని ఆమె ఆశయం.

సాహిత్య సమాలోచన గ్రంథంలో 9 అధ్యాయాలున్నాయి. మొదట అధ్యాయమంతా కృష్ణాబాయి జీవితానికి సంబంధించింది. ఆమె పెరిగిన జీవితం, ఇద్దరు కమ్యూనిస్టు నాయకులు ఆమెను కమ్యూనిస్టుగా తీర్చి దిద్దిన ఉదంతం, ఆనాటి సమాజం, అన్న గోపాలరావు "నాదు కమ్యూనిస్టునిరా" అని పాడిన పాట, విద్యార్థి ఫెడరేషన్, ప్రజానాట్యమండలి ప్రభావం, ఆనాటి పాటలు, బుర్రకథలు, మహిళా సంఘాలు, చైతన్యంతో పెల్లుబుకుతున్న రోజులు, అవే ఆమెను బతికించాయి. అన్యాయాల్ని , దుర్మార్గాల్ని ఎదుర్కొనే జీవితం ఏర్పడింది కృష్ణాబాయికి. వైవిధ్య భరితమైన జీవితంలో ఎందరితో పరిచయాలు, ఎన్నెన్ని విడదీయరాని బంధాలు. జీవితంలో అన్నీ తానే అయిన వాణి. మాటలే కరువై, శరీరం దానం చేయటం, తాయిమ్మ, కరుణ, పద్మకుమారి, కలాలతో, గళాలతో పోరాడటం ఇవి అందులో రాసినవి.

అట్లే సాహిత్య వ్యాసంగం, సాహిత్యం, సమాజం, విమర్శ రంగంలో కృషి. చలం తిరుగు బాటుకీ, స్వేచ్ఛకీ ధైర్య సాహసాలకీ, ప్రభంజనంలా దూసుకొచ్చే సాహిత్య ధోరణి సంకేతంగా నిలవటం. ఆనాటి స్త్రీలు అనుభవించిన మూగవేదన, జీవిత రథచక్రాల కింద నలిగిపోవటం. స్త్రీలకు శ్రమ విముక్తి, స్త్రీముక్తి, సమాజ విముక్తి ముప్పేటగా కొనసాగించాలి. గురజాడ అంటే కృష్ణాబాయికి ఎంతో అభిమానం. స్త్రీ పురుష సంబంధాలను అంత లోతుగా పరిశీలించి, ముందు చూపుతో రాసిన రచయితలు చాలా అరుదని ఆమె భావం. మధురవాణి పాత్రను గూర్చి రాస్తూ, మానవ జీవితమనే సముద్రంలో కన్యాశుల్కం ఒక నావ అయితే, దాని చుక్కాని పట్టిన మధురవాణి, నవ్విన నవ్వు, మానవ జాతికే కనువిప్పు అవుతాయంటారు కృష్ణాబాయి.

బానిసలు తయారవడానికి ముందు నుంచే స్త్రీ బానిస అయింది. పని మనిషి సినిమాకు వెళ్తుంటే వాళ్లాయనతో

చెప్పబల్లేదా అని ప్రశ్నించినప్పుడు పనిమనిషి అప్పాయమ్మ యిచ్చిన సమాధానం 'మా బతుక్కి నెలకొక్క సినిమా దానికీ, అణా పూలకీ కూడా దేవిరించే కర్మ నా కేల' అంటుంది.

స్త్రీ రాణించాలంటే, ఒక విద్యలో ప్రవీణురాలు కావాలంటే అంత సులభంకాదు. స్త్రీ ఒక బాలమురళి, ఒక ఈమనిశంకర శాస్త్రో కాలేక పోవటానికి కారణం, సృజనాత్మక శక్తి లేకపోవటం కాదు, అవకాశాలు లేకపోవటం. తన కున్న అడ్డంకులను అధిగమించి ఏటికెదురీదితే గాని స్త్రీ రాణించగలదు అంటారు కృష్ణాబాయి.

భార్య తమ ఆస్తిగనుక తాను భద్రంగా కాపాడాలని భావిస్తారే కాని, ఆమెకు ఒక మనస్సుందనీ, కొన్ని అభిరుచులుంటాయని, వాటిక్కూడా అవకాశమివాలని అనుకోరు. ఎన్నో అవకతవకలున్నా ఈ వివాహ వ్యవస్థలో, పడుపువృత్తి చోటు చేసుకుంది. ఒకనాడు 'గుడిచేటి' అనే పదం పవిత్రంగా ఉండేది. కాని ఇప్పుడది బూతు పదమైంది. పడుపు వృత్తి ఒక వృత్తి కావటం దౌర్భాగ్యమంటారు కృష్ణా బాయి. చరిత్ర రాయాల్సి వస్తే యింతటి నికృష్టపు అధ్యాయం మరొకటి ఉండదంటారు.

పూర్వం కొన్ని దేశాలు స్త్రీని అర్ధ నగ్నంగా నిల్చో బెట్టి అంగాంగాన్ని వర్ణిస్తూ వేలం వేసేవారు. నేటి స్త్రీ పరిస్థితి అంతకంటే మెరుగ్గా లేదు. వ్యాపారాభివృద్ధికి స్త్రీ ఒంపు సొంపులను ఉపయోగించే శక్తులున్నంత వరకు స్త్రీ స్వాతంత్ర్యానికి అర్థంలేదు. అంతర్జాతీయ మహిళా సంవత్సరాలు ఎన్ని జరుపుకున్నా స్త్రీ విమోచనం అర అంగుళం ముందుకు జరగదు.

ఉన్నత, మధ్య తరగతి, అట్టడుగు స్త్రీ సమస్యలకు ఆట్టే తేడాలుండవు. ఏ స్త్రీయైనా పెళ్లామంటే లోకువే. బయిట ఎంత పని చేసి వచ్చినా యింటి చాకిరి అంతా ఆమెదే. పేర్లు మాత్రం గృహలక్ష్మి, హృదయ రాణి. బాధ్యత ఆడదానికి పీట ముడిపడ్డ మంగళసూత్రం లాంటిది.

స్త్రీ అణిచివేతకు గురౌవుతూనే ఉంది. ఆస్తిహక్కులో పురుషునితో సమానత్వం లేదు. ఆమె పని చేయటం లేదా ఎక్కడా అంటే, ఆమె శ్రమ శక్తి ఏమౌతుంది? ఫాసిస్టుల దృష్టిలో స్త్రీ పిల్లల్ని కనే యంత్రం మాత్రమే. స్త్రీ విలువ పెరగలేదు. 'ఏదేశ చరిత్ర చూసిన స్త్రీ కేమున్నది గర్వకారణం'. అర్ధ నగ్నంగా నృత్యం చేయించి ఆనందించే సంస్కృతి మనది. భారత దేశంలోనే కాదు, ఒకప్పుడు చైనాలో స్త్రీ పాదాలను నొక్కపెట్టి కట్టేసేవారు. ఎన్ని పెయ్యి లైతే ఒక కోడె దూడౌతుంది? పితృస్వామ్య సమాజంలో అత్యాచారాలు బలమైనాయి. నిర్భయ చట్టం వచ్చినా, ఆచరణలో సాధ్యం కావటం లేదని ఎంతో బాధపడ్డారు కృష్ణాబాయి.

చాకలి లచ్చమ్మ దళం బట్టలు ఉతకటమే గాక, అన్నం చేరవేసింది. సైన్యం ఆమెను వివస్త్రను చేసి, తలకిందులుగా చెట్టుకు వేళ్లాడదీసి లాఠీలతో కొట్టి, దళనాయకురాలి ఆచూకి అడిగారు.

ఒక నిర్మల, ఒక సరస్వతి, ఒక వియ్యిమ్మ, ఒక అయిలమ్మ గాక మొత్తం స్త్రీ జాతి అంతా విముక్తి పోరాటంలో పాల్గొన్ననాడే సమసమాజం సిద్ధిస్తుంది అంటారు కృష్ణాబాయి.

మానవ విలువలు రోజు రోజుకు అడుగంటుతున్నాయి. పైశాచికత్వం చోటు చేసుకుంటున్న వ్యాపార సంస్కృతి ఉన్నంత వరకు స్త్రీ భోగవస్తువే, వ్యవస్థే ఆమెను అణగదొక్కుతుంది. స్త్రీ శీలాన్ని గూర్చి అనుమానాలు, నమ్మకాలు వెలిబుచ్చటం మన సమాజంలో మామూలైంది. ఆనాటి సమాజంలో సీత, ద్రౌపది, ఈనాటి సమాజంలో మాయత్యాగి, రమీజాబి, పూలన్‌దేవి, మధుర అందరూ బాధితులే. దారు ఎక్స్‌ప్రెస్ ఘటన.. ఛీఛీ సిగ్గు చేటు.

ఈ రకంగా స్త్రీ అస్తవ్యస్త పరిస్థితికి గూర్చి ఎంతో బాధ పడి, దీనికి నిష్కృతి ఎప్పుడో అని ఎంతో చింతించారు కృష్ణాబాయి, మిగిలిన అధ్యాయం జోలికి నేను పోదల్చు కోలేదు. అవన్నీ సమాజ చరిత్రలో భాగాలే. మాన్యులూ, మహనీయులు ఉదాత్తమైన జీవితాన్ని గడిపి, ఆదర్శపాలకులైనారు. పేరుపేరునా విశ్లేషిస్తే, అందరూ కృష్ణాబాయికి ఆప్తులే. ఎంతోమంది 'సృష్టిలో తీయినది స్నేహమే నోయి' అన్నట్లు పరిచయాలు, అనుబంధాలు, ఆప్యాయతలు స్నేహం అనే చెట్టుకు పూసే పువ్వులు మానవ సంబంధాలు. అన్ని అనుబంధాలున్నాయి కాబట్టే కృష్ణాబాయి జీవితం సార్థకమైంది. విరసంలో ముఖ్యమైన పాత్ర వహించారు. పేరుపేరునా ఆమె వ్యాస రూపంలో రాసినా, సమీక్ష కాబట్టి వాటి జోలికి పోవటం లేదు.

సాహిత్య సమాలోచన సంకలనం సమాజ చరిత్రకు చక్కటి ఉదాహరణ. ఈ రచనలన్నీ మనల్ని పలుకరిస్తాయి. తట్టిలేపుతాయి. అదే జీవితం. దాన్ని పెనవేసుకుని సమాజం. ఇదొక గొప్ప అనుభూతి. ఈ గ్రంథమెంతో స్ఫూర్తిదాయకం.

**సాహిత్య సమాలోచన సంకలనం సమాజ చరిత్రకు చక్కటి ఉదాహరణ. ఈ రచనలన్నీ మనల్ని పలుకరిస్తాయి. తట్టిలేపుతాయి. అదే జీవితం. దాన్ని పెనవేసుకుని సమాజం. ఇదొక గొప్ప అనుభూతి. ఈ గ్రంథమెంతో స్ఫూర్తిదాయకం.**

కథ

# అంతరాలు

**కళాగోపాల్**
**9441631029**



***మమ్మీ! నాకు ఇడ్లీలోకి సాంబార్ కంపల్సరీ. డాడీకిష్టమని కొబ్బరి చట్నీ చేసేవు. నేను బ్రేక్‌ఫాస్ట్ చేయనంతే" "మమ్మీ నాకు టిఫిన్ బాక్సులోకి దొండకాయ వేపుడు పెడితే నేను ఇక అన్నం తిననంతే. నాకు ఆలూకూర్మా కావాలి" దూసుకొస్తున్న బాణాల్లా పుత్రికా రత్నాల మెనూ ప్రకారంగా చకచకా పనులు చేస్తూ, వంటింట్లో హైరానా పడుతున్న గిరిజ నిట్టూర్చింది.***

"ఏమిటో! ఈ కాలం పిల్లలు ఇది తినను. అది కావాలి. ఇది కావాలి అంటూ పేచీపెట్టి విసిగిస్తారు. మా చిన్నప్పుడు ఐతే అమ్మ సున్నుండలు, కుడుములు ఏది పెడితే అది టిఫిన్‌లా తినేవాళ్లం. వీళ్లకు మరీ గారాబం ఎక్కువైపోయింది. ఆ దుర్గమ్మలా నాకూ అష్టాదశ భుజాలుంటే బాగుండు. అన్నీ క్షణాల్లో అమర్చేదాన్ని' అనుకుంది స్వగతంలా. గబగబా శ్రీవారికిష్టమైన కొబ్బరి చట్నీ గ్రైండింగ్ చేసి, సాంబారు పోపు పెట్టింది. కూతురికిష్టమైన ఆలూకూర్మాకై కుక్కర్‌లో ఆలు ఉడికించసాగింది. ఇంతలో పనిపిల్ల భాగ్య ప్రత్యక్షం అయింది. ''అమ్మా! బేగి రాత్రి గిన్నెలు ఏసేయ్. మాయింటికి సుట్టాలొచ్చింద్రు. వాళ్లకు ఛాయ, టిఫిను చేయాల. ఇల్లు దగ్గర ఉంది గదాని మీ యింటికి వచ్చా. ఇయ్యాల దూరం ఉన్న ఇండ్లకు పోను బంకు కొడతా" అంది. చీపురు తీసుకొని బరబరా ఊడుస్తూ. సందట్లో సడేమియాలా దీని నస ఒకటి. ఈ మధ్య భాగ్య యింటికి చుట్టాలు, అక్క చెల్లెండ్లు అంటూ రిలేషన్స్ ఉన్నవాళ్లు బాగానే వస్తున్నారు నెలలో వీరి కొరకై వారం రోజుల డుమ్మా ఖాయం. మళ్లీ రేపు కూడా డుమ్మానేమో! ఎంకి పెండ్లి సుబ్బి చావు కొచ్చిందన్నట్లు దీని యింటికి చుట్టాలు వస్తే, ఇక నేను చచ్చినట్లే అనుకొని వాపోయింది గిరిజ. గడియారం ఎనిమిది గంటలు సూచించింది. సౌమ్య, తరుణ్‌ల టిఫిన్ బాక్సులు చేతికిచ్చి సాగనంపింది. ఇంతలో మోహన్ కూడా ఆఫీసుకు తయారవుతూ "ఏమోయ్! టిఫిన్ రెడీ చెయ్!" అంటూ లేసాడు. గబగబా తయారయి అందరూ వెళ్లిన తర్వాత మరోసారి టీ పెట్టుకొని, తనోకప్పు, భాగ్యకూ ఓ కప్పు ఇచ్చింది గిరిజ. "ఎందమ్మా గీనడుమ బాగా బక్కగ అవుతున్నవు. మంచిగ తింటలేవా ఏంటి? ఎప్పుడు చూసినా పనిపని అంటూ తెగ హడావుడి పడతావు. ఇల్లు శుభ్రం, శుభ్రం అంటూ అద్దం లెక్క పెట్టుకుంటవు. గిట్ల బయట, ఇంట్ల ఒక్క తీరోలె పని చేస్తే బొక్కలు అరుగుతయి. మీకా ఇంటికాడ ఎవరూ ఉండరు. ఎవరూ మీయింటికి రారు. కొన్ని రోజులైనా మీ పుట్టింటికి వెళ్లమంటే ఇల్లు, పిల్లలు, ఉద్యోగం అంటూ టెన్షన్ పెట్టుకుంటవు అమ్మ! నువ్వు" అంది చొరవతో కూడిన సానుభూతితో. భాగ్యకు ముప్పై ఏళ్లుంటాయి, ఛామనఛాయ, ఐతే ఆకర్షణీయమైన కళ్లు, నవ్వు మొహంతో

కళకళలాడుతూ ఉంటుంది ఎప్పుడూ. దాదాపు పదేళ్ల నుండి పని చేస్తుంది కాబట్టే ఈ చనువు. టీ గ్లాసు భాగ్య చేతికిచ్చి నిరాసక్తంగా చెప్పింది గిరిజ. "ఈ రోజు తప్పక ఆఫీసుకు వెళ్ళాలి భాగ్యా! తొందరగా పని కానీయ్!" అంది.

◆◆◆

గిరిజ, మోహన్‌లది అన్యోన్య దాంపత్యం. మోహన్ తల్లీ తండ్రీ గతించారు. బెంగుళూరులో ఉన్న మోహన్ అక్క స్వర్ణ వాళ్లు ఎప్పుడో ఓసారి వచ్చి చూసిపోతుంటారు. గిరిజ కా ఒక తమ్ముడు అమెరికాలో స్థిరపడ్డాడు. ఎన్నో ఏళ్లకు గాని ఓసారి రాడు. అమ్మా నాన్న ఉన్నా వాళ్లింటికి గిరిజ వెళ్లేది తక్కువే. వాళ్లను రమ్మని అందామంటే ఆడపిల్ల యింట్లో ఎక్కువ రోజులు ఉండలేమంటారు. గిరిజకూ అప్పుడప్పుడూ అన్పిస్తుంది. ఇంట్లో పెద్దవాళ్ళెవరైనా ఉంటే బాగుండు అని. కాస్త యిల్లు చూసుకున్నట్టూ ఉంటుంది. ఇద్దరు పిలలతో పడరాని పాట్లు పడిందామె. మరీ ముఖ్యంగా పిల్లలు చిన్నగా ఉన్నపుడు ఐతే వాళ్లను తయారు చేసి క్రెచ్‌లో వదలిపెట్టి, మళ్లీ ఆఫీసు నుండి తీసుకొని రావటం, క్రెచ్ వాతావరణం సరిపడక బాబుకు ఎప్పుడు విరేచనాలే! దీనికి తోడు జ్వరం. ఒకటి గాకుంటే మరొకటి నానా అవస్థలు పడి పిల్లలను పెద్ద చేసిందామె. నిజం చెపొద్దూ! అప్పుడప్పుడు గిరిజకు తన



కొలీగ్స్‌ను చూస్తే అసూయగా ఉండేది. ఎందుకంటే వాళ్లందరికి చుట్టాలు, పక్కాలు, స్నేహితులూ ఎక్కువే. ఎప్పుడూ ఎవరో ఒకరు రావటం, లేదంటే సెలవు రోజుల్లో వీళ్లే హాయిగా అలా వెళ్లి వాళ్లుండే ఊర్లు తిరుగేసి రావటం. వచ్చాక ఆ కబుర్లు ఆఫీసులో పంచుకోవటం. ఇవన్నీ చూస్తూంటే గిరిజ చాలా గిల్టీగా ఫీలయ్యేది. తాము అలా వెళ్లలేమా అని! వెళ్తేగిళ్తే ఐతే బెంగుళూరు లేదంటే పుట్టిల్లు, మమ్మీ! బోరింగ్ మనకుండేది వీరిద్దరేనా అని పిల్లలు అడిగితే ఏం చెప్పాలో తెలియక సతమతమయ్యేది.

◆◆◆

రెండు రోజులు గడిచాక. ఓ రోజు ప్రొద్దున్నే ఉరుములేని పిడుగులాగ భాగ్య వచ్చింది. "అమా! జెర వెయ్యిరూపాయలు అప్పు ఇయ్యి. మా పెద్ద చెల్లె, చిన్న చెల్లె ఇద్దరూ అచ్చింద్రు. మా పెద్ద చెల్లె కడుపుతో ఉంది. దానికి దావత్ ఇయ్యాల. చిన్న చెల్లె పెళ్ళయ్యాక ఫస్టు మా యింటికి ఇదే రావటం. దానికి ఓ చీర పెట్టి సాగనంపాలి. జర ఎట్లయినా పై సలియ్య అమ్మా. నీ ఋణం ఉంచుకోను. నీకు డుమ్మాలు కొట్టకుండా మంచిగ పనిజేస్తా" ఆశగా అడిగింది భాగ్య. "మళ్లీ జీతం డబ్బులో కొంచెం కొంచెం కట్ చేస్తా" అంది గిరిజ వెయ్యినోటు చేతిలో పెడుతూ. "అలాగే" అంటూ పనంతా గబగబా చేసి నిష్క్రమించింది భాగ్య.

◆◆◆

"ఏమండీ! మా తమ్ముడు సారథి ఫోను చేశాడు. మరో వారం రోజుల్లో ఇండియాకు వస్తాడట. డిసెంబరులో సెలవులు పెట్టుకొని మరీ వస్తున్నాడు. అమ్మా వాళ్లింట్లో ఓ వారం రోజులు, మన దగ్గర ఓ వారం రోజులు ఓ వారం రోజులు వాళ్ల అత్తారింటి వైపు చుట్టాల మార్గం వెళ్తాడట" సంబరంగా చెప్పింది గిరిజ. చాలా ఏళ్ల తర్వాత సారథి ఇండియాకు వస్తున్నాడని విని సంతోషించాడు మోహన్. గిరిజ ఈ సంతోషాన్ని తన కొలీగ్స్‌తో కూడా పంచుకుంది.

◆◆◆

శంషాబాద్ విమానాశ్రయం, ఉదయం ఎనిమిది కావస్తుంది. గిరిజ, పిల్లలు తరుణ్, సౌమ్య అందరూ ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. పిల్లలిద్దరూ ఫ్లవర్ బొకే పట్టుకొని సిద్ధంగా ఉన్నారు, మామయ్యకు వెల్‌కమ్ చెప్దామని, సారథి అతని భార్య రమ్య, పాప ఇందు తో సహా ట్రాలిలో సామాన్లను నెడుతూ బయటకు వచ్చారు. హాయ్ అంటే హాయ్ అని పలకరించుకొన్నాక అందరూ కల్సి గిరిజ వాళ్ల అమ్మ వాళ్లింటికి వెళ్లారు. ఎందుకో గిరిజ అనన్యమస్కంగా ఉన్నట్లు గమనించాడు మోహన్. ముభావంగా ఉన్న గిరిజను అతనేమీ కదలించదల్చుకోలేదు. మరో రెండు రోజుల తర్వాత వాళ్ళ ఊరుకు రమ్మని చెప్పిబయలు దేరారు గిరిజ మోహన్‌లు.

◆◆◆

"ఏమైందోయ్ శ్రీమతిగారు... వెళ్లేటప్పుడు హుషారుగా ఉత్సాహంగా ఉన్నారు. తిరుగుటపాలో అలా నీరసంగా ముఖం వేలాడేసుకొన్నారేం. మీ తమ్ముడు చాన్నాళ్లకు వచ్చాడుగా. అవి, ఇవి అన్నీ వండి పెడతా, వాడికిష్టమైన పిండివంటలు, వడియాలు వగైరా సర్దుతాను. అలా హ్యాపీగా వారితో కల్సి తిరుపతి ప్లాన్ కూడా వేసుకున్నారే! ఇంతలో ఏమైందీ... ఏమిటా నిరాసక్తత?" అంటూ ప్రశ్నించాడు మోహన్. "ఏం లేదండీ. కాస్త ప్రయాణ బడలికగా ఉంది. బాగా పొద్దుపోయింది పడుకోండి. వచ్చినవాడు ఎలాగూ మనింటికి తప్పక వస్తాడుగా. అప్పుడు సెలవులు పెడతాను" అంది పక్కకు వత్తి గిల్లుతూ గిరిజ. "ఏమిటో మీ అక్కా, తమ్ముళ్ల వ్యవహారం మీకు మాత్రమే అర్థం అవుతుందనుకుంటా" ఆలోచనగా అన్నాడు మోహన్.

◆◆◆

."మమ్మీ! మామయ్య ఫోన్ చేశాడు" అంటూ సెల్‌ని

చేతిలో పెట్టింది సౌమ్య. వంటపనిలో తలమునకలుగా ఉన్న గిరిజ స్టౌవ్ సిమ్‌లో పెట్టి "హల్లో" అంది. "హలో అక్కా! ఎలా ఉన్నావు? వచ్చి నాలుగు రోజులైనా మాతో ఉంటావనుకుంటే. ఆఫీసులో అర్జంట్ ఇన్స్‌పెక్షన్ ఉందంటూ వచ్చేశారే, బావకు, నీకు, పిల్లలకు అమెరికా నుండి వచ్చేటప్పుడు మెమెన్నో బహుమతులు తెచ్చాం. అవన్నీ చూపిద్దామన్నా టైం లేదంటూ వెళ్లిపోయారు. అన్నట్టు మేము చంటిదాని తలనీలాలు అర్పించడానికి మరో రెండు రోజుల తర్వాత తిరుపతికి వెళ్తున్నాం. ఆ తర్వాత మా అత్తగారింటికి వెళ్లి, నాలుగు రోజులుండి లాస్ట్‌వీక్ మీ ఊరికి ప్లాన్ వేసుకున్నాం. అప్పటివరకు లీవ్ అప్లై చేసి పెట్టుకో. ఆందుకని ఇంతకుముందు నుండి చెప్తున్నాను. ఆ! బావను అడిగానని చెప్పు బై ఉంటాను" అంటూ ఫోను పెట్టేశాడు సారథి.

◆◆◆

''అమ్మా! మనింటికి ఎవర్ని తీసుకొచ్చానో సూడు. ఇది మా పెద్ద చెల్లె గౌరి. అగో! గిది మా చిన్న చెల్లె శోభ. సూడటానికి మా చిన్న చెల్లెనే అందరికంటే పెద్దగా కన్పిస్తది. మా అమ్మగారికి దండం పెట్టుండ్రి'' అంది భాగ్య. నుదుటన పావలా కాసంత బొట్టుతో నిండుగా నునుపెక్కిన చెక్కిళ్ళతో గర్భిణి గౌరి, ఛామనఛాయగా ఎత్తుగా, బలంగా ఉన్న శోభ సిగ్గుతో "దండాలమ్మా" అన్నారు.



వాళ్ల అక్కాచెల్లెళ్ళ ప్రేమానురాగాలకు, ఆప్యాయతలకు మురిసిపోయింది గిరిజ. "అమ్మా నువ్విచ్చిన పైసలతో మా చిన్న చెల్లెకు చీర కొన్నాను. మేమందరం కలిసి మాంచి దావత్ చేసుకొన్నాం. స్వీట్లు చేసుకొని తిన్నాం. ఇగో ఈ సాయంత్రమే వెళ్తారంట. రెండు రోజులు ఉండమన్నా ఉండరట" అంది ఫిర్యాదుగా భాగ్య. "పోనీలేవే! వాళ్ల పనులేవో వాళ్లకుంటాయి. ఏదో మధ్య మధ్యలో ఆటవిడుపుగా ఇలా కలుసుకోవడం అందరికీ సంతోషమేగా" అంది నవ్వుతూ గిరిజ. "ఔ అమ్మా! మేమంతా కల్సుకొంటే మాకు టైమే తెలియదు. వస్తానమ్మ. వీళ్లను బస్సు ఎక్కించి రేపు పనికి వస్తా" అంటూ చెల్లెళ్ళను తీసుకొని నిష్క్రమించింది భాగ్య. తోబుట్టుల నడుమ అరమరికలు, భేషజాలు లేని స్వచ్ఛమైన ప్రేమ అనుకొంది గిరిజ. అలా అనుకొంటుండగా ఆ రోజు జరిగిన సంభాషణ గుర్తొచ్చి మనస్సు చివుక్కుమని పించింది గిరిజకు.

◆◆◆

తమ్ముడి కుంటుంబంతో పాటు తల్లిగారింట్లో అడుగు పెట్టిన గిరిజను వెంటనే రమ్య "వదినా, నాకు తల తిరుగుతుంది వెంటనే ఓ గ్లాసుడు చల్లని నీళ్లలో ఓ నిమ్మకాయ పిండి తీసుకురారు ప్లీజ్" అంది హడావిడిగా, మూడేళ్ల చిన్నారి ఇందు కలివిడిగా పిల్లలతో ఇల్లంతా తిరగసాగింది. నీళ్లు తాగి స్థిమిత పడ్డాక తమ అమెరికా అనుభవాలను, అక్కడి విలాసవంతమైన జీవితాన్ని, శుభ్రమైన వాతావరణాన్ని ఎంతో సంబరంగా వివరించసాగింది రమ్య. రెండు రోజులయ్యాక ఓ రోజు షాపింగ్‌కి వెళ్లి వచ్చిన రమ్య "మీరింకా ఉన్నారా? వదినా, నేను వచ్చేసరికి మీరు వెళ్లిపోయారనుకున్నా. అరరే మీకని కొన్న బ్యాంగిల్స్ అక్కడే మర్చిపోయా, సారీ వదినా!" అంది షికాయతుగా రమ్య. అభిమానం, ఆత్మగౌరవం తన్నుకొచ్చాయి గిరిజకు. ఇంక అక్కడ వారితో ఉండటం ఏ మాత్రం సమంజసంగా అన్పించలేదు. అందుకే పిల్లలకు పరీక్షలు, తనకు అర్జంటు ఇన్స్‌పెక్షన్ ఉందంటూ బయలుదేరదీసింది.

◆◆◆

తన తమ్ముడు ఇష్టపడి చేసుకున్న రమ్య వాళ్లది మొదట్లో ఏమంత కలిగిన కుటుంబం కాదు. రమ్య, సారథిని వివాహం చేసుకున్నాక వాళ్లింటో వెలసిన ఖరీదైన సామాను, ఫర్నీచర్ అన్నీ సారథి చలవేనని గ్రహించి, మిన్నకుండి పోయారు గిరిజ తల్లితండ్రులు. అలాంటి రమ్య అమెరికా వెళ్లి చాలానే మారింది. మార్పు మంచికి ఐతే ప్రగతి సాధ్యం. కాని లేని పోని భేషజాలతో, కుహనా సంస్కారంతో, తాను వచ్చిన స్థానాన్ని మర్చి, డబ్బుంటే చాలునని, డబ్బుతో ఏవైనా కొనవచ్చుననే దురహంకారపరురాలిగా ఎదిగితే, వారు ఒంటిపిల్లి రాకాసి బతుకు బతకాల్సిందే. యాంత్రిక జీవనంలో పడి, అనుబంధాల్ని మర్చిపోతున్నారు. నేటితరం వారు, అనుకొని దీర్ఘంగా నిట్టూర్చింది గిరిజ. ఆమె మనస్సంతా అంతు తెలియని అశాంతితో రగిలిపోసాగింది.

◆◆◆

ఆ రోజు ఉదయం ఐదుగంటలకే కాలింగ్ బెల్ మోగడంతో కళ్లు నులుముకుంటూ వెళ్లి తలుపుతీసింది గిరిజ ఎదురుగా భాగ్య "అమ్మా, ఈ రోజు మీ తమ్ముడు వాళ్లు వస్తానన్నారుగా తొందరగా పనికి రమ్మన్నారని జెల్ది అచ్చిన. గబగబా పని చూసుకొని వెళ్లాలి సాయంత్రం మా నాయినకు ఆపరేషన్ ఉంది. పని చేస్తుంటే తొడలో కర్రపేడు గుచ్చుకొంది. జెర మూడు రోజులు పనికి రాలేనమ్మా" అంది సంజాయిషిగా. "సర్లేవే!" అంది గిరిజ. ఇంక తానేం చెప్పినా విన్పించుకునే పరిస్థితుల్లో భాగ్య ఉండదని తెల్సు.

◆◆◆

సాయంత్రం ఆరవుతుందనగా వచ్చారు సారథీ

దంపతులు. ఇందు బోడి గుండుతో మరింత ముద్దొస్తుంది. పసుపురంగు ఖరీదైన బుట్ట చేతుల ఫ్రాక్‌లో మెరిసిపోసాగింది. "అత్తా!" మెడ చుట్టూ చేతులు వేసింది. చంటిదాన్ని ప్రేమగా అక్కున చేర్చుకుంది గిరిజ. ఉభయ కుశలోపరులయ్యాక,"సౌమ్య! అందరికీ చల్లగా పైనాపిల్ జ్యూస్ ఇవ్వమ్మా" అంది గిరిజ. ఫ్రిజ్‌లో అంతకు ముందే తీసిపెట్టిన జ్యూస్ గ్లాసులలో పోసి ఇచ్చింది సౌమ్య. "వదినా, నీళ్లు ఏవి కలిపారు?" అంది రమ్య. "మున్సిపల్ వాటర్ ఫిల్టర్ చేశాంగా" అంది గిరిజ మనసులో బెదురుతూ. "అదికాదు. చంటి దానికి ఆ నీళ్ళు, ఈ నీళ్ళు తాగితే విరేచనాలు అవుతాయి. ఎంతైనా అక్కడే పుట్టి, పెరిగిన పాపాయి కదా. మీరు ఏదైనా మంచి మినరల్ వాటర్ బాటిల్స్ తెప్పించండి" అంది ఒకింత విసుగ్గా. ఏమనలేక తలాడించింది గిరిజ. రాత్రిపూట భోజనాలయ్యాక తమ బెడ్‌రూంలో పడుకోమ్మని సూచించింది గిరిజ. "పక్కలవీ దులిపి కొత్త బెడ్‌షీట్ వేసాను. మీరు, ఇందు హాయిగా నిద్రపొండి." అంది గిరిజ. సరేనంటూ పాపను తీసికొని లోపలికి వెళ్లిన రమ్య "మైగాడ్" అంటూ ఆశ్చర్యపోయింది. "ఏమైందమ్మ" అంటూ కంగారుగా అడిగింది గిరిజ. "అది కాదు వదినా, మీవి దూది పరుపులు ఇవి ఉండలు, ఉండలుగా ఉంటాయి. మాకు అలవాటు లేదు. పైగా కొత్త దుప్పటి గరుకుగా ఉండి. చంటిదానికి రాషెష్ వస్తే కష్టం అందుకని ఇవన్నీ తీయించి మెత్తని రజాయిలపైన ఉతికిన పాత దుప్పట్లు పరవండి" అంది. అలాగే నంటూ పక్కలు సర్దడానికి నడుం బిగించింది గిరిజ.



◆◆◆

తెల్లవారి ఏడు కావస్తుంది పిల్లలిదరూ బిక్కమొహాలేసుకొని గదితలుపులవైపు చూస్తున్నారు. తమ బ్యాగు, బట్టలు అన్నీ ఆ రూంలోనే ఉన్నాయి. మామయ్య వాళ్లు ఎప్పుడు లేస్తారా. ఎప్పుడు తలుపు తీస్తారా అని ఆత్రంతో చూస్తున్నారు. చూసి చూసి ఏడున్నరకు మోహన్, సారథికి మిస్‌కాల్ ఇచ్చాడు. మరో ఐదు నిముషాలకు రమ్య డోర్ ఓపెన్ చేసి, "నెమ్మదిగా పని చేసుకోండి. చంటిది రాత్రంతా ఒకటే పొర్లుడు. ఏ.సి.లేదుగా. తెల్లారు జామున పడుకుంది. కిటికి కర్టెన్లు జరుపకండి. అలికిడైతే నిద్ర మధ్యలో ఏడుస్తుంది. అంది రమ్య హెచ్చరిస్తూ, పిల్లలిద్దరూ బుద్ధిగా తలాడించి తమ బ్యాగులను బయటపెట్టుకున్నారు. బట్టలు తీసుకొని సాగనంపింది. బై అంటూ చేయి ఊపి వెళ్లిపోయారు. మరో గంటలో మోహన్ కూడా రెడీ అయి వెళ్లబోతూ, "గిరజా! ఈ రోజు మీ తమ్ముడి వాళ్లను షాపింగుకని తీసుకు వెళ్తానన్నావుగా. ఇంద ఈ ఐదు వేలుంచు" అన్నాడు మోహన్. "సరిపోవండి ఎంత లేదన్నా ఇందుకు, రమ్యకు ఖరీదైన బట్టలే పెట్టాలి. మా తమ్ముడు కాబట్టి సారథిని ఎలాగోలా అడ్జెస్ట్ చేయ్యొచ్చు". అంది నసుగుతూ గిరిజ. "సరే మరో ఐదువేలు ఇస్తున్నా. ఇంతలో సరిపుచ్చు" అంటూ మరో ఐదు వేలు చేతిలో పెట్టాడు మోహన్. మధ్యాహ్నం భోజనాలయ్యాక అందరూ షాపింగుకని దగ్గర్లోని ఓ పెద్ద బట్టల కొట్టుకు వెళ్ళారు. అన్నీ నాసిరకమైనవేనంటూ రమ్య ఏరీ ఏరీ నెవలికన్ను రంగు గళ్ళున్న పట్టుచీర తీసుకుంది. ధరచూస్తే ఏడువేలు. గుండె గతుక్కుమంది గిరిజకు. మరో మూడువేలు పెట్టి పాపకు టమాట పండు రంగు కుచ్చుల ఫ్రాక్ కొన్నది. మరో నాలుగు వేలతో సారథికి ప్యాంట్. షర్ట్ కొనిచ్చింది గిరిజ. మోహన్‌కు తెలియకుండా ఎందుకైనా మంచిదని తన జమ చేసిన ఐదువేలు వెంట తెచ్చుకుంది. బతుకుజీవుడా అంటూ బట్టల కొట్టులోంచి బయటపడింది గిరిజ. "రేపు సాయంత్రం బస్ రిజర్వేషన్ చేయించుకున్నాం వదినా, వెళ్తాం! రేపు ఆదివారం ఎలాగూ మీకొక సెలవు మిగులుతుంది, మా కొరకై బాగా శ్రమ పడ్డారు ఎంతైనా పాపం!" అంది కాస్త ఎత్తిపొడుపుగా రమ్య. ఏమీ అనలేక మౌనంగా నవ్వి ఊరుకుంది గిరిజ. అన్నట్టుగానే ఆదివారం సాయంత్రం సారథి దంపతులు వెళ్లిపోయారు. ఒక్క పూటకైనా చంటిది లేకపోవటంతో ఇల్లంతా బోసిపోయినట్టైంది గిరిజకు. "అత్తకు బై చెప్పు" అని రమ్య అంటుంటే నవ్వుతూ "బై బై అత్తా" అంది. బస్ కనుమరుగయ్యేంత వరకు చేయి ఊపుతూనే ఉంది గిరిజ.

◆◆◆

"ఏమిటోయ్ అలా డీలా పడిపోయావు. ఎంతైనా వాళ్లు కొల్లేటి కొంగల్లా వలస పక్షులే! ఎప్పుడో ఏడాది కో, రెండేళ్లకో ఇలా వచ్చి అలా వెళ్తారు. ఉన్నన్నీ రోజులు సందడి. ఆ తర్వాత మనకు మామూలే. వాళ్లకూ షరామామూలేగా కదుటోయ్. ఐనా ఈ సారి వచ్చినపుడు సారథిలో కూడా మార్పు చోటుచేసుకుంది. ఎంతసేపూ తన భార్యా బిడ్డల గురించే తప్ప, మీ అమ్మా నాన్నల గురించిగానీ, తోబుట్టువుల గురించిగాని చింతించిన పాపాన పోడు గదా!" నీవేమో అందరూ నావాళ్లే అనుకొనే పిచ్చిమేళానివి, బంధాలు, బంధుత్వాలు అంటూ లెక్కరిస్తావు. అయ్యిందా అమ్మగారి తమ్ముని గారాబం" అన్నాడు వెటకారంగా మోహన్. ఇన్నాళ్లు అణచిపెట్టుకున్న బాధ అంతా లావాలా ఉవ్వెత్తున ఎగసిపడుతుంటే కళ్ళ నిండా నీళ్లతో ఉక్రోషంతో చూసింది

## కవిత

### కొత్త పొద్దు

కె.విల్సన్ రావు
8985435515



ప్రాధేయ పడటమెరుగని
ప్రభాత కిరణమొకటి
నా నుదుటిని ముద్దాడి
చైతన్యమై జీవన నాళికైంది
అరుణారుణ మహోదయమైంది.

అహమంటే ఎరుగని
వాసంత సమీరమొకటి
నా మేనుని స్పృశించి
సమదర్శన కావ్యమై
మానవ వికాస చరిత్రకు
నాందీ వాచకమైంది.

నిత్య సంచలన పరిమళ
రాగమొకటి తీగ సాగి
నా మనసు వాకిలి తాకి
ఘనీభవించిన కాలానికి
అనిర్వచనీయ వాసనలద్ది
అనంత శూన్యానికి
ఆకుపచ్చ వర్తమానమైంది.

వర్ణ శాసనాలెరుగని పంచభూతాలు
గాయపడ్డ గేయాలై ప్రాణశక్తి నుండి
పెల్లుబికిన పరిష్కారగీతాలై నా ఒడిలో
తత్వ గీతాలు పాడుకుంటూ
కొత్త పొద్దును వాగ్దానం చేస్తున్నాయి.

---

గిరిజ, మోహన్ వైపు. ఆమె మోహం ఆవేశంతో ఎర్రబడింది. కళ్లలో నెత్తుటి జీరలు. "అనండీ! అనండి మీకు నేనేగా చులకనగా దొరికింది. నేను చేసిన తప్పేమిటీ? బంధాలు కనుమరుగయిపోతున్నాయి. మనిషి సంఘజీవి అంటాం కదండి. అలాంటిది సంఘంలో మనిషి మనగడకై అతను తనకో తోడూనీడా, కుటుంబం అంటూ ఉండాలి. తన బాధా, సంతోషాన్ని పంచుకునేందుకు అయిన వాళ్లే కదా ముందుకొచ్చేది. మరీ మనషుల మధ్య స్వచ్ఛమైన ప్రేమానురాగాల స్థానంలో ఆర్థిక సంబంధాలు బలపడి, మీయింటి కోస్తే ఏం పెట్టావు, మా యింటి కొస్తే ఏం తెచ్చావు అన్నట్లుగా తయారైంది వ్యవహారం. నేను అనుకున్నాను సారథి వాళ్ళ గిఫ్ట్స్ చూడగానే మీరు మొహం అలా గంటుగా పెట్టుకున్నారెందుకో అని, వాళ్లకు తోచినవేవో వాళ్లు తెచ్చారు. మనకున్నదానికన్నా ఎక్కువే కానుకల రూపంలో ముట్ట జెప్పినందుకు నేనేం బాధ పడటం లేదండీ. కొన్నాళ్లు పోయాక ఆ చంటిది మన రిలేషన్‌షిప్‌ని మర్చిపోతే ఎలా అన్నదే నా బాధ అంతా. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఒకరికొకరు సహాయం చేసుకుంటూ సమిష్టి జీవనాన్ని సంతృప్తిగా జీవించారు. కుటుంబాల్లో అపార్థాలు, కలహాలు, చిన్నా, చితకా పొరపొచ్చాలున్నా, అవన్నీ జయించే పెద్దవారి మాటమీద గౌరవం, కలివిడితనం, కలిసి ఉండటంలో సర్దుబాటు ధోరణులు ప్రదర్శించేవారు. పిన్ని, పెద్దమ్మ, బాబాయి, పెదనాన్న, నాన్నమ్మ, తాత అంటూ వారి బంధుత్వానికో గుర్తింపు ఉండేది. ఈ కాలం పిల్లలకు అత్త, మామ, వదిన, బావ అంటూ వరుసలను నేర్పించి, వ్యక్తులను చూపించి మరీ బంధుత్వాన్ని పరిచయం చేసుకోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడింది. సారథి గనుక అక్కడే సెటిల్ ఐతే జరిగేది అంతే కదా" గిరిజ గొంతులో ఆవేదన, కళ్లు తుడుచుకొని కోనసాగించిందామె, మన పనమ్మాయి భాగ్య మనకంటే ఎంతో నయం. దాని తోబుట్టువులతో ఎలాంటి అరమరికలు లేకుండా స్వచ్ఛంగా నవ్వుతూ, ఆనందంగా వారిని ఆదరిస్తుంది. తనకున్న దాంట్లో అప్పో, సప్పో చేసి పెడుతుంది. వాళ్ల తండ్రికి ముగ్గురు ఆడపిల్లలే కాబట్టి ఇంటికి పెద్దదానిగా తండ్రి బాధ్యతను పంచుకుంది. బంధాన్ని తెంచేసుకోవడం ఎంత సులభమో, వాటిని కాపాడుకోవటం అంత కష్టం. అందరూ ఇలాగే మెటిరియలిస్టిక్‌గా ఆలోచిస్తే అందమైన బంధుత్వాలు బీటలువారతాయి. కేవలం సినిమాల్లోనే ఉమ్మడి కుటుంబాలను చూసి ఆనందించే రోజులు వచ్చాయి. ఎవరు ఏమన్నా అనుకోనీ, నావరకు నేను బంధాల్ని కాపాడుకునేందుకై ప్రయత్నిస్తూనే ఉంటా. నెమ్మదిగా వాళ్లే అర్థం చేసుకుంటారని ఆశిస్తా" నంటూ ఆత్మవిశ్వాసంతో చెబుతున్న గిరిజను చూసి కళ్ళు చమర్చాయి మోహన్‌కు. పెళ్ళి కాగానే వేరు కాపురం పెట్టించే ఈ రోజుల్లో తనకు తల్లీ తండ్రీ లేకున్నా ఉన్న ఒక్క అక్కతో ఐనా ఎంతకు అంతే ముక్తసరిగా ఉండే మోహన్ కళ్ళు తెరుచుకున్నాయి. గిరిజ మాటలతో. తన పిల్లల మధ్య ఇలాంటి అంతరాలు తలెత్తకుండా ఉండాలంటే తాము కూడా బలమైన సామాజిక సంబంధాల్ని, బంధుత్వాలను నిర్మించుకునేందుకు మార్గ దర్శకులుగా ఉండాల్సిన నిజం బోధపడింది మోహన్ కు. గిరిజ చేతిని ఆప్యాయంగా తన చేతిలోకి తీసుకొన్నాడు మోహన్. కళ్ళతోనే భరోసానిస్తూ, ఆమె వైపు చూసి చిర్నవ్వు నవ్వాడు.

**కవిత**

## తప్పు వాళ్ళది కాదు


-ఎస్.ఎస్.బి. గేరా
9492922492




ఇలా అంటున్నందుకు
నొచ్చుకుంటారో, పిచ్చోడనుకొంటారో
మీ ఇష్టం!
నేననేదేంటంటే
సరిగ్గా ఆ సమయంలో
వాళ్ళతో పాటు
ఓ కుక్క గూడా ఉందనుకొందాం
కొట్టుకుపోయుండేదా?!
చచ్చిపోయుండేదా?!
నో!
ఖచ్చితంగా ఒడ్డుకు చేరేది
మారానదిని దాటే
సెరంగెటీ అడవిగొడ్లను చూశారుగా
ఉధృతంగా ఉరికే వరదనీరు,
నీళ్ళలో మోహరించే మొసళ్ళు,
అయినా, మందలు మందలుగా
ముందుకు దూకుతూ
అదే తెంపు, అదే తెగింపు!
అంతెందుకు,
ఇదేస్థితిలో పల్లెటూరి పిల్లలుండుంటే
ఇంత దారుణం జరిగేదా?!
అధికార్ల నిర్లక్ష్యం, హెచ్చరికల్లేకపోవడం
నదినిండా బండరాళ్ళు, ఐసులాంటి నీళ్ళు
అన్నీ పక్కనపెట్టండి
కాలేజీ గేటు దాటినా,
ఇంటి గడప దాటినా
జలపాతంలా దూకుతూ
సెలయేరుల్లా దూసుకుపోయే వయసోళ్ళు
గేట్లెత్తిన నదిని దాటలేకపోయారంటే
మూడడుగుల దూరం దూకలేక పోయారంటే
ప్రమాదాన్ని పసికట్టలేదంటే
ప్రవాహాన్ని లెక్కగట్టలేకపోయారంటే
ఇక్కడే ఉంది లోపం
ఫేసు బుక్కులోకి దూకి,
ఇంటర్‌నెట్లో ఈది,
ఎస్సెమ్మెస్‌లై తేలి
ఇయర్‌ఫోన్లతో హోరెత్తిపోతూ
ప్రపంచాన్ని చిటెకెలో చుట్టే
మన బంగారాలు
ప్రకృతి ముందు బొక్కబోర్లా పడ్డారు
ర్యాంకుల చదువుల్లో
రాటుదేలిన పోటుగాళ్ళు
రాళ్లల్లో నడవలేక పోయారు
వీడియో గేముల్లో ఇరగదీసేసే
మన వీరులు
వొడ్డుకు చేరుకోలేక పోయారు
తప్పు వాళ్ళది కాదు
సింధూ లోయ నుండి కులూ దాకా
సాగిన సుదీర్ఘ ప్రయాణంలో
సహజాతాలుగా తరతరాలకూ
అందాల్సిన
జీవ నైపుణ్యాలెక్కడో జారిపోయాయి
బుద్ధిజీవులమనే సొంత కిరీటాలతో
జీవావరణం నుండి
మనల్ని మనం వెలేసుకొంటూ
క్రమక్రమంగా ప్రకృతినుండి విడిపోతూ
పాతాళానికి పడిపోతూ...
తప్పు మనదే!!!


ప్రస్థానం వెబ్‌సైట్: www.prasthanam.com

**'ప్రస్థానం' కు చందా కట్టండి!**

**నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!**

అయిదేళ్లకు : రు. 500 /-, పదేళ్లకు : రు. 1000/-,
సంవత్సర చందా (వ్యక్తులకు) : రు. 120/-,
సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-
విడి ప్రతి : రు. 10/-



5,10 సం॥ల చందా కట్టిన వారికి సుమారు 1000/-లు విలువ చేసే పాత ప్రస్థానం పుస్తకాలు ఉచితం.
■ ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు అదనం

ఒక మంచి పత్రికకు చందా కట్టండి! - తెలుగు సాహిత్య కృషిని ప్రోత్సహించండి!!

ప్రస్థానం

ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20
వివరాలకు : 040-27660013, సెల్: 9490099059 ; ఇ.మెయిల్ : ssprasthanam_@gmail.com ; www. prasthanam.com

# స్వీకారం

## సాహితీ స్పర్శ




వ్యాస సంపుటి

**- డా॥ నాగసూరి వేణుగోపాల్**

**వెల : రూ.40/- పేజీలు : 160**

ప్రతులకు : 09440732392

'సాహితీ స్పర్శ'లో పాతిక వ్యాసాలున్నాయి. ఒక్క విషయం మాత్రం చెప్పగలను. వీటిల్లో వైవిధ్యం పుష్కలంగా ఉంది. 2008 జనవరి నుంచి 2013 జూలై దాకా రాసిన వ్యాసాలు నిడివి మూడు పేజీల నుంచి 20 పేజీల దాకా ఉంది. అన్ని వ్యాసాలు సాహితీ స్పర్శతో రాసినా, వీటిల్లో విషయం సాహిత్యం, భాష, జర్నలిజం, సైన్స్, సినిమా, సామాజికం, పర్యావరణం వంటి వాటిని స్పృశిస్తోంది.

**- డా॥ నాగసూరి వేణుగోపాల్**

## దొమ్మరుల చరిత్ర - సంస్కృతి




- డా॥ డి.కె. ప్రభాకర్

**వెల : రూ.200/- పేజీలు : 279**

ప్రతులకు : 09880613378

ఆకలికి ప్రాణం పణంగా పెట్టి దొమ్మరాటలాడే స్త్రీ పురుషుల నైపుణ్యం శ్లాఘ్యంగా వున్నా, పొంచి ఉన్న ప్రమాదాలు దినగండం నూరేళ్ళ ఆయుష్షుగా కనిపిస్తుంటే భయకంపితులౌతారు. ఈ పరిశోధన గ్రంథం చదివిన పాఠకులు. జనం పట్టించుకోని దొమ్మరుల జాతి, భాష, సంస్కృతి, జీవన విధానం కళ్ళకు కట్టినట్లు చూపించాడు డా॥ ప్రభాకర్.

**- ఆచార్య కొలకలూరి ఇనాక్**

## సాహితీ చైత్రరథం




- డా॥ జి.వి. కృష్ణరావు సాహిత్య సమాలోచన

**వెల : 250/- పేజీలు : 400**

ప్రతులకు : ప్రముఖ పుస్తకాల షాపులు

ఈ గ్రంథంలో కృష్ణరావుగారిని బాగా ఎరిగిన మిత్రులు, అభిమానులు, సాహితీవేత్తలు, మేధావులు వంటివారు ముప్పయి మంది దాకా జివికె సాహిత్యం గురించి, ఆలోచనల గురించి వ్యక్తిత్వం గురించి మన ముందుంచారు.

**- డా. నాగసూరి వేణుగోపాల్**

## ఆవిష్కర్తలు




**(వినుకొండ కవిత్రయం సంక్షిప్త చరిత్ర)**

**- డా॥ వంకాయలపాటి రామకృష్ణ**

**వెల : రూ.40/- పేజీలు : 44**

ప్రతులకు : 8897822469

'ఆవిష్కర్తలు' అనే ఈ పుస్తకం ముగ్గురికీ న్యాయం చేసే విధంగా డా॥ వంకాయలపాటి రామకృష్ణ రాయడం ప్రశంసనీయం. వారి వారి జీవిత విశేషాలు, కవితారీతులు రెండింటినీ సమగ్రంగా వివరించారు. అంతేకాక, ఎవరి గురించి ఏ ప్రధానాంశాలు చెప్పాలో, ఏ భావధారలకు వారు ప్రాతినిధ్యం వహిస్తున్నారో సరైన ఉదాహరణల ద్వారా నిరూపించారు.

**- డా॥ అద్దేపల్లి రామమోహనరావు**

## రెక్కల్లో గీతామృతం




రెక్కలు

**- డా॥ కేతవరపు రాజ్యశ్రీ**

**వెల : రూ.101/- పేజీలు : 73**

ప్రతులకు : 8500121996

పద్యంలో ఉన్నా, గేయంలో ఉన్నా, వచనంలో ఉన్నా కవిత్వం కవిత్వమే. కవిత్వం ఆస్వాదయోగ్యమైంది కావాలి. అంతశ్చేతనకు కారణమైంది కావాలి. ఇక్కడ వస్తువు సనాతనమైంది. ప్రక్రియ ఆధునికమైంది. రాజ్యశ్రీ సమర్థవంతంగా గీతామృతాన్ని అనువదించారు. అదీ సుందరంగా, శుభంకరంగా, సుకుమారంగా, సహృదయవేద్యంగా.

**- ఆచార్య మసన చెన్నప్ప**

## శిథిలచిత్రాల జాతర




కవిత్వం

**- తేళ్ళపురి సుధీర్‌కుమార్**

**వెల : రూ.80/- పేజీలు : 106**

ప్రతులకు :9885632727

'శరీరానికి గాయమైతే/ నెత్తుటి ధారలు ఎలా వస్తాయో/ గాయపడిన మనసు నుండి/ కవితలూ అలాగే పుడతాయి." వేదనలో నుంచే కవిత్వం పుడుతుందనే సార్వజనీన సత్యాన్ని పై పంక్తుల్లో పొందుపరిచాడు సుధీర్ కుమార్. మరొక కవిత పేరు "మౌనభాష్యం'. ఎనిమిది చిన్న చిన్న పంక్తుల్లో ఈ కవి మౌనాన్ని బహుముఖీనంగా చిత్రించాడు. "మౌనం నా నేస్తం" అని మొదలైన ఈ కవిత "మౌనమే నేను" అనే పంక్తితో ముగుస్తుంది. ఈ లఘు కవితలోని భావ వైవిధ్యం గణనీయంగా ఉంది.

**- డా. సి. నారాయణ రెడ్డి**

# స్వీకారం

## తెల్లారితే...(కవిత్వం)




**– కె. విల్సన్‌రావు, కె. ఆంజనేయకుమార్**

సంపాదకులు: కె. సత్యరంజన్

**వెల : రూ. 75/–పేజీలు :120**

ప్రతులకు : **8297285514**

జూన్ 2 అనే చారిత్రక దినానికి సాక్షులుగా మేం కవిత్వాన్ని వెలువరిస్తున్నాం. తెలుగు ప్రజల పక్షాన మేం కవిత్వం ద్వారా నిలబడాలనుకున్నాం. రెండు ప్రాంతాల ప్రజలు చేసిన పోరాటాల పక్షాన వారి న్యాయమైన ఆకాంక్షల పట్ల గౌరవాన్ని కలిగి ఉంటూనే మా లోపల కొనసాగుతున్న అలజడికి ఓ వ్యక్తీకరణగా జూన్ 2ను ఎంచుకున్నాం.

**- కె. విల్సన్‌రావు**

**- కె. ఆంజనేయకుమార్**

## పొరుగు తెలుగు బతుకులు




వ్యాస సంకలనం

**– డా॥ రాయదుర్గం విజయలక్ష్మి**

**వెల : రూ. 80/– పేజీలు : 111**

ప్రతులకు : ప్రముఖ షాపులు

ఈ పుస్తకాలు పరిశీలిస్తే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల్లో వుండే తెలుగువారు నిలువుటద్దంలో మాదిరి కనబడుతారు. భాషల సంగమ ప్రాంతాల్లో వుండేవారు అత్యంత ప్రతిభావంతులుగా వుంటారనీ, గొప్ప సహనం, సమన్వయంతో పనిచేస్తారనీ చాలాకాలంగా భావిస్తున్నారు. ఇలా ఈ పుస్తకాల్లో సుమారు 200 కథలూ–అందులో 20 తమిళం, 10 కన్నడం అనువాదాలతో కలిసి – మూడు పాతికల దాకా కథకులూ, అనువాదకులూ కనబడతారు.

**- నాగసూరి వేణుగోపాల్**

## ముజఫర్‌నగర్ మారణకాండ




నిషిద్ధ మేఘాల్లోకి మా యాత్ర

**– అనిశెట్టి రజిత, భండారు విజయ**

**వెల : రూ. 50/– పేజీలు : 64**

ప్రతులకు : **9849482462**

2013 ఆగస్టులో ప్రారంభమై నెలలపాటు సాగిన ముజఫర్‌నగర్ నరమేధం కారణంగా ఇళ్ళూ వాకిళ్ళూ, తల్లీతోడు, బిడ్డాపాప, గొడ్డుగోదా సర్వం కోల్పోయి ఊరికీ, వాడకూ పరాయీకరింపబడి స్వస్థానాలలో శరణార్థులై సహాయ శిబిరాలలో తలదాచుకొన్న వేలాది మంది ముస్లిముల జీవనదైన్యాన్ని స్పృశించి వచ్చిన వాళ్ళు. మతదురహంకారపు పెనుగాలుల్లో కన్నీటి ఉప్పు సముద్రాలై కల్లోమైన వారి జీవిత వేదనను ఈ నివేదిక రూపంలో మనముందుంచారు రజిత, విజయ.

**- కాత్యాయనీ విద్మహే**

## ఆధునిక సాహిత్యంలో వృత్తి చైతన్యం




వ్యాస సంపుటి

**– డా॥ లంకా వెంకటేశ్వర్లు**

**వెల : రూ. 150/– పేజీలు : 240**

ప్రతులకు : **040–27678430**

ఇంగ్లీషువారు వచ్చిన తర్వాత గ్రామీణ వ్యవస్థ చిందరవందర అయింది. వృత్తి కులాలన్నీ విధ్వంసం కావడం ప్రారంభమైంది. ప్రపంచీకరణలో అదివరకెప్పుడూ లేనంతగా కులవృత్తుల నాశనం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ప్రాచీన కులవృత్తి వివరాలన్నీ చూస్తే, పరిణామ చరిత్ర బాగా అవగాహన చేసుకోగలం. నిజానికి పై సూత్రీకరణయే ఈ పరిశోధన మొత్తానికి ఏకసూత్రంగా నిలిచే అంశం.

**- డా॥ అద్దేపల్లి రామమోహనరావు**

## బాలల గేయాలు




సంకలనం: దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్

**వెల : రూ. 11/– పేజీలు : 22**

ప్రతులకు : **0866–2862424**

తెలుగు పద్యంలో ఇంతటి దివ్యశక్తి దాగి ఉంది. పిల్లల్ని ఆలోచింపజేసే, ప్రశ్నించే, ఆకర్షించే, ఉర్రూతలూపే సూక్తులు, సామెతలు, పొడుపుకథల్ని కూడా ఇందులో పొందుపరిచాం. పిల్లలకు మిఠాయిపొట్లం ఈ పుస్తకం.

**- జయశ్రీ దేవినేని**

## దేవుడు చనిపోయిన టీ టేబుల్




కవిత్వం

**– బి.ఎస్.ఎం.కుమార్**

**వెల : రూ. 100/– పేజీలు : 170**

ప్రతులకు : **975085143**

ఈ కవిది ఒక అసాధారణమైన మార్గం. ఈ వరకే తెలుగు సాహిత్యంలో వచ్చిన 'మో' లాంటి అనేకమంది కవులకంటే కూడా విభిన్న కవిత్వం. ఈ కవి ఇంకా రాస్తూనే ఉండాలి. రాస్తూ రాస్తూ అతని దుఃఖపు రవ్వల జడిలోని కాంతితో సమాజాన్ని తడుపుతూనే ఉండాలి.

**- డా॥ కాంచనపల్లి**

# స్వీకారం

## బతుకు పాఠం




కవిత్వం

- సిద్దెంకి యాదగిరి

వెల : రూ.80/- పేజీలు : 136

ప్రతులకు : 9441244773

అన్ని చలనాల చైతన్యం పొదుగుకున్న కవి సిద్దెంకి యాదగిరి. రాబోయే కాలంలో మరింత బాధ్యతగా, మరింత శక్తివంతంగా అక్షరాలు సంధించగలడని సంపూర్ణ విశ్వాసం కలిగిస్తున్నడు. మానవ వనంలో అలజడి దర్శించడం తెలుసు. ఒత్తిడిని తట్టుకొని అవమానాల్ని గెలవగల స్థిర సంకల్పం తెలుసు. రాలిన తారల కాంతితో, వేల ఇంద్రధనుస్సులు వెలిగించే ఉద్యమం గుర్తు. అక్షర కణాల్ని పిడికిట్లో బంధించి భూమ్మీద వెదజల్లే కవిత్వం గుర్తు.

- నందిని సిధారెడ్డి

## సముద్రమంత... చెమట చుక్క




కవిత్వం

- మొయిద శ్రీనివాసరావు

వెల : రూ.50/- పేజీలు : 95

ప్రతులకు : 9908256267

ఏ ముందిందులో అనిపించే కవిత్వం ఎందరో రాస్తుంటారు. ఏదో... వుందిందులో... అని ఆలోచింపజేసే కవిత్వం రాయగలిగేది మాత్రం కొందరే. ఆ కొందరిలో ఈ కవి చోటు చేసుకోగలడనిపిస్తుంది ఈ కవితలు చదివితే. అందరూ చూడలేని భిన్న కోణాలను తాను దర్శించి మనముందు ప్రత్యేకంగా నిలుస్తాడీ కవి.

- గంటేడ గౌరునాయుడు

## ఋతు ఘోష




పద్య కావ్యం

- శేషేంద్ర

వెల : రూ.100/- పేజీలు : 108

ప్రతులకు : 7702964402

ఎంత ప్రాచీన భాషలోనైనా ఎంత ప్రాచీన ఛందస్సులోనైనా అత్యంత ఆధునికతని అత్యంత నవ్యమైన సృజన శక్తిని కవి చూపవచ్చు అని చెప్పడానికి ఋతు ఘోష కావ్యం మంచి ఉదాహరణ. నేటికవులు దీన్ని చదవాలి. శ్రద్ధగా చదవాలి.

- ఆచార్య పులికొండ సుబ్బాచారి

## రుంజ




విశ్వకర్మ కవుల కవిత్వం -1

సంపాదకీయం: జ్వలిత,

దాసోజు కృష్ణమాచారి

వెల : రూ.150/- పేజీలు : 111

ప్రతులకు : 9989198943

ఈ పుస్తకంలో 70 కవితలున్నాయి. ఈ కవితల్లో కుల అస్తిత్వాన్ని గురించి ఎక్కువ ఉన్నాయి. తెలంగాణ గురించి కొన్ని కవితలు, స్త్రీవాదం గురించి కొన్ని ఉన్నాయి. చాలా రకాలు ఉన్నాయి. అయితే కవిత్వంలోని సాంద్రత, శిల్పం, శైలి గురించి నేను చర్చించను. ఎందుకంటే నేను మంత్రసాని పని చేశాను. ప్రాణం నిలబడితే చాలు, శిశువు రంగు లింగం వికలాంగమా సకలాంగమా ఆలోచించను. ఒక ప్రాణి నిలబడితే తరువాత ఆ ప్రాణి ఏ పని చేస్తుందో ఆలోచించవచ్చు అనుకున్నాను.

- జ్వలిత

## విషాద వర్ణం




కవితా సంపుటి

- సలీం

వెల : రూ.50/- పేజీలు : 94

ప్రతులకు : ప్రముఖ పుస్తకాల షాపుల్లో

ఆకాశం నిలువెత్తు వోనంగాక/ మరేమిటి?/ నెత్తిమీద నీలి గుడారంలా బడాయి/ తీరా తాకి చూస్తే/ వేళ్ళకంటుకునే/ అనంత శూన్యం/ చంద్రుడూ అంతే/ పండిన మామిడి పండులా/ మబ్బుల కొమ్మల చివర్ల/ వేలాడుతుంటాడా/ కోసుకోబోతేనే/ కిసిసి అంబరానికి అతుక్కుపోతాడు/.../

- సలీం

## కొత్తనెత్తురు




కవిత్వం

- డా॥ బద్దిపూడి జయరావు

వెల : రూ.75/- పేజీలు : 112

ప్రతులకు : 99490 65296

జయరావు కవిత్వంలో ఒక తీవ్రతుంది. ఆయన గుండెల్లో అగ్నిమంటలున్నాయి. మెదడులో అణువిస్ఫోటనాలున్నాయి. మాటలో సత్యనిగళత్వం ఉంది. ఈ మూడు ఆయన కవితకి ప్రవాహశీలతను తెచ్చాయి. కవిత్వంలో పర్సానిఫికేషన్ తగ్గించాడు. సోషలైజేషన్ బాగా విస్తృతం చేశాడు. చారిత్రక స్పృహను కూడా పెంచాడు.

- డా॥ కత్తి పద్మారావు

# డైరీ



జూన్1న విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ హాలులో సాహితీస్రవంతి, కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో కె. విల్సన్‌రావు, కె. ఆంజనేయకుమార్‌ల సంయుక్త కవితా సంపుటి 'తెల్లారితే..." ను ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్. చిత్రంలో కుడివైపు నుంచి ఖాదర్ మొహియుద్దీన్, కె. ఆంజనేయకుమార్, కొలకలూరి ఇనాక్, కె. విల్సన్‌రావు, రావెళ్ళ శ్రీనివాసరావు, అరసవిల్లి కృష్ణ




హైదరాబాద్‌లోని త్యాగరాయగానసభలో మే 29న జరిగిన సాహితీ కిరణం మాసపత్రిక వార్షికోత్సవ వేడుకలు. ఈ సందర్భంగా డా॥ పింగళి జగన్నాథరావు స్మారక పురస్కారాన్ని డా॥ ముక్తేవి భారతికి అందజేస్తున్న దృశ్యం. చిత్రంలో పెద్దూరి వెంకటదాసు, యం. అరుణకుమారి, డా॥ కళావెంకటదీక్షితులు, డా॥ నాళేశ్వరం శంకరం, సుధామ, పింగళి కమలాకేసరి, డా॥ పులిపర్తి కృష్ణమూర్తి, పొత్తూరి సుబ్బారావు.




హైదరాబాద్‌లో త్యాగరాయగానసభలో జూన్ 5న కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో డా॥ కేతవరపు రాజ్యశ్రీ కవితా సంపుటి 'ఆకసాన్ని మింగాలని' ఆవిష్కరణ సభ. చిత్రంలో డా॥ కె.వి. రమణాచారి, రంగనాథ్, డా॥ తిరునగరి, కళాదీక్షితులు తదితరులు



ఖమ్మం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలోని బోడేపూడి విజ్ఞానకేంద్రంలో సాహితీఅధ్యయనవేదిక తరపున జూన్15న జరిగిన చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న సాహితీస్రవంతి ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి. చిత్రంలో సంపటం దుర్గాప్రసాద్, సి. హెచ్. ఆంజనేయులు.




హైదరాబాద్‌లోని మోక్ష హోటల్‌లో మే 30న జరిగిన హెచ్‌ఐవి/ఎయిడ్స్ పై 59 మంది కథారచయిత్రుల కథల సంకలనం 'ఆశాదీపం', 70 మంది కవయిత్రుల కవితా సంకలనం 'చిగురింత ఆశ' పుస్తకాల ఆవిష్కరణ సభ. చిత్రంలో అక్కినేని విమల, సి. పార్థసారథి, అయినంపూడి శ్రీలక్ష్మి, మామిడి హరికృష్ణ తదితరులు.




జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో జూన్ 3న మహబూబ్‌నగర్ జిల్లా సీనియర్ కవయిత్రి జొన్నవాడ రాఘవమ్మ రచించిన 'భావ తరంగాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ యం. గిరిజా శంకర్. చిత్రంలో భీంపల్లి శ్రీకాంత్, కట్టా గిరిజ రమణ, డిఆర్ఓ రాంకిషన్, అడిషనల్ కలెక్టర్ డా. రాజారాం పున్నా తదితరులు ఉన్నారు.

## నివేదిక

# శ్రీశ్రీకి నివాళి



**హైదరాబాద్‌లో ...**

సాహితీ స్రవంతి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ 31వ వర్ధంతిసభ జూన్ 15న ట్యాంక్‌బండ్‌పై గల శ్రీశ్రీ విగ్రహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు తెలకపల్లి రవి శ్రీశ్రీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికలోకపు కళ్యాణానికి, శ్రామికలోకపు చైతన్యానికి శ్రీశ్రీ కవిత్వం రాశారని అన్నారు. బడుగు, బలహీనవర్గాల కోసం శ్రీశ్రీ తన ప్రస్థానం సాగించారని, శ్రీశ్రీ మహాప్రస్థానం పుట్టి ఇప్పటికి 80 ఏళ్లయ్యిందని చెప్పారు. శ్రీశ్రీ శత జయంతి సందర్భంగా సాహితీస్రవంతి 'శ్రీశ్రీ జయభేరి' అనే పుస్తకాన్ని తీసుకొచ్చిందని ప్రస్తావించారు. శ్రీశ్రీ చనిపోయి నేటికి 31వ సంవత్సరాలని అన్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రజల గుండెల్లో శ్రీశ్రీ చెరగని ముద్ర వేశారని అన్నారు. సాహితీ స్రవంతి హైదరాబాద్ నగర ప్రధానకార్యదర్శి జి. యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రముఖ రచయిత ద్వానాశాస్త్రి మాట్లాడుతూ శ్రీశ్రీ కర్షకుడిని వీరుడని మొట్టమొదట ప్రస్తావించాడని అన్నారు. రైతు ఎంతో పోరాటం చేస్తేగాని పంటను అందుకోలేడని, అదీ ఓ యుద్ధమేననీ, అందుకే అతన్ని వీరుడని శ్రీశ్రీ ప్రస్తుతించారని అన్నారు. కష్టజీవికి ఇరువైపులా నిలిచేవాడే కవి అని శ్రీశ్రీ నిరూపించారని అన్నారు. రాష్ట్రాలు విడిపోయినా ప్రతి ఒక్కరూ తెలుగుభాషాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గుంటూరు శేషేంద్రశర్మ తనయుడు, సాహిత్యాభిమాని సాత్యకి మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కవులకు వర్ధంతులుండవనీ, అన్నీ జయంతులేననీ, శ్రీశ్రీ ఆ కోవలోకి వస్తారని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త మల్లాది వెంకటకృష్ణ మాట్లాడుతూ శ్రీశ్రీ శ్రామికుల కోసం కవిత్వం రాయడం మొదలుపెట్టాకే ఇతరులు వారి గురించిన కవిత్వం రాశారని, అప్పటివరకూ అటువంటి కవిత్వమే లేదన్నారు. సాహితీస్రవంతి హైదరాబాద్ నగర అధ్యక్షులు తంగిరాల చక్రవర్తి మాట్లాడుతూ శ్రీశ్రీ వారసత్వాన్ని సాహితీస్రవంతి ఎప్పటికి కొనసాగిస్తుందని అన్నారు. సాహితీస్రవంతి నగర కార్యదర్శి శాంతిశ్రీ మాట్లాడుతూ అణగారిన వర్గాల్ని చైతన్యపరిచేందుకు శ్రీశ్రీ కవిత్వం రాశాడని, ఆ ప్రస్థానం నాటి నుండీ నేటికీ కొనసాగుతుందనీ, మనమంతా ఆ ప్రస్థానంలో భాగస్వాములు కావాలని అంటూ వందన సమర్పణ చేశారు. ఈ సభలో ప్రజానాట్యమండలి హైదరాబాద్ నగర కార్యదర్శి సైదులు ఆధ్వర్యంలో కళాకారులు శ్రీశ్రీ గీతాలను ఆలపించి, అలరించారు. ఇంకా సభలో గేరా, కిషోర్, నరేష్, మోహన్‌కృష్ణ, వెంకట్, కవులు పొత్తూరి సుబ్బారావు, మహేష్, అర్జున్ , ఇతర సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'పదండి ముందుకు.. పదండి తోసుకు' 'మహా ప్రస్థానం వర్ధిల్లాలి'వంటి నినాదాలు స్వయంగా తెలకపల్లి రవిగారు ఇస్తే మిగిలిన వారంతా గొంతు కలిపారు.

**– అనంతోజు మోహనకృష్ణ**

**ఖమ్మంలో ...**

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రతీ నెలా జరిగే సాహితీ స్రవంతి అధ్యయన వేదిక సమావేశం జూన్ నెల మూడవ ఆదివారం ప్రత్యేకంగా శ్రీశ్రీ వర్ధంతి సమావేశంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు సాహితీ స్రవంతి సభ్యులు ఖమ్మం బైపాస్ రోడ్‌లోని శ్రీశ్రీ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. పట్టణంలోని కవులు మువ్వా శ్రీనివాసరావు, సంపటం దుర్గా ప్రసాదరావు, కపిల రాంకుమార్, రౌతు రవి, కె. ఆనందాచారి, ప్రముఖ విద్యా సంస్థల అధిపతులు రమణారావు, వీరారెడ్డి, రాఘవరావు, ప్రముఖ వైద్యుడు డా. భారవి, ఇతర సాహితీ



అభిమానులు, పాల్గొన్నారు. సాయంత్రం బోడేపూడి విజ్ఞాన కేంద్రం గ్రంథాలయంలో సమావేశం జరిగింది. శ్రీశ్రీ గేయాలను ఎం.శేషగిరి, కన్నెగంటి వెంకటయ్య, సంపటందుర్గా ప్రసాదరావు ఆలపించారు. శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం, ఖడ్గసృష్టి సంకలనంలోని కవితలు సునంద, శైలజ, . టి.లక్ష్మి, జయప్రద మున్నగువారు చదివారు. శ్రీశ్రీపై నాగభైరవకోటేశ్వరావు రాసిన గేయాన్ని కపిల రాంకుమార్ చదివారు. కె.ఎల్.యూనివర్సిటి అనువాద విభాగంకు చెందిన మోహనాచార్యులు మాట్లాడుతూ నేటి పాఠశాలల, కళాశాల విద్యార్థులకు శ్రీశ్రీ కవిత్వాన్ని పరిచయం చేయవలసివుందని తెలిపారు. డా. పి. సుబ్బారావు మాట్లాడుతూ కవిత్వాన్ని విశ్వజనీనం చేయటంలో అతని కృషి అనితర సాధ్యం, దానిని ఎవరూ అధిగమించలేదు. విశ్వనాథను గౌరవించినట్లే, గురజాడను, తిక్కనను, వేమననూ గౌరవించాడు. పద్య చందస్సు, మాత్రాచందస్సు, గేయం, వచన కవిత,అంతే కాక కవిత్వంలో విభిన్న ధోరణులను సృజించినవాడు. మహా ప్రస్థానం ఒక భగవద్గీతలా కొత్తగా కవిత్వం రాసేవారు చదవాల్సివుందని నొక్కివక్కాణించారు. డా.కవితాంజనేయులు శ్రీశ్రీ కవితలలోని కొన్ని సోదాహరణగా వివరించారు. ఎం.శేషగిరి 'ఏ దేశ చరిత్ర చూసినా' గీతాన్ని ఆలపించి వందన సమర్పణ చేసారు.

**- కపిలరాంకుమార్**

**ఆదోనిలో ...**

కర్నూలు జిల్లా ఆదోని డివిజన్‌లో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభ జూన్ 15న సాయంత్రం యుటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. డివిజన్ అధ్యక్షులు ఆవుల బసప్పు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి కెంగార మోహన్, జి.నల్లారెడ్డి, కరేపాకుల రఘురాంలు ప్రసంగించారు. తెలుగు కవిత్వాన్ని సామాన్యుల చెంతకు చేర్చిన మహనీయుడు శ్రీశ్రీ అని వక్తలు కొనియాడారు. వచన కవిత్వంలో విప్లవాత్మక మార్పు వచ్చేందుకు కవిత్వాన్ని అస్త్రంగా చేసుకుని, సామాన్యుని పక్షాన నిలిచిన యుగకవి అన్నారు. పేదల కన్నీళ్ళే శ్రీశ్రీ




***కర్నూల్‌లోని ఆదోని డివిజన్‌లో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభ. చిత్రంలో కెంగార మోహన్, ఆవుల బసప్పు, జి. నల్లారెడ్డి, కరివేపాకుల రఘురాంలు.***

సిరాచుక్కలని, ఆకలితో అలమటించే అభాగ్యుల కోసం శ్రీశ్రీ కలం పట్టాడన్నారు. కార్మిక, కర్షక పక్షపాతిగా శ్రామికవర్గ పోరాట కలం యోధుడు శ్రీశ్రీ సాహితీచరిత్రలో చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్నాడన్నారు. సమసమాజ స్థాపనే ధ్యేయంగా కవిత్వాన్ని రాసిన కవి శ్రీశ్రీ అని, శ్రీశ్రీ రచనలు యువతరానికి స్ఫూర్తి కలిగిస్తాయన్నారు. అంతకుముందు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తెలుగుజాతికి కృషి చేసిన మహాకవుల జయంతి, వర్ధంతి సభలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వక్తలు కోరారు. ఈ సభలో డి. రాందాస్, ప్రేమ్, రుద్రముని, హనుమంతులు పాల్గొని సందేశమిచ్చారు.

**- ఆవుల బసప్ప**

**విశాఖలో ...**




విశాఖ సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూన్ 15న మహాకవి శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని విశాఖపట్నంలోని శ్రీశ్రీ విగ్రహానికి శాసనమండలి సభ్యులు యం.వి.యస్. శర్మ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రమణాచలం, ఎ.వి. రమణమూర్తి, చలపతి, నూనెల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖలోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో 'ప్రజాస్వామ్యం-ఎన్నికల సంస్కరణలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం ఏర్పడుతుందని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీల్లో అత్యధిక శాతం మంది ధనవంతులేనని, వారంతా బడా బాబుల పక్షాన ఉంటూ, వారి సంక్షేమానికి పాటు పడుతున్నారు తప్ప పేదల పక్షాన నిలబడటం లేదని అన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలన్నారు. కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులను చట్టసభలకు ఎన్నుకోవాలనికోరారు. ఎయు జర్నలిజం విభాగం ప్రొఫెసర్ బాబీవర్ధన్ మాట్లాడుతూ,

## డైరీ

1990నుంచి భారత్‌లో సంకీర్ణ ప్రభుత్వాలే పాలన సాగిస్తున్నాయని చెప్పారు. దాదాపు అన్ని దేశల్లోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల్లో ధనం, మద్యం ప్రభావం నానాటికి ఎక్కువవుతోందని, దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రాజకీయం కూడా వ్యాపారం అయిపోయిందన్నారు. ఎన్నికల్లో గెలిచిన నాయకులు ఎంత ఖర్చు పెట్టాం... ఎంత వస్తుందని చూస్తున్నారే తప్ప ప్రజల అభివృద్ధికి కృషి చేయడం లేదని విమర్శించారు. చట్టసభల్లో 47 శాతం మంది నేరస్తులే ఉన్నారన్నారు. గుజరాత్ అభివృద్ధి గురించి మాట్లాడుతూ, యూనిట్ కరెంట్ రూ.10కిఇవ్వడమే గుజరాత్ అభివృద్ధా అని ప్రశ్నించారు. దేశం మొత్తమ్మీద ఇక్కడే కరెంటు చార్జీలు ఎక్కువని అన్నారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్ పద్మనాభరాజు మాట్లాడుతూ, శ్రీశ్రీ విశాఖలో జన్మించడం మనకు గర్వకారణమని అన్నారు. ఆయన తన సాహిత్యంతో సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసి, తన కవిత్వం ద్వారా ప్రజలను చైతన్య పరిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విజయనగరంలో-**

విజయనగరం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూన్ 15న శ్రీశ్రీ వర్థంతి సభ గురజాడ స్వగృహంలో జరిగింది. బి.



ఈశ్వరమ్మ పాటతో ప్రారంభమైన ఈ సభలో సాహితీస్రవంతి కో కన్వీనర్ ఎస్.వి.ఆర్. కృష్ణారావు మాట్లాడుతూ పేరులోనే రెండు 'శ్రీ'లను పెట్టుకున్న మహాకవి శ్రీశ్రీ సమాజంలోని అసమానతలపై తన కలాన్ని ఎక్కుపెట్టారన్నారు. పి.వి. రావు మాట్లాడుతూ శ్రీశ్రీ పేరులోనే అభ్యుదయం ఉందన్నారు. విజయాదిత్య మాట్లాడుతూ అభ్యుదయ రచనలకు ప్రాచుర్యం తెచ్చిన కవి శ్రీశ్రీ అన్నారు. చీకటి దివాకర్ మాట్లాడుతూ ప్రాపంచిక దృక్పథంతో జీవితాన్ని, రాజకీయాన్ని, సాహిత్యాన్ని శ్రీశ్రీ సాగించారన్నారు. కె. అనురాధ 'పలక ఆత్మకథ' మినీ కథను చదివి వినిపించారు. విజయాదిత్య, శారదాప్రసాద్, చీకటి చంద్రిక, బాలకృష్ణ, మొయిద శ్రీనివాస్, పాపయ్య, ఎ.వి. రమణమూర్తి, వి. నర్సింగం తదితరులు కవితలను, నాగేంద్రప్రసాద్, చళ్ళపిళ్ళ శ్యామల తదితరులు పాటలను వినిపించారు.

**- వి. సృజన**

## స్పందన | జూన్ సంచికలోని పరిశీలన ఆకట్టుకుంది

పుస్తకం మొత్తం ప్రజాహితం కోసం సాహిత్యానికి అగ్రస్థానం ఇస్తూ 'ప్రస్థానం' సాగిస్తున్న సాహిత్య ప్రస్థానంలో ముందుగా నేను చదివేది 'పరిశీలన' శీర్షిక. ఒక వ్యక్తికి ఎంత ఉత్సుకత ఉన్నా, ఉన్న పరిమితుల వల్ల ప్రపంచంలో వెలువడే అన్ని పుస్తకాల గురించి తెలుసుకునే అవకాశం తక్కువ. ఆ లోటును పరిశీలన ప్రాంతీయ భాషా రచనలని విశ్లేషణ చేయడం ద్వారా కొంతవరకు తీరుస్తోంది. ఆ క్రమంలో జూన్ సంచికలో వచ్చిన పరిశీలన విశ్లేషణ నన్నాకట్టుకుంది. ముఖ్యంగా అందులో ఇటీవలి కొత్త ప్రభుత్వాల ప్రధాన లక్ష్యం అయిన రైతు శ్రేయానికి గండికొడ్తున్న అపరిమిత రుణాలు, కడగండ్లకు అద్దంపట్టిన నల్లూరి రుక్మిణి కథల పరిశీలన. అసలిలా ఎన్నికలొస్తేనే గుర్తొచ్చే వ్యవస్థ కాదు వ్యవసాయం. దీని సంక్షోభాలకు శాశ్వత పరిష్కారం ఏలినవారు నిరంతరం తీసుకోవల్సిన ఆవశ్యకతను పరోక్షంగా ఈ కథలు చెప్పాయి. అంతర్జాల అభివృద్ధి ఆకాశమంత సాగుతున్నట్లున్నా, నేటికీ దేశజనాభాలో 72 శాతం భూమినే నమ్ముకుని బ్రతుకుతున్నారన్న ఇందులోని వాక్యం అసలు సిసలైన భూవాస్తవం (గ్రౌండ్ రియాల్టీ). అలాగే ఈ సంచికలోని 'అంతరాలు' కథ ఎంత కాదనుకున్నా జీవిక రంధిలో పడి జీవన మూల్యాలకి మంగళం పాడుతున్న అనేకానేక సంసారాల గమనానికి చిరునామాల అనిపించింది. అయితే తల్లిదండ్రులు సరిగ్గా ఆప్యాయతలందివ్వలేదన్న కీలకకారణమే మా ఈ విచిత్రపోకడలకి కారణం అని చెప్పుకొచ్చిన జీవిత అభిప్రాయాన్ని వాదం కోసం ఒప్పుకున్నా అసలు తనకు జరిగిన ఉదంతాన్ని తల్లికి తెలుపడం ఎందుకో మరి! అంటే మళ్లీ ఇక్కడ 'అంతరాలు'ను అధిగమిస్తూ ఆప్యాయతలకు ఆత్మీయతలకీ పెద్దపీట వేయడమే కదా! ఈ అంశాన్ని సరిగ్గా వివరిస్తే కథకింకా పరిపూర్ణత చేకూరేది.

**- వి. బి. శంకర్**
**సికింద్రాబాద్**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# గుర్రం జాషువా

28.09.1895 – 24.07.1971



అట్టడుగు కులంలో పుట్టి అనేక అవమానాలు ఎదుర్కొని నిలబడ్డారు. 'గబ్బిలం' వంటి ఖండ కావ్యాలతో దళితుల హృదయవేదనను అద్భుతంగా ఆవిష్కరించారు. 'పిరదౌసి', 'కాందిశీకుడు', 'ముంతాజ్‌మహల్' వగైరా ఖండకావ్యాలు రాసి కవికోకిల, నవయుగ కవి చక్రవర్తి అని బిరుదులు పొందారు.

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/13-15
Date of Positng : 30.06.2014 . Date of Publication: 25.06.2014


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




వెల: రూ. 100/-




వెల: రూ. 25/-




వెల: రూ. 50/-




వెల: రూ. 60/-




వెల: రూ. 40/-




వెల: రూ. 50/-




వెల: రూ. 30/-




వెల: రూ. 50/-




వెల: రూ. 40/-




వెల: రూ. 70/-



## సాహిత్య ప్రస్థానం తెలుగు సాహిత్య మాసపత్రిక

సాహిత్య
ప్రస్థానం



**సంవత్సర చందా కేవలం- రూ.120/- మాత్రమే**

**తెలుగు సాహిత్య కృషిని ప్రోత్సహించండి! తెలుగు భాషా వికాసానికి మీ వంతు సహకరించండి!**

వివరాలకు: సాహిత్య ప్రస్థానం, ప్లాట్ నెం.21/1, యం.హెచ్. భవన్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్- 500 020, ఫోన్: 040-27668861, సెల్: 9490099059
Email- ssprasthanam@gmail.com

**www.prasthanam.com**
ప్రస్థానం వెబ్‌సైట్‌ను
తప్పక చూడండి!

ప్రత్యేక తగ్గింపు
5 సంవత్సరాల చందా: రూ.600 -100: 500/- మాత్రమే
10 సంవత్సరాల చందా రూ.1200-200 : 1000/- మాత్రమే
అంతేకాదు సుమారు 1000 రూపాయల పాత ప్రస్థానాలు ఉచితం!
ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు అదనం


If Un delivered please return to : Prasthanam, C/o M.H.Bhavan, Plot No. 21/1, Azamabad
Near RTC Kalyanamandapam, Hyderabad - 500 020 (A.P), Ph: 040-27660013, Cell: 9490099059
Website : www.psbh.in